




ESTD: 1999

www.voodayam.com

# వుదయం

సంపుటి : 27
సంచిక : 106 | హైదరాబాద్ |18-06-2026 గురువారం

SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY

రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on







## రూ.15 కోట్లతో

## త్వరలోనే 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'



# అంతర్జాతీయ తెలంగాణ పబ్లిక్ స్కూల్

> "ప్రభుత్వ బడుల్లో చదవడం నామోషీ అనే భావన సమాజం నుంచి పోవాలి. నాడు సర్కారు బడుల్లో చదివిన ఎందరో మహానుభావులు నేడు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా, ముఖ్యమంత్రులుగా దేశాన్ని నడిపిస్తున్నారు."
>
> - సీఎం రేవంత్‌రెడ్డి

- ఇంటిగ్రేటెడ్ పాఠశాలలతోనే కుల వ్యవస్థ నిర్మూలన
- రూ.27 వేల కోట్లతో విద్యా వ్యవస్థ ప్రక్షాళన
- రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు
- సమాజ మార్పునకు నాణ్యమైన విద్యే మార్గం

**ఆరుట్ల, జూన్ 17 (వుదయం) :**
రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ఒక దిక్సూచిలా, స్ఫూర్తిప్రదాతగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూ.15 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్'ను ముఖ్యమంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని డిజిటల్ క్లాస్‌రూమ్స్, అత్యాధునిక ల్యాబ్స్, లైబ్రరీ, అధునాతన కిచెన్ మరియు డైనింగ్ హాల్‌ను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన సీఎం, అక్కడి ఆహ్లాదకరమైన మైదానంలో పిల్లలతో సరదాగా ఫుట్‌బాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు.

**గత పాలకులపై విమర్శలు.. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు ప్రాధాన్యం**
గత ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలకులు వర్గానికొక స్కూల్ పెట్టి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ సమాజంలో కుల వ్యవస్థను మరింత ప్రోత్సహించారని మండిపడ్డారు. ఈ కుల వివక్షను, వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకే తమ ప్రభుత్వం 'ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను' ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, ప్రపంచస్థాయిలో నిలబెడతామన్నారు.

**క్రీడలకు ఊతం.. విమర్శలపై కౌంటర్**
క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు త్వరలోనే 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ప్రారంభిస్తామని సీఎం ప్రకటించారు. యువ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకు అంతర్జాతీయ ఫుట్‌బాల్ స్టార్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తామని ప్రకటిస్తే కొందరు విపక్ష నేతలు అనవసర విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నాణ్యత లేని యూనిఫామ్‌లు నెల రోజులకే చిరిగిపోయేవని, కానీ తమ ప్రభుత్వం అత్యంత నాణ్యమైన వస్తువులతో కూడిన 'విద్యా కిట్లను' అందిస్తోందని తెలిపారు. ఈ విద్యా కిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిస్తే.. అందులో రూ.2 వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన విడ్డూరంగా మాట్లాడుతున్నారని, అసలు రూ.680 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల అవినీతి ఎలా సాధ్యమో ఆ మేధావి సమాజానికి చెప్పాలని సీఎం ఎద్దేవా చేశారు. విద్యా రంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం



**ఫ్రాన్స్:**
వ్యూహాత్మక హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండకూడదని, అక్కడ అంతర్జాతీయ నిబంధనల ప్రకారం పూర్తి స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 (G7) సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరు దేశాల అధినేతలు ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వేలాది మంది భారతీయ నావికుల భద్రతపై ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. మన నావికుల రక్షణే భారత్‌కు అత్యంత ముఖ్యమైన అంశమని, వారికి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. పశ్చిమాసియా శాంతికి ట్రంప్ కృషి అభినందనీయం పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతల స్థాపన కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన కృషిని ప్రధాని మోదీ ఈ సందర్భంగా అభినందించారు. హర్మూజ్ జలసంధిని అంతర్జాతీయ వాణిజ్యానికి తెరిచి ఉంచడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు చేకూరిందని ఆయన విశ్లేషించారు.

> **"హర్మూజ్ జలసంధి అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన మార్గం. అక్కడ శాంతియుత వాతావరణం ఉండటం ప్రపంచ దేశాల ఆర్థిక పురోగతికి ఎంతో అవసరం."**
> **— ప్రధాని నరేంద్ర మోదీ**

త్వరలోనే భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్, అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇరు దేశాల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, త్వరలోనే ఒక సమగ్రమైన వాణిజ్య ఒప్పందం కుదరబోతోందని ఆయన కీలక ప్రకటన చేశారు. ఈ భేటీతో భారత్‌అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత ముందడుగు వేసిందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి.

## హైదరాబాద్‌లో రూ.100 కోట్లతో ఇన్నోవేషన్ పార్కు

**హైదరాబాద్ జూన్ 17 (వుదయం) :**



ప్రముఖ విద్యాసంస్థ 'బిట్స్ పిలానీ' క్యాంపస్‌లో రూ.100 కోట్ల భారీ వ్యయంతో సరికొత్త 'ఇన్నోవేషన్ పార్కు' ఏర్పాటు కానుంది. దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్, బిట్స్ పిలానీ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక పరిశోధన, నూతన సాంకేతికత మరియు వినూత్న ఆవిష్కరణల) విభాగాల్లో పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఈ పార్కు వేదికగా నిలవనుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేయడంలో ఈ ఇన్నోవేషన్ పార్కు కీలక పాత్ర పోషించనుందని నిర్వాహకులు తెలిపారు.

## టెలిగ్రామ్ నిషేధం.. పేపర్ లీక్ వాట్సప్‌లో లీకైతే దానిని కూడా బ్యాన్ చేస్తారా?

# విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్న కేంద్రం

**న్యూఢిల్లీ, జూన్ 17 (ఏఎంఎస్) :**
నీట్ పునఃపరీక్ష వివాదం నేపథ్యంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడాన్ని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం.. దొంగను పట్టుకోవడానికి బదులుగా, బాధితుడి ఇంటి తలుపునకు తాళం వేసినట్లు ఉందంటూ ఆయన ఎద్దేవా చేశారు. విద్యా నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, సందేహాల నివృత్తి, పరీక్షల ప్రిపరేషన్ కోసం దేశంలోని లక్షలాది మంది విద్యార్థులు ఎప్పటినుంచో టెలిగ్రామ్ యాప్‌ను నమ్ముకున్నారని, ఇప్పుడు దీనిపై హఠాత్తుగా నిషేధం విధించడం వల్ల వారంతా తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అసలు టెలిగ్రామ్‌ను బ్యాన్ చేయడం వల్ల పేపర్ లీక్‌లను ఎలా అరికట్టగలరని ఆయన కేంద్రాన్ని ప్రశ్నించారు. నిందితులు టెలిగ్రామ్ కాకపోతే రేపు వాట్సప్‌లోనూ ప్రశ్నపత్రాలు లీక్ చేస్తారని.. మరి దానికి కూడా వాట్సప్‌ను బ్యాన్ చేస్తారా? అని నిలదీశారు. విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్న కేంద్రం కేంద్ర ప్రభుత్వ తీరు పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే పేపర్ లీక్ నెట్‌వర్క్‌లను కాకుండా, అమాయక విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉందని రాహుల్ గాంధీ ఆక్షేపించారు. నీట్ అభ్యర్థులకు జరిగిన ఘోర అన్యాయం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే మోదీ ప్రభుత్వం ఈ తరహా ఎత్తుగడలకు పాల్పడుతోందని విమర్శించారు. దేశంలో పదేపదే జరుగుతున్న పేపర్ లీక్‌ల సూత్రధారులపై, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో మోదీ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఒకవేళ ప్రభుత్వం మొండిగా వ్యవహరించి తమ మాట వినకపోతే, ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కులను ఎలా సాధించుకోవాలో దేశ యువతకు బాగా తెలుసని రాహుల్ గాంధీ హెచ్చరించారు.



## ఎన్నికలు ఎప్పుడొచ్చినా

# గెలిచేది బీఆర్ఎస్సే

### ■ ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

**కూసుమంచి, జూన్ 17 (వుదయం) :**
రాష్ట్రంలో పేద ప్రజలకు కొత్త ఇళ్లు నిర్మించి ఇవ్వడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం, ఉన్న ఇళ్లను కూలగొడుతూ పైశాచిక ఆనందం పొందుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పార్టీ కార్యకర్తలకు 'ఎస్ఐఆర్' (SIR) అంశంపై బుధవారం వెంకటగిరి వద్ద ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ నియంత హిట్లర్ తనకు స్ఫూర్తి అని ముఖ్యమంత్రే స్వయంగా చెప్పుకోవడం ఆయన ఉన్మాద నిజస్వరూపానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రితో పాటు ఆయన మంత్రిమండలి ప్రజా బాగోగులను పూర్తిగా విస్మరించి, రాష్ట్రాన్ని యథేచ్ఛగా దోచుకుంటోందని ఆరోపించారు.

**మంత్రి పొంగులేటిపై భూకబ్జా ఆరోపణలు**
స్థానిక మంత్రిపై కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికార బలంతో పెద్దఎత్తున భూకబ్జాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకుల అక్రమాలను, ప్రజావ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



> **"రాష్ట్రంలో ప్రజాపాలన పేరిట అరాచక పాలన సాగుతోంది. హిట్లర్ మార్గంలో నడుస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్పడం ఖాయం."**
> **— కేటీఆర్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు**

ఓటరు జాబితాపై అప్రమత్తంగా ఉండాలి
రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం బీఆర్ఎస్‌దేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు, నాయకులు పూర్తి అంకితభావంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ పట్ల అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, విపక్షాల కుట్రల వల్ల ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత గులాబీ శ్రేణులపై ఉందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహా ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత్‌కు షాకిచ్చిన అమెరికా..!

**న్యూఢిల్లీ, జూన్ 17 (ఏఎంఎస్) :**
ఇండో పసిఫిక్ ప్రాంతంలో భారత్ తమకు కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని ఒకప్పుడు చాటిచెప్పిన అమెరికా.. ఇప్పుడు గట్టి షాకిచ్చింది. ఈ ప్రాంతంలో పనిచేసే అగ్రరాజ్య సైనిక కమాండ్ పేరు నుంచి 'ఇండో' అనే పదాన్ని తీసేసింది. అంతేకాదు.. భారత చిత్రపటాన్ని కూడా మార్చి చూపించడం వివాదాస్పదమైంది. జీ 7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.అమెరికాకు చెందిన చారిత్రక 'యూఎస్ ఇండోపసిఫిక్ కమాండ్' పేరును మళ్లీ 'యూఎస్ పసిఫిక్ కమాండ్'గా మార్చినట్లు అగ్రరాజ్య రక్షణ శాఖ వెల్లడించింది. ''చారిత్రక మూలాలను గౌరవించడం, పసిఫిక్‌లో సేవలందించే సైనికుల్లో స్ఫూర్తి పెంపొందించడం కోసం ఈ కమాండ్‌కు పాత పేరునే కొనసాగించాలని నిర్ణయించాం'' అని అమెరికా రక్షణశాఖ పేర్కొంది.

## ప్రజా తీర్పును మోసం చేస్తే ఊరుకోం

**న్యూఢిల్లీ, జూన్ 17 (ఏఎంఎస్) :**
మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) మరోసారి తీవ్ర రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయినట్లు కనిపిస్తోంది. ఆ పార్టీకి చెందిన పలువురు లోక్‌సభ సభ్యులు ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని అసలు శివసేన పార్టీలో చేరేందుకు సిద్ధమయినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ ఊహాగానాల నడుమ శివసేన (యూబీటీ) కీలక నేత, ఎంపీ సంజయ్ రౌత్ ఢిల్లీలో అత్యవసరంగా నిర్వహించిన మీడియా సమావేశం చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశానికి ఆ పార్టీ తరపున కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరు కావడం చీలిక వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఈ సందర్భంగా పార్టీ మారే యోచనలో ఉన్న రెబల్‌స్‌ను ఉద్దేశించి రౌత్ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. తన వ్యాఖ్యలను పత్రికలు, ఛానళ్లు 'బీప్' చేయవద్దని పాత్రికేయులను కోరడం అక్కడి ఉద్రిక్తతకు అద్దం పడుతోంది.

**చట్టపరమైన పోరాటానికి సిద్ధం**
ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో తమ పార్టీ చట్టపరమైన చర్యలను ఇప్పటికే ప్రారంభించిందని సంజయ్ రౌత్ స్పష్టం చేశారు.



ఇటీవల పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో జరిగిన చీలికలను సైతం ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశంలో పార్టీలను ఇలా ముక్కలు చేసుకుంటూ పోతే ఇక ఎన్నికలు నిర్వహించి, పోటీ చేయడంలో అర్థమేముంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2022లో ఏక్‌నాథ్ శిందే తిరుగుబాటు చేయడంతో శివసేన రెండుగా చీలిపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో పార్టీ పేరు, అధికారిక విల్లుఅంబుల గుర్తు శిందే వర్గానికి దక్కగా.. ఉద్ధవ్ వర్గం 'శివసేన (యూబీటీ)'గా ఏర్పడింది. ప్రస్తుతం లోక్‌సభలో ఈ పార్టీకి 9 మంది ఎంపీల బలం ఉండగా, తాజా పరిణామాలు ఉద్ధవ్ క్యాంప్‌లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.




# కొత్త అధికారులకు టీఎన్జీవోస్ ఘన సన్మానం



సంగారెడ్డి, జూన్ 17:వు దయం.

సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్‌కు నూతన పరిపాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మిని, సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎం.డి. నయీంను టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి. జావిద్ అలీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తానని, ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రూరల్ ఎస్‌హెచ్‌ఓ ఎం.డి. నయీం మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులకు అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి వేల్పూర్ రవి, అసోసియేట్ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కార్యదర్శి నిర్మల రాజకుమారి రాథోడ్, రాష్ట్ర నాయకుడు గౌస్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, సహకార శాఖ ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ




**- ప్రిన్సిపల్ ఆర్ మాన్య నాయక్**

**అయిజ జూన్ 17 (వుదయం ప్రతినిధి)**

స్థానిక ఐజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రోజు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ప్రిన్సిపల్ మాన్య నాయక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అభ్యసించడానికి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను ఇవ్వడం జరిగిందని తెలుపుతూ అదేవిధంగా అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు ముఖ్యంగా విశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన తరగతి గదులు, బోధనలో నైపుణ్యతను పెంచడం కోసం, విద్యార్థులకు ఆసక్తి పెంచడం కోసం గ్రీన్ బోర్డులు, డిజిటల్ టీవీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండడం కోసం శుభ్రమైన త్రాగునీటి సౌకర్యంతో పాటు శుభ్రమైన టాయిలెట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల మానసిక నైపుణ్యాన్ని శారీరక నైపుణ్యాన్ని పెంచడం కోసం ప్రతి రోజు యోగ, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి మంచి ఫలితాలు పొందాలన్నారు. అదేవిధంగా మండలంలోని పదవ తరగతి పాసైన విద్యార్థులు వెంటనే అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొంది పై సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, విద్యావంతులు, మీడియా మిత్రులు కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి శశిధర్ రెడ్డి, జి రాజేందర్, ఎం చలపతి రెడ్డి , ఎం కృష్ణ వర్ధన్, కే శ్రీరాములు, ఎం గాయత్రి, బాలస్వామి, నరేష్ కుమార్, ఎండి జహంగీర్ అలీ, ఎండి రహమత్, ఇస్మాయిల్, శ్యాం ప్రసాద్, లైబ్రేరియన్ ఎం రంగన్న, అధ్యాపకేతర సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ వెంకట రాములు, జూనియర్ అసిస్టెంట్ మధు, అటెండర్ దొడ్డన్న, గోవిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పోరాడాలి



**- డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్**

**- సర్ పై బి ఎల్ ఏ లకు అవగాహన శిక్షణ కార్యక్రమం**

**అయిజ జూన్ 17 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం లో తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ పై నియోజకవర్గం లోని 291 పోలింగ్ బూత్ ఏజెంట్లకు కొత్త ఓటర్లను చేర్చడం, మరణించిన లేదా స్థానికంగా నివాసం ఉందని వారి ఓట్లను తొలిగించే అంశాలపైన వివరణ ఇవ్వడం జరిగింది. బి ఎల్ ఏ విధులు, బాధ్యతలు, హక్కుల గురించి ట్రైనర్ కేతురి వెంకటేష్, వారి బృందం అత్యంత క్లుప్తంగా బి ఎల్ ఏ లకు వివరించడం జరిగింది. సర్ ప్రక్రియ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే కుట్రలకు కాంగ్రెస్ పార్టీ గట్టిగా ఎదురొడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ – బీఆర్ఎస్ పార్టీలు అధికారంలోకి రావడానికి రాజ్యాంగ విరుద్ధమైన విధానాలకు పాల్పడుతూ, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నాయని ఏఐసీసీ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ విమర్శించారు

ఓటు హక్కు పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది అని సంపత్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి, సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ సంకాపురం రాముడు, మున్సిపల్ కౌన్సిలర్ లు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



**- కోస్గిలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**

**నారాయణపేట జూన్17 (వుదయం ప్రతినిధి)**

నారాయణ పేట జిల్లాలోని కోస్గి మున్సిపాలిటీ పరిధి లో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. టీయూఎఫ్ ఐ డీ సీ, కడ, ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ. 352.50 కోట్ల వ్యయంతో కోస్గి పట్టణం లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి కాలువలు, ప్రధాన అనుసంధాన రహదారులు , అంతర్గత సి.సి రోడ్లు, నీటి సరఫరా వ్యవస్థ తదితర అభివృద్ధి పనులు కొనసాగుతుండగా బుధవారం జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను కొడంగల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ ఏ తిరుపతి రెడ్డితో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా కలెక్టర్ కోస్గి పట్టణంలోని సైన్స్ మ్యూజియం, డంపింగ్ యార్డ్, ప్రధాన అనుసంధాన రహదారులు, శంభుని గుడి ఆలయ ప్రాంతాలను సందర్శించారు. డంపింగ్ యార్డు ప్రహరీ చుట్టూ పొడవైన చెట్లు నాటాలని సూచించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇప్పటి నుంచి తడి పొడి చెత్తతో పాటు శానిటరీ, మెడికల్ వేస్ట్ చెత్త నాలుగు రకాలుగా సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. డంపింగ్ యార్డులో రెండు షెడ్డుల నిర్మాణం మూడు నెలల్లో పూర్తి అవుతుందని ప్రజారోగ్య శాఖ ఈ ఈ కలెక్టర్ కు తెలిపారు. అనంతరం కలెక్టర్ శంభుని గుడి వద్ద జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. శంభుని ఆలయానికి సంబంధించిన భూములు కబ్జాలో ఉన్నాయని, సర్వే చేయించాలని కోస్గి మున్సిపల్ చైర్మెన్ నరేందర్ కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ సర్వే చేయించాలని తహసిల్దార్ బక్క శ్రీనివాస్ ను ఆదేశించారు.ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన కలెక్టర్....కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు తిమ్మాయి పల్లి లో సాయిలు అనే లబ్ధిదారునికి చెందిన నూతన ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త ఇంటి గృహ ప్రవేశం చేసుకోవడంపై లబ్ధిదారుని అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్న కలెక్టర్ కుటుంబీకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ ఏ. తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నాగుల నాయక్, కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్, బుద్వేల్ వరకు చేపట్టబోయే రేడియల్ రోడ్ లో భాగంగా ఆకస్మిక తనిఖీ కోస్గి లోని ఈ సీ జీ, డిజిటల్ ఎక్స్ రే, ల్యాబ్, లేబర్ రూమ్ ను పరిశీలించారు. మక్తల్, కోస్గి పట్టణాలతో పాటు జిల్లా కేంద్రానికి అత్యాధునిక పరికరాలతో (ఆక్సిజన్, వెంటిలేటర్ తో) కూడిన అంబులెన్స్ లు అవసరమని, వాటిని సీ. ఎస్.ఆర్ నిధులతో సమకూర్చే విషయంపై కలెక్టర్ , కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్ ఛార్జీ తిరుపతి రెడ్డి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త తో చర్చించారు. చంద్ర వంచ లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలన కోస్గి మండలంలోని చంద్ర వంచ గ్రామంలో గీతా మహేశ్వరి అనే లబ్ధిదారురాలు మీవన్ టెక్నాలజీ( షేర్ వాల్)తో నిర్మింప చేసిన ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్ ఛార్జ్ ఏ.తిరుపతి రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. మీవన్ టెక్నాలజీ తో నిర్మించిన ఇల్లు ఇందిరమ్మ ఇంటి నిబంధనల ప్రకారమే ఉందా లేదా అని పీడీ శంకర్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నిబంధనల ప్రకారమే కొత్త టెక్నాలజీతో నిర్మించుకున్నారని, గ్రామంలో మిగతా ఇళ్ల నిర్మాణాలను ఇదే టెక్నాలజీలో చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి కనబరుస్తున్నారని, కానీ రూ.5 లక్షల కంటే ఎక్కువ ఖర్చు అవుతుందని, అదనంగా డబ్బులు పెట్టుకునే పరిస్థితి లబ్ధిదారులతో లేదని, గ్రామ సర్పంచి విద్యావతి కలెక్టర్ కు తెలిపారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎండి సలీం

**నారాయణపేట టౌన్ జూన్17 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పేట పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్.సలీం ను అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా బుధవారం డిసిసి అధ్యక్షులు కె. ప్రశాంత్ రెడ్డి ప్రకటించారు.ఈ సందర్భంగా మహమ్మద్ సలీం మాట్లాడుతూ పార్టీ అధిష్టానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో నారాయణపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించే అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి రుణపడి ఉంటానని అన్నారు.తాజాగా తన సేవలను,పార్టీ పట్ల అంకితభావాన్ని గుర్తించి కీలకమైన జిల్లా ప్రధాన కార్యదర్శి పదవిని అప్పగించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీ వాకిటి శ్రీహరికి,నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి,డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డికి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కుంభం శివకుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత చిత్తశుద్ధితో పనిచేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సహకారంతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే తన రాజకీయ ప్రస్థానంలో అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు నారాయణపేట ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని మహమ్మద్ సలీం స్పష్టం చేశారు.

# పరిహారం లేదు...పంటలు వేయొద్దంటూ హుకుం...!

**- పేరపళ్ళ రైతుల ఆగ్రహం**

**- ఇతరుల ఖాతాలో పరిహారం జమ చేశారంటూ ఆరోపణలు**

**నారాయణపేట జూన్17 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట మండలం పేరపళ్ళ గ్రామంలో నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద చేపడుతున్న భూసేకరణ రైతుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. జయమ్మ చెరువు వద్ద నిర్మించనున్న పంప్ హౌస్, కాలువ నిర్మాణం కోసం వందల ఎకరాల భూములను సేకరిస్తుండగా, ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించకుండానే పంటలు వేయవద్దని అధికారులు గ్రామంలో చాటింపు వేయడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దాదాపు 40 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములపై ఇప్పుడు అవి తమవి కాదంటూ అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబంధు, రైతు భరోసా, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన భూములనే ఇప్పుడు వివాదాస్పదంగా మార్చారని ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టు పైప్‌లైన్ పనులు తమ భూముల్లో జరుగుతున్నప్పటికీ పరిహారం మాత్రం ఇతరుల ఖాతాల్లో జమ చేసినట్లు రైతులు చెబుతున్నారు. గ్రామానికి చెందిన 345 మంది రైతుల దాదాపు 400 ఎకరాల భూములు భూసేకరణ పరిధిలోకి వచ్చినట్లు సమాచారం. అయితే భూసేకరణ జాబితాల్లో అనేక తప్పులు ఉన్నాయని, కొందరు రైతుల పేర్లు పూర్తిగా గల్లంతయ్యాయని, మరి కొందరి భూముల్లో సగం మాత్రమే సేకరించడం వల్ల మిగిలిన భూములు వ్యవసాయానికి పనికిరాని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. సమస్య పరిష్కారం కోసం లయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని రైతులు తెలిపారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న తమకు ముందుగా నష్టపరిహారం చెల్లించి, పునరావాసం ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయి, పరిహారం కూడా అందకపోతే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూసేకరణలో జరిగిన పొరపాట్లను వెంటనే సరిదిద్దడంతో పాటు అర్హులైన రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అంశంపై వివరణ కోసం ఆర్డీఓ ఎల్. రమేష్‌ను సంప్రదించగా ఎలాంటి పొరపాటు జరగలేదు ఒకవేళ జరిగి ఉంటే దానిపైన విచారణ చేయిస్తానని అన్నారు.

# వ్యవసాయం గోదాము నిర్మాణానికి భూమి పూజ చేసిన



**- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

**గద్వాల జూన్ 17 (వుదయం ప్రతినిధి)**

గద్వాల నియోజకవర్గంలో గట్టు మండల పరిధిలో చాగదోణ గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ పథకం కింద 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ గోదాం భవనమునకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యేకి గ్రామ సర్పంచ్ వీరేష్ స్వామి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటను వ్యవసాయం ఉత్పత్తులను నిలువ ఉంచడానికి వ్యవసాయ గోదాము ఏర్పాటు చేయడం జరుగుతుంది. రైతులు వ్యవసాయం గోధుమనందు రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే విధంగా నిలువ ఉంచుకోవడానికి ప్రభుత్వం గోదామును ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో తీసుకురావడం జరిగింది. కావున ప్రతి ఒక్క రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, సర్పంచ్ వీరేష్ స్వామి, ఉప సర్పంచ్ రంగన్న, ముచ్చోని పల్లి సర్పంచ్ వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బాధ్యతల్లో ఎమ్‌డీ విశ్వనాథన్



***- ఏ.పి. ఫిలిం, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ తొలి డైరెక్టర్ల సమావేశం***

***- చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కార్యాచరణ దిశగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ తొలి బోర్డు సమావేశం***

విజయవాడ, ఏ.పి. ఫిలిం, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేవస్ విశ్వనాథన్ రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించే దిశగా ఏపీ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ నూతన పాలకవర్గం తొలి బోర్డు సమావేశం సోమవారం విజయవాడ ఫార్చూన్ మురళి పార్క్ హోటల్‌లో విజయవంతంగా నిర్వహించామని మేనేజింగ్ డైరెక్టర్ కేవస్. విశ్వనాథన్ తెలిపారు. సమావేశానికి కార్పొరేషన్ చైర్మన్ పి. భరత్ భూషణ్ అధ్యక్షత వహించగా, మేనేజింగ్ డైరెక్టర్ కేవస్. విశ్వనాథన్, డైరెక్టర్లు వై. ఝాన్సీ, సుమన్ తల్వార్, ఎస్. శివాజీ, చదలవాడ శ్రీనివాసరావు, బుర్రా సాయి మాధవ్, కందిమళ్ల సాంభశివరావు, వివేక్ కూచిభొట్ల, వి. సముద్ర, కే. ఉమామహేశ్వరరావు, ఎస్. వెంకట కృష్ణా రెడ్డి, జి. రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి. సత్యనారాయణ, దుర్గా ప్రసాద్ సాహు లు హాజరయ్యారు.సమావేశంలో రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్, నాటక రంగాల సమగ్రాభివృద్ధికి అవసరమైన చర్యలపై విస్తృతంగా చర్చించారు. బోర్డు డైరెక్టర్ల సభ్యుల్లో ఒకరు చిక్కాల మెహర్ రమేష్ కుమార్ ను ఉపాధ్యక్షులుగా ఎంపిక చేసే ప్రక్రియను పూర్తి చేశామన్నారు. బోర్డు సమావేశానంతరం ఈజీఎమ్ (Extraordinary General meeting) మీటింగ్ లో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు, పెట్టుబడుల ఆకర్షణ, చిత్రీకరణకు అనుకూల వాతావరణం కల్పించడం తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ (రూట్ మ్యాప్) రూపొందించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. గతంలో ప్రకటించిన నంది అవార్డులు, భవిష్యత్తులో నిర్వహించాల్సిన నంది అవార్డుల ప్రదానోత్సవానికి సంబంధించిన వివిధ అంశాలు, విధివిధానాలు, సూచనలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించామన్నారు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమను మరింత బలోపేతం చేయడంతో పాటు కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలకు ప్రోత్సాహం అందించేలా కార్పొరేషన్ కార్యాచరణ కొనసాగుతుందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారని మేనేజింగ్ డైరెక్టర్ కేవస్ విశ్వనాథన్ తెలియజేశారు.

సమావేశంలో ఏ.పి. ఫిలిం, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ ముడావత్ శ్రీనివాస్ నాయక్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.జారీ చేసినవారు: సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్

# విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి రావాలి..

**- నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ భరోసా.**

**- పిల్లాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి తల్లిదండ్రులను కోరిన సర్పంచ్**

**- సర్పంచ్ సుదర్శన్ రెడ్డి**

**తాండూరు వుదయం ప్రతినిధి**

తెలంగాణ ప్రజా ప్రభుత్వ పాలనలో విద్యార్థులకు పెద్దపీట వేస్తుందని గ్రామ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు గురువారం తాండూరు మండలం చంద్రవంచ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి సమక్షంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత చదువుల కోసం పట్టణానికి వెళ్లడం అక్కడ ఉన్నత చదువులు అభ్యసించడం వంటివి ఈ దశ నుండే మొదలవుతాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు రాత పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని గుర్తు చేశారు. తల్లిదండ్రులు విద్యార్థు లను క్రమం తప్పకుండా పాఠశాల కు పంపించడంతోపాటు రాత పుస్తకాలు పాఠ్య పుస్తకాలను పరిశీలించాలని కూడా సూచిం చారు. విద్యార్థులకు కావలసిన కనీస అవసరాలలో భాగంగా బ్యాగు పెన్నులు తల్లిదండ్రులు సమకూర్చాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజు ప్రభుత్వం ద్వారా అల్పాహారం,మధ్యాహ్నం భోజనం అందించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంది అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అక్రమ్, యువ నాయకుడు కె. శివకుమార్, స్థానిక ప్రజాప్రతిని ధులు యువకులు పాల్గొన్నారు.

# జిల్లా భరోసా కేంద్రం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహణ




**మహబూబ్‌నగర్ జిల్లా 17 జూన్ (వుదయం బ్యూరో)**

మహబూబ్‌నగర్ జిల్లా భరోసా కేంద్రం ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు మరియు బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కన్వర్జెన్స్ (సమన్వయ) సమావేశం బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అధ్యక్షతన నిర్వహించబడింది. సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ద్వారా బాధితులకు అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడికి అవసరమైన న్యాయ, వైద్య, మానసిక, సామాజిక మరియు పునరావాస సేవలు ఒకే వేదికపై అందేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాధితుల సంక్షేమ విషయంలో ఆలస్యం లేకుండా స్పందించాలని, ప్రతి కేసును సున్నితంగా పరిశీలించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో భరోసా కేంద్రంతో అనుసంధానమై పనిచేసే మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, న్యాయ సేవా సంస్థలు, చైల్డ్ లైన్, సామాజిక సంక్షేమ శాఖ, సఖి, NGOs తదితర లైన్ డిపార్ట్మెంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో DM & HO శ్రీనివాస్, DCRB DSP రమణా రెడ్డి, వర్కింగ్ DSP బాలాజీ, CWC చైర్మన్ నయీముద్దీన్, PP జాన్, పోలీస్ ఇన్స్పెక్టర్లు, JJB మెంబర్ గ్రేస్, ICDS సర్కిల్, చైల్డ్ లైన్ అధికారి, NGOs భరోసా కేంద్రం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వంద పడకల ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందించాలి



**అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు**

**అలంపూర్ జూన్ 17 (వుదయం ప్రతినిధి)**

అలంపూర్ చౌరస్తా లోని వంద పడకల ఆసుపత్రిలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా డాక్టర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. బుధవారము అలంపూర్ చౌరస్తా లోని వంద పడకల ఆసుపత్రిని ఎమ్మెల్యే విజయుడు, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు, డి సి హెచ్ ఎస్ రమేష్ చంద్ర తో కలిసి ఆసుపత్రిని పరిశీలించారు.అనంతరం ఆస్పత్రి అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై చైర్మన్ హోదాలో ఆసుపత్రి అభివృద్ధిపై ఆరా తీశారు. ఆస్పత్రి దినదినాభివృద్ధి చెందుతున్నది. ప్రజలకు అవసరమైన అన్ని వైద్య సేవలను అందుబాటులోఉండాలని డాక్టర్లకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఆస్పత్రిలో ప్రధానంగా మిషన్ భగీరథ తాగునీరు, విద్యుత్ సమస్య, ఇన్వర్టర్లు కొనుగోలు, కంప్యూటర్స్ కొనుగోలు, ఈ ఎన్ టి మిషన్, ఎండోస్కోపీ మిషనరీ, మైక్రోస్కోప్ బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ కేంద్రం, ఆసుపత్రికి కాంపౌండ్ వాల్ నిర్మాణం, ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థ, మార్చురికి సంబంధించిన వస్తువులను సమకూర్చాలని డి సి హెచ్ ఎస్ రమేష్ చంద్ర ఎమ్మెల్యేని అదనపు కలెక్టర్ ని కోరారు. అలాగే ఆరోగ్యశ్రీ 38 లక్షల రూపాయలు వివిధ అభివృద్ధి పనులకు మంజూరైనట్లు డి సి హెచ్ ఎస్ పేర్కొన్నరు. సీసీ కెమెరాలు, ఆసుపత్రి సైన్సు బోర్డు, సెక్యూరిటీ గార్డు గదులు, బయో వేస్టేజ్ గది వంటి వాటిని ఆసుపత్రిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు.అనంతరం అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఐదు ఎకరాలలో నిర్మించడం జరిగిందన్నారు. ఆస్పత్రి అభివృద్ధిపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తీర్మానించిన అంశాలు అభివృద్ధి పనులు వచ్చే మూడు నెలల్లో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ఈ కమిటీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సంధ్యా కిరణ్ మై, అలంపూర్ మున్సిపాలిటీ చైర్మన్ పిండి జయరాములు, పుల్లూరు గ్రామ సర్పంచ్ సునీత, వివిధ శాఖల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# డీఈవో కార్యాలయం ముందు ఏబీవీపీ ధర్నా



సంగారెడ్డి, జూన్ 17:వు దయం.

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరతను వెంటనే పరిష్కరించాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ మెదక్ విభాగ్ కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ, తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలు తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్ వంటి కనీస మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలను కల్పించాలని కోరారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, వాటిపై ప్రభుత్వం కఠిన నియంత్రణలు విధించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ డీఈవోకు వినతిపత్రం అందజేశారు.

ధర్నాలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై దాడి...

**- ఆరుగురు వ్యక్తుల అరెస్టు 12280 రూపాయల నగదు 6 సెల్ ఫోన్ లు 3 బైకుల స్వాధీనం...**

**కోరుట్ల జూన్ 17 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామ శివారు పేకాట ఆడుతున్నారన్న పక్క సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించగా ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 12280 రూపాయల నగదు 6 సెల్ ఫోన్లు మూడు మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని విద్యుత్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నాట్లు ప్రజలు ఇటువంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పేకాట వంటి జూద కార్యకలాపాలలో పాల్గొనలేదని కోరుట్ల పోలీసులు సూచించారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు



# గ్రేటర్ హైదరాబాద్



## బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఎంపికకు 18న లక్కీడ్రా

**- జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి ఉమాపతి**

**నాగర్ కర్నూల్, జూన్ 17 (వుదయం బ్యూరో)**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు సంబంధించిన 1వ తరగతి, 5వ తరగతి బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాల లక్కీ డ్రా ఈ నెల 18న నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కట్టం ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ప్రజావాణి హాల్ నందు ఈ లక్కీ డ్రా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న 1వ తరగతి, 5వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 18న ప్రజావాణి హాల్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా లక్కీ డ్రా తీస్తారని, ఎంపికైన విద్యార్థుల జాబితాను అదే రోజు ప్రకటిస్తామని ఉమాపతి తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలస్యం చేయకుండా ఉదయం 10 గంటలలోపు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## గీతంలో నూతన విద్యా ప్రవేశాలు

***- గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రారంభం***

***- వెల్లడించిన ప్రోవీసీ ప్రొఫెసర్ డీ.ఎస్.రావు***

**పటాన్చెరు (వుదయం):**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 202627 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రవేశాలు కొనసాగుతున్నట్టు బుధవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఒక కీలక విద్యా మైలురాయిగా, విశ్వవిద్యాలయం తన బహుళ విషయక అభ్యాస పర్యావరణ వ్యవస్థను మరింత విస్తరిస్తూ, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను ప్రారంభించినట్టు తెలియజేశారు. హైదరాబాదు ప్రాంగణం ఈ ఏడాది అనేక కొత్త కోర్సులను ప్రవేశపెట్టిందని తెలిపారు. వాటిలో ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ కింద నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ; బోధర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సహకారంతో బీబీఏ (ఎంటర్ ప్రెన్యూర్ షిప్); అలాగే బీఎస్సీ మైక్రోబయాలజీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎంటెక్ రోబోటిక్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎం.ఫార్మా (ఇండస్ట్రియల్ ఫార్మసీ - పీసీఐ ఆమోదం పొందాల్సి ఉంది) వంటివి ఉన్నట్టు వివరించారు. ఈ మార్పుచేర్పులు, అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ పోకడలు, సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యను తీర్చిదిద్దాలనే గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయన్నారు. గీతం హైదరాబాదు ప్రత్యేకత, దాని లిబరల్ ఎడ్యుకేషన్ ఫ్రేమ్‌వర్క్ అని, ఇది విద్యార్థులకు వివిధ విభాగాలలో మేజర్, మైనర్లను కలపడానికి వీలుకల్పిస్తూ, ఆయా విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా జ్ఞానంలో లోతు, విస్తృతి.. రెండింటినీ పొందేందుకు అనుమతిస్తుందన్నారు. గీతం ప్రవేశ పరీక్ష (గాట్ 2026) ద్వారా గానీ, లేదా టీజీ/ఏపీ ఈఏపీసెట్, ఎన్ సెట్, నాటా, జేఈఈ, సీయూసెట్, క్యాట్ (TG & AP EAPCET, NCET, NATA, JEE, CUET, CAT), ఇతర గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షల ద్వారా కూడా ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. అర్హత పరీక్షలో చూపిన ప్రతిభ, పనితీరు ఆధారంగా, విద్యార్థులు ట్యూషన్ ఫీజు, ఆహారం, వసతిలో వంద శాతం వరకు ఉపకార వేతనాలను (స్కాలర్ షిప్) పొందవచ్చని తెలిపారు. విశ్వవిద్యాలయం నిర్వహించే జాతీయస్థాయి ప్రవేశ పరీక్ష (గాట్ 2026) జూన్ 28న దేశ వ్యాప్తంగా ఆన్ లైన్ విధానంలో జరుగుతుందని, దానికి దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జూన్ 26 అని వెల్లడించారు. గీతం, హైదరాబాదు ప్రాంగణం తన స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్, బిజినెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, గీతం హైదరాబాదు పరివర్తనాత్మక విద్య వ్యక్తులను అర్థవంతమైన వృత్తిని నిర్మించుకోవడానికి, సమాజానికి దోహదపడటానికి శక్తినిస్తుందని తాము విశ్వసిస్తున్నట్టు గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు తెలిపారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించడం, రోబోటిక్స్, ఏఐ, వస్త్రపకత, జీవశాస్త్రాలు, ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాలలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం వంటివి, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాలనే గీతం నిబద్ధతను ప్రతిబింబిస్తోందన్నారు. లిబరల్ ఎడ్యుకేషన్ ఫ్రేమ్ వర్క్, బహుళవిషయాల అభ్యాస వాతావరణం ద్వారా, విద్యార్థులు వారి ఆసక్తులను అన్వేషించడానికి, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నిపుణులుగా, ఆవిష్కర్తలుగా, నాయకులుగా ఎదగడానికి తాము అవకాశాలను కల్పిస్తున్నట్టు ఒకింత గర్వంగా వెల్లడించారు. ఇతర వివరాల కోసం www.gitam.eduను సందర్శించాలని సూచించారు.

## మార్గదర్శకాల ప్రకారమే భూ సేకరణ




**వికారాబాద్, జూన్ 17: (వుదయం జిల్లా ప్రతినిధి)**

మార్గదర్శకాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు భూ సేకరణ చేపట్టాలి అధికారులకు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచన. బుధవారం రేడియల్ రోడ్, పరిశ్రమల స్థాపనకు సంబంధించిన భూ సేకరణ పై వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూ సేకరణ అవసరమన్నారు. రేడియల్ రోడ్డు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి భూ సేకరణ చేసే క్రమంలో భూములు మార్కెట్ విలువను నిర్ధారించాలని కలెక్టర్ తెలిపారు. భూమిని నష్టపరిహారం పై సమాలోచన చేయాలని కలెక్టర్ సూచించారు. హెచ్ఎండిఏ తాత్కాలిక బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. టిజిఐఐసి కార్యాచరణ ప్రణాళికను నెలలోపు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వెంకటాచారి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వ రాజ్ గుట్టూరు, ఆర్డీఓలు వాసు చంద్ర, అనిత, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాథోడ్ గోపాల్ దంపతుల సహాయం



**సంగారెడ్డి వుదయం.**

పుల్కల్ మండలం మిన్పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బొమ్మారెడ్డి గూడెం వాస్తవ్యులు, రిటైర్డ్ ఎంపీడీవో రాథోడ్ గోపాల్ దంపతులు పాఠశాలలోని విద్యార్థులందరికీ బ్యాగులు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ గోపాల్ మాట్లాడుతూ.. మిన్పూర్ తండాలోని విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తూ ఐఐటి వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తున్నారని తెలిపారు. ఈ విజయాలకు పాఠశాల పునాది అని భావించి తన వంతుగా సహాయం అందిస్తున్నానని చెప్పారు. విద్యార్థులందరూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పుల్కల్ మండల ఎంఈఓ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రోత్సాహాన్ని పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమూనా శంకర్, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉమాదేవి, ఏఏపి చైర్మన్ మంజుల, మాజీ సర్పంచ్ సంగ్యా నాయక్, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్ సుగుణ బాయి, గ్రామ పెద్దలు రామావత్ శంకర్, గోరం శంకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలన ప్రజలకు శూన్యం

**- బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు మావురం రాజు..**

**మెదక్ జిల్లా వుదయం**



నిజాంపేట మండలం రెండున్నర సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని నిజాంపేట బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు మావురం రాజు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని ఆరు గ్యారంటీల పేరిట గారడి చేస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇల్లు, వ్యవసాయ భూములు కలిగి ఉన్నవారికి వారికి ఇండ్లను కట్టిస్తున్నారే తప్ప నిరుపేదలకు ఇల్లు కట్టించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నిజాంపేట మండలం ఏర్పడి పది సంవత్సరాలు అవుతున్న పక్కా భవనాలు లేక అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని మంజూరైన పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికి నిధులు కేటాయించిన దాఖలాలు లేవని. మళ్లీ మండల అభివృద్ధి పక్కాభవనాలు నిర్మించాలంటే టిఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ముమ్మాటికి మళ్ళీ సారు కేసీఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే కసిరెడ్డి

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బాణావత్ శంకర్ నాయక్**

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరి కిషన్ నాయక్**

**వెల్దండ జూన్ 18 (వు దయం)**



నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దూసుకెళ్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బానవత్ శంకర్ నాయక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరి కిషన్ నాయక్ లు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లా డు తూ రెండున్నర సంవత్సరాల కాలంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ మల్లు రవి సహకారం తో గ్రామాలలో ఎమ్మెల్యే కసి రెడ్డి సిసి రోడ్లు ఏర్పాటు ఏర్పాటు చేశారని, మండల కేంద్రాలకు గ్రామాల నుంచి బిటి రోడ్ల పనులు కొనసా గుతున్నా యని తెలిపారు. ప్రధానంగా ప్రధానంగా ఎన్నో ఏండ్లుగా పెండింగ్లో ఉన్న గానుగట్టు వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికావచ్చిందని అదేవిధంగా బైరాపూర్ వాగుపై బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు ఇందిమ్మ ఇళ్లు మొదటి విడుదల మంజూరు చేయించి పూర్తి చేశారని రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు అంజయ్య లక్ష్మణ స్వామి సుధీర్.పాల్గొన్నారు.

## లక్షల మంది విద్యార్థులకు అంకితం

**రంగారెడ్డి జిల్లా.**



**- ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంకితం**

**- ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు లక్ష్యం.**

**- తెలంగాణను విద్యారంగంలో దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం:**

**- ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలతో మాట్లాడినా తరువాత విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ప్రీప్రైమరీ విభాగాలను, పాఠశాల లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్స్ ను సందర్శించి సౌకర్యాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో మొక్క నాటిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డాన్స్, మ్యూజిక్ రూమ్ ను సందర్శించారు. ఫుట్ బాల్ గ్రౌండ్ ను సందర్శించి విద్యార్థులతో కాసేపుజ్ ఫుట్ బాల్ ఆడిన సీఎం. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ఆరుట్లలో ప్రారంభమైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఒక గ్రామానికే పరిమితం కాదని, తెలంగాణ రాష్ట్రంలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంకితమని పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్ అద్దాల మేడల్లోనో, రంగుల గోడల్లో నో లేదని, తరగతి గదుల్లోనే ఉందనే సంపూర్ణ విశ్వాసంతో ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణలు చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యా కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరడం సంతోషకరమని, ఒక ప్రభుత్వ పాఠశాలకు 'నో అడ్మిషన్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ విద్యపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మట్టిలోని మాణిక్యాలను వెలికితీయడానికి ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారే ఎన్నో ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు ప్రభుత్వ పాఠశాలలో చదివారని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ముఖ్యమంత్రి స్థాయికి చేరానని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులుగా ఎదిగి తమ తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో జీవించేలా చేయాలని పిలుపునిచ్చారు. విధ్వంసమైన విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఆరుట్ల గ్రామం తెలంగాణకు ఆదర్శంగా నిలుస్తుందని తాను విశ్వసిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫారాలు, కిట్లను అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందించే కార్యక్రమాలను చేపట్టామని పేర్కొన్నారు. డిసెంబర్ 9న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి క్రీడా శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ఫుట్ బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో విద్యార్థులు ఫుట్ బాల్ ఆడే అవకాశాన్ని కల్పించామని, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అనవసర రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. విమర్శించే వారికి ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను చూపించాలని, ప్రజలు అండగా నిలిస్తే అద్భుతాలు సృష్టించి తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలంగాణ విద్యా కమిషన్ చైర్‌పర్సన్ ఆకునూరి మురళి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయి, ఉన్నతాధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ఎల్ఓసి చెక్కుల పంపిణీ




**కుత్బుల్లాపూర్, జూన్ 17, (వుదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కె.పి. వివేకానంద చొరవతో సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ ఓ సి చెక్కులను నిజాంపేట సర్కిల్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ అర్హులైన లబ్ధిదారులు నిజాంపేట సర్కిల్, ప్రగతినగర్ నివాసి బత్తుల రజనికి రూ. 3,50,000/ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారుల అత్యవసర వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఆర్థిక సహాయం వారికి ఉపశమనం కలిగించేలా ఉపయోగపడుతుందని లబ్ధిదారులు త్వరగా కోలుకొని సాధారణ జీవన విధానంలోకి రావాలని ఆకాంక్షించారు. సీఎం సహాయ నిధి ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారని వారు తెలిపారు. అర్హులైన వారు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి బిఆర్ఎస్ ఆర్గనైజర్ సెక్రెటరీ సాంబశివ రెడ్డి, లలిత, 273 డివిజన్ బిఆర్ఎస్ నాయకులు తాళ్లూరి ప్రదీప్, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**- కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**

**బాచుపల్లి, జూన్ 17, (వుదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు హన్మంత్ రెడ్డి తెలిపారు. అనంతరం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత 15 సంవత్సరాలలో జరగని అభివృద్ధి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కుత్బుల్లాపూర్ ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడకుండా చూడటం తమ బాధ్యత అని రాబోయే ఏడాది కాలంలో నియోజకవర్గంలో ఎలాంటి మంచినీటి సమస్య లేకుండా చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీకి తగినంత తాగునీటి సరఫరా అందేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు.

## సెయింట్ ఆంథోనీస్‌లో ఏఐ ప్రయోగశాల ప్రారంభం



**సంగారెడ్డి, జూన్ 17:వుదయం.**

సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలో విద్యార్థినుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన 'హ్యూమన్ ఏఐ ప్రయోగశాల'ను బుధవారం ప్రారంభించారు. కళాశాల యాజమాన్యం, హ్యూమన్ ఏఐ సంస్థ సంయుక్తంగా ఈ ప్రయోగశాలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. కార్యక్రమంలో వావ్ మ్యాగజైన్ వ్యవస్థాపకురాలు మంజులత, జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు డి. అశోక్, ఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ ఫార్మా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహిపాల్ రెడ్డి, ప్రముఖ ఎడ్యుకేటర్ శివాణి పల్లెల, హ్యూమన్ ఏఐ వ్యవస్థాపకుడు మాటూరి నరేష్, సహ వ్యవస్థాపకుడు ధీరజ్ కులకర్ణి పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ ఈ. సాల్మన్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ఈ. జయబాల రెడ్డి, ప్రిన్సిపాల్ ఈ. జ్యోతి రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఏఐ సాంకేతికతను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థినులకు అతిథులు సూచించారు. అనంతరం అతిథులను సన్మానించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాల మెనూపై కలెక్టర్ హెచ్చరిక

***- రామంచ, ఇమాంబాద్ బడుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ***

***- విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించిన కలెక్టర్***

***- మెనూ అమలు చేయని హెడ్‌మిస్ట్రెస్‌పై ఆగ్రహం***

**సిద్దిపేట, జూన్ 17 (వుదయం బ్యూరో)**





ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు. బుధవారం ఆమె చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, అలాగే సిద్దిపేట అర్బన్ మండలంలోని ఇమాంబాద్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న వసతులను, విద్యా బోధనను ఆమె స్వయంగా పరిశీలించారు. ముందుగా రామంచ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్.. విద్యార్థుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజన ప్రక్రియను తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, వారికి స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు మెనూ ప్రకారం ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందించాలి. ఇందుకోసం ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలి అన్నారు. అనంతరం రామంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేయగా, అక్కడ మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం కూరలు, ఆహారం లేకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించినందుకు గానూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇమాంబాద్ ప్రాథమికోన్నత పాఠశాల తనిఖీ సందర్భంగా.. ఏ రోజు ఏ వంటకం వండాలో చార్ట్ ప్రకారం స్పష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. స్కూళ్లు పునఃప్రారంభమైనందున తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, విద్యుత్, తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం 100% ఉండేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## నిరుడు సర్వేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కొమురవెల్లి మల్లన్నకు ప్రత్యేక పూజలు

**- కల్వకుంట్ల కవితమ్మ తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్ష**

**- సామాజిక న్యాయం కవితమ్మతోనే సాధ్యమని తెలంగాణ రక్షణ సేన పార్టీ నేతల విశ్వాసం**

**శంకర్‌పల్లి, జూన్ 17 (వుదయం):**




తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక న్యాయానికి కొత్త దిశను చూపగల నాయకత్వం కల్వకుంట్ల కవితదేనని, ఆమె తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడు నిరుడు సర్వేశ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు కోరారు. ఈ సందర్భంగా నిరుడు సర్వేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యాలను సంపూర్ణంగా అమలు చేయగల సామర్థ్యం కలిగిన నాయకురాలు కల్వకుంట్ల కవిత అని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ సామాజిక న్యాయం సాధించాలనే సంకల్పంతో ఆమె ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కవిత చేస్తున్న కృషి రాష్ట్ర ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోందన్నారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే కొమురవెల్లి మల్లన్న స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి, సామాజిక సమానత్వం, యువతకు అవకాశాలు కల్పించే నాయకత్వం రాష్ట్రానికి అవసరమని, ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం కల్వకుంట్ల కవితమ్మకు ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజల కోరిక మేరకు కల్వకుంట్ల కవిత తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రంలో సామాజిక న్యాయం మరింత బలోపేతం కావాలని కోరుతూ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యకర్తలు, ముదిరాజ్ సంఘ నాయకులు, కవిత అభిమానులు పాల్గొని రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు.




నాపై దాడి వెనుక ఆరెస్సెస్ హస్తం

"రాజస్థాన్‌లో నాపై జరిగిన దాడి వెనుక ఆరెస్సెస్ హస్తం ఉంది. నీట్ లీకేజీపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నందుకే నాపై ఈ దాడి జరిగింది. అయినా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు మా పోరాటం ఆగదు. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా ట్వీట్ చేసే ప్రధాని మోడీ మనదేశ విద్యార్థులు చనిపోతుంటే కనీసం ఒక్క సంతాప ట్వీట్ కూడా చేయలేదు. ప్రధాని మొదట ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పాలి. మోదీ గారు.. మీ 'మన్ కీ బాత్', 'పరీక్షా పే చర్చ'లు ఆపి, కనీసం ఇప్పటికైనా విద్యార్థుల మనసులోని మాటను వినండి..."

*-అభిజీత్ దీప్కే ,కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు*

## వే'మన' పద్యం

**ఉప్పలేనికూర హీనంబు రుచులకు**
**పప్పులేని తిండి ఫలములేదు**
**యప్పులేనివాడె యధిక సంపన్నుండు**
**విశ్వదాభిరామ! వినురవేమ!**



## సంపాదకీయం

# పాపం.. దీదీ...

పశ్చిమ బెంగాల్ రాజకీయాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. అధికార అహంకారంలో ప్రజలకు దూరమైతే, మతతత్వ శక్తులతో అవకాశవాద రాజకీయాలు చేస్తే చివరకు దాని ఫలితం ఎలా ఉంటుందో బెంగాల్ ప్రత్యక్ష ఉదాహరణ. బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కరోజులో జరిగిన పరిణామం కాదు. దానికి ఆ పార్టీ ఎత్తులు ఎంత కారణమో, మమతా బెనర్జీ స్వయం కృతాపరాధాలు కూడా అంతే కారణం? వాస్తవానికి బీజేపీ బెంగాల్‌లో పాదం మోపడానికి రాజకీయంగా అవకాశమిచ్చింది కూడా మమతేనన్న సంగతి మనం మరువకూడదు. ఇటీవల ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్‌లో అసంతృప్తి చెలరేగింది. ఒకప్పుడు మమతకు అత్యంత సన్నిహితులుగా ఉన్న నాయకులు వేర్వేరు గ్రూపులుగా విడిపోతున్నారు. కొందరు పార్టీని వీడుతున్నారు. మరికొందరు బీజేపీ వైపు చూస్తున్నారు. దీన్ని అవకాశంగా తీసు కున్న బీజేపీ తృణమూల్‌ను దెబ్బతీసే పనిలో పడింది. ఆ పార్టీ నేతలను తమ 'వాషింగ్ మిషన్'లో శుద్ధి చేస్తోంది. పార్టీ అంతర్గత కమిటీల రద్దు, నాయకత్వ సంక్షోభం, శాసనసభలో ప్రతిపక్ష నాయకత్వంపై వివాదాలు తృణమూల్‌లో ఏర్పడిన గందరగోళానికి సంకేతాలు. తాజా పరిణామాలకు ముందుకు మూడు దశాబ్దాలు వెనక్కివెళ్తే తృణ మూల్ అవకాశవాద రాజకీయం అర్థమవుతుంది. 1990 చివరలో కాంగ్రెస్ నుంచి బయటకొచ్చిన మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించింది. వామపక్ష ప్రభుత్వాన్ని గద్దెదించే లక్ష్యంతో బీజేపీతో చేతులు కలిపింది. వాజ్‌పేయ్ నేతృత్వంలోని ఏన్డీయేలో చేరి రైల్వే మంత్రిగానూ పనిచేసింది. వామపక్షాలను బలహీనపరచాలని చివరకు మావోయిస్టులతో చేతులు కలిపేందుకు కూడా వెనుకాడలేదు. 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మమత అదే రాజకీయాన్ని కొనసాగించింది. వామపక్షాలు, ప్రజాస్వామ్య శక్తులు తిరిగి బలపడకుండా అన్ని స్థాయిల్లో అడ్డుకునే ప్రయత్నం చేసింది. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ వరకు ప్రతిపక్ష స్థలాన్ని కుదించింది. ఫలితంగా వామపక్షాలు కాస్త బలహీనపడినా, కాంగ్రెస్ పూర్తిగా క్షీణించింది. ఆ ఖాళీని బీజేపీ ఆక్రమించింది. 2021 ఎన్నికల తర్వాత స్వయంగా మమత "వామపక్షాలు ప్రతి పక్షంలో ఉంటే బాగుండేది, ప్రజా సమస్యలు చర్చకైనా వచ్చేవి" అంటూ వ్యాఖ్యానించడం యాదృచ్ఛికం కాదు. వామపక్షాలను పూర్తిగా రాజకీయంగా తుడిచిపెట్టాలనుకుని అసలుకే ఎసరు తెచ్చుకుంది. తన రాజకీయానికి వచ్చిన దుష్పరిణామాన్ని ఆమె గుర్తించినా అప్పటికే ఆలస్యమైంది. అంతవరకు బెంగాల్‌లో చిన్న శక్తిగానే ఉండేది. ప్రధాన రాజకీయ పోటీ వామపక్ష ఫ్రంట్, కాంగ్రెస్ మధ్య సాగేది. కానీ తృణమూల్ బీజేపీ పొత్తుల వల్ల బీజేపీ గ్రామాలకు పాకింది. ఇతర పార్టీల వ్యతిరేక ఓట్లను సమీకరించే ప్రక్రియలో తన సొంత రాజకీయ స్థావరాన్ని నిర్మించుకుంది. ఆ వితనమే నేడు విషవృక్షంగా మారింది. పదిహేనళ్ల పాటు అధికారంలో ఉన్న మమతా వామపక్షాలను బలహీనపరచాలనే చూశారు తప్ప ప్రజా సమస్యల్ని పట్టించుకోలేదు. నిరుద్యోగం, పరిశ్రమల కొరత, వ్యవసాయ సంక్షోభం, ధరల పెరుగుదల, కార్మికుల సమస్యలు పరిష్కారం నేటికీ అలాగే ఉన్నాయి. వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రజా సమస్యలు, రైతుల కష్టాలు, కార్మికుల బాధలు, కేంద్రం అనుసరిస్తున్న విధానాల ప్రభావం వంటివి విస్తృతంగా చర్చకు వచ్చేవి. తృణమూల్ బలపడినప్పుడు కూడా వామపక్షాలు ప్రధాన ప్రతిపక్షంగా నిలిచి ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవి. ఇప్పుడు అధికారప్రతిపక్షాల మధ్య జరుగుతున్న రాజకీయ రగడలో ఇవి చర్చకు రావడం లేదు. పైగా తాజాగా బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి 'మా ప్రభుత్వం హిందువుల కోసం మాత్రమే పని చేస్తుంది, ముస్లింల కోసం కాదు" అని ప్రకటించడం వారి నిజస్వరూపాన్ని బహిర్గతం చేసింది. పైగా ముస్లింలు బంగ్లాదేశ్‌కు వెళ్లిపోవాల్సిందేనంటూ బీజేపీ నేతలు హెచ్చరికలు చేస్తున్నారు. ఇక్కడ ముఖ్యమైన విషయం గుర్తుపెట్టుకోవాలి. తృణమూల్ వామపక్షాలను బలహీనపరచడం చివరకు బీజేపీకే లాభం చేకూర్చింది. ప్రజా ఉద్యమాల నుంచి వచ్చిన శక్తులను అణచివేసి, రాజకీయ పోటీని రెండు పార్టీల మధ్య పరిమితం చేస్తే, చివరకు మతతత్వ శక్తులు ఎలా బలపడతాయో బెంగాల్ అనుభవం చూపిస్తోంది. ఇదంతా చూస్తుంటే మహాభారతంలోని ధృతరాష్ట్ర కౌగిలి గుర్తుకు వస్తుంది. ప్రేమగా కౌగిలించుకున్నట్టు కనిపించినా అంతిమంగా అది వినాశనానికి దారితీస్తుంది. అన్నట్టుగానే వామపక్షాలను ఓడించేందుకు బీజేపీతో కలిసి నడిచిన రాజకీయాలు చివరకు మమతనే మింగేశాయి. నేడు బీజేపీ అదే సంబంధాలను, అదే నాయకుదే రాజకీయ స్థలాన్ని ఉపయోగించుకుని తృణమూల్‌ను నిలువునా కూల్చే ప్రయత్నం చేస్తోంది. ఇది మమతా స్వయంకృతాపరాధమే!

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ప్రత్యేక ఓటరు సవరణ

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు సంపూర్ణమైన, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రక్రియే ప్రాణాధారం. ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా, పారదర్శకంగా ఉంటే ప్రజాస్వామ్య పునాదులు అంతగా బలపడతాయి. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం' (ఎస్ఐఆర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తీవ్ర రాజకీయ చర్చకు, మేధోమథనానికి దారితీసింది. అధికారికంగా ఇది ఓటరు జాబితాల్లోని దీర్ఘకాలిక లోపాలను సరిచేయడం, నకిలీ, అర్హతలేని ఓటర్లను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడిని జాబితాలో చేర్చడం కోసం తలపెట్టిన బృహత్తర సంస్కరణగా ఎన్నికల సంఘం పేర్కొంటోంది. అయితే, ప్రతిపక్షాలు మాత్రం దీనిని ఎన్నికల ముంగిట అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా, ఒక వ్యూహం ప్రకారం ప్రతిపక్ష సానుభూతిపరుల ఓట్లను గైర్హాజరు చేసేందుకు ఉద్దేశించిన రాజకీయ ప్రేరిత చర్యగా తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఈ భిన్న దృక్పథాల నేపథ్యంలో ఎస్ఐఆర్ సాధ్యాసాధ్యాలను, దాని పూర్వాపరాలను, చారిత్రక పరిణామాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరముంది. భారత రాజ్యాంగంలోని 324వ అధికరణ ప్రకారం దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణ బాధ్యత స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘానికి అప్పగించబడింది. ఓటరు జాబితాలను నిరంతరం నవీకరించడం, వాటి స్వచ్ఛతను కాపాడడం ఈ రాజ్యాంగబద్ధ సంస్థ ప్రాథమిక విధి. సాధారణంగా ప్రతి సంవత్సరం దేశంలో సంక్షిప్త సవరణ జరుగుతుంది. ఇందులో కేవలం కొత్తగా 18 ఏళ్లు నిండిన వారిని చేర్చడం, మరణించిన వారి వివరాలను తొలగించడం వంటి పరిమిత ప్రక్రియలు ఉంటాయి. కానీ, దేశంలో మారుతున్న జనాభా రేటు, ఉపాధి కోసం సాగుతున్న అంతర్గత వలసలు, పట్టణీకరణ, సాంకేతిక మార్పుల వల్ల క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల్లో భారీ వ్యత్యాసాలు చోటుచేసు కుంటున్నాయి. ఒకే వ్యక్తి పేరు బహుళ నియోజకవర్గాల్లో లేదా ఒకే నియోజకవర్గంలో వివిధ బూత్‌లలో నమోదవడం వంటి 'ద్వంద్వ ఓట్ల' సమస్య ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోంది. ఈ క్రమరాహిత్యాలను శాశ్వతంగా నివారించేందుకు, సాధారణ సంక్షిప్త సవరణల కంటే భిన్నంగా, క్షేత్రస్థాయిలో లోతైన పరిశీలనతో కూడిన ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం తెరపైకి తెచ్చింది. ప్రస్తుతం భారతదేశంలో నమోదిత ఓటర్ల సంఖ్య సుమారు 100 కోట్లకు పైగా ఉండి, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటరు గణాంక వ్యవస్థగా నిలిచింది. ప్రతి సార్వత్రిక ఎన్నికల చక్రంలో లక్షలాది మంది కొత్త ఓటర్లు ఈ జాబితాలోకి ప్రవేశిస్తుండగా, మరణాలు, శాశ్వత వలసల కారణంగా వేలాది మంది పేర్లను తొలగించాల్సి వస్తోంది. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా దాదాపు 2 నుండి 3 శాతం ఓట్లు సాంకేతిక లోపాలు, తప్పుడు చిరునామాలు లేదా నకిలీ గుర్తింపు కార్డుల కారణంగా దుర్వినియోగం అవుతున్నట్లు అంచనా. ఈ సమస్యను అధిగమించడానికి ఎన్నికల సంఘం ఆధార్ అనుసంధానం, డిజిటల్ బయోమెట్రిక్ ధ్రువీకరణ, కేంద్ర జనన మరణ నమోదుల విభాగం సమాచార వ్యవస్థలను సమన్వయం చేసుకుంటూ, స్థానిక రెవెన్యూ యంత్రాంగం సాయంతో సమగ్ర ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, బూత్ స్థాయి అధికారులు... ప్రతి ఇంటిని భౌతికంగా సందర్శించి, ఓటర్ల సజీవ స్థితిని ధ్రువీకరించేలా రూపకల్పన చేశారు. పౌరుల నుంచి అభ్యంతరాలను, సూచనలను స్వీకరించడానికి ప్రత్యేక గడువులను ప్రకటించారు. ఇది పూర్తిగా నిష్పాక్షికమైన, చట్టబద్ధమైన పరిపాలనా ప్రక్రియ అని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేదని ఎన్నికల సంఘం గట్టిగా వాదిస్తోంది. అంతేకాకుండా, పారదర్శకతను నిరూపించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను, బూత్ స్థాయి ఏజెంట్లను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసి, సవరించిన డ్రాఫ్ట్ కాపీలను క్రమంతప్పకుండా పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తోంది. కానీ, క్షేత్రస్థాయి వాస్తవాలు, ప్రతిపక్షాల ఆందోళనలు మరో కోణాన్ని ఆవిష్కరి స్తున్నాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ వంటి ప్రధాన జాతీయ, ప్రాంతీయ శక్తులు ఎస్ఐఆర్ తుది ఫలితాలపై తీవ్ర అపనమ్మకాన్ని వ్యక్తపరుస్తున్నాయి. ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఇటువంటి భారీ ప్రక్షాళన చేపట్టడం వల్ల సమాజంలో వెనుకబడిన వర్గాలైన పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, సంచార జాతులు, పట్టణ మురికివాడల ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. నిరక్షరాస్యత, అవగాహనా లోపం కారణంగా వీరు నిర్ణీత సమయంలో అవసరమైన గుర్తింపు పత్రాలను సమర్పించలేరని, దీన్ని ఆసరాగా చేసుకుని అధికార పక్ష అనుకూల యంత్రాంగం ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష ఓటు బ్యాంక్‌ను నిర్వీర్యం చేసే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. తగిన పత్రాలు లేవనే సాకుతో లక్షలాది మంది నిరుపేద భారతీయ పౌరుల పేర్లను జాబితాల నుండి తొలగించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుందని ప్రతిపక్షాలు గళమెత్తు తున్నాయి. ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం - ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై వస్తున్న విమర్శలు. గత కొన్నేళ్లుగా ఎన్నికల షెడ్యూళ్ల ఖరారు, ఎన్నికల నియమావళి అమలు, ఈవీఎంల పనితీరు, విపక్ష నాయకులపై చర్యల వంటి విషయాల్లో ఎన్నికల సంఘం తీరు అధికార పక్షానికి అనుకూలంగా ఉందనే ఆరోపణలు దేశంలో బలంగా వినబడు తున్నాయి. ఈ నేపథ్యంలో, ఎస్ఐఆర్ వంటి సున్నితమైన ప్రక్రియను కూడా రాజకీయ విశ్లేషకులు, పౌర సమాజం అనుమానపు దృక్పథంతోనే పరిశీలిస్తున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికల నిర్వహణ సంస్థపై ప్రజలకు, రాజకీయ పక్షాలకు ఉండే అత్యున్నత విశ్వాసమే దానికి బలమైన పునాది. ఆ విశ్వసనీయత స్వల్పంగా దెబ్బతిన్నా, అది మొత్తం ఎన్నికల ఫలితాల ప్రామాణికతను, తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ స్థిరత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తుంది. దీనికి భిన్నంగా అధికార పక్షమైన భారతీయ జనతా పార్టీ మరియు దాని మిత్రపక్షాలు ఈ సంస్కరణను గట్టిగా సమర్థిస్తున్నాయి. ఓటరు జాబితా స్వచ్ఛత అనేది పారదర్శక ప్రజాస్వామ్యానికి కనీస అవసరమని వారి వాదన. చనిపోయిన వారి పేరిట దొంగ ఓట్లు పడటం, సరిహద్దు రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు దేశీయ ఓటరు కార్డులు పొందడం, ఒకే ఓటరు వేర్వేరు నియోజకవర్గాల్లో ప్రభావం చూపడం వంటి అక్రమాలను అడ్డుకోకపోతే, నిజాయితీ గల పౌరుడి ఓటుకు విలువ లేకుండా పోతుందని అధికార పక్షం పేర్కొంటోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఓటరు జాబితాలను శుద్ధి చేయడం ద్వారా ఎన్నికల ఫలితాలపై దేశ ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని, దీన్ని రాజకీయం చేయడం తగదని వారు హితవు పలుకుతున్నారు. భారత ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే, ఓటరు జాబితాలపై వివాదాలు, ఆరోపణలు సరికొత్తవేమీ కావు. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు ఫోటో గుర్తింపు కార్డులను (ఎపిక్) ప్రవేశపెట్టినప్పుడు కూడా ఇలాంటి రాజకీయ అభ్యంతరాలు, సవాళ్లు ఎదురయ్యాయి. కాలక్రమేణా డిజిటలైజేషన్ పెరిగినప్పటికీ లోపాలు పూర్తిగా సమసిపోలేదు. 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ, 2018 తెలంగాణ ఎన్నికల్లో లక్షలాది మంది ఓట్లు అకస్మాత్తుగా మాయమయ్యాయనే ఆరోపణలపైనా తీవ్ర దుమారం రేగింది. 2019 పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం కొన్ని నిర్దిష్ట వర్గాల ఓట్లను తొలగించారంటూ న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఒకవైపు వేలాది మంది అర్హుల పేర్లు జాబితాలో కనిపించకపోవడం, మరోవైపు బోగస్ ఓట్లు యథేచ్ఛగా చలామణి కావడం భారత ఎన్నికల వ్యవస్థ ఎదుర్కొంటున్న నిరంతర సవాళ్లుగా మిగిలి పోయాయి. ఎన్నికల సంఘం తాజా నివేదికల ప్రకారం, ప్రతి శాస్త్రీయ సవరణ ప్రక్రియలో సగటున 1.5 నుండి 2 కోట్ల మంది కొత్త ఓటర్లు నమోదవుతుండగా, దాదాపు కోటికి పైగా అనర్హులైన లేదా మరణించిన వారి పేర్లు తొలగించబడుతున్నాయి. గతిశీలమైన భారత జనాభా రీత్యా ఈ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయడం ఏ ప్రభుత్వానికైనా, వ్యవస్థకైనా అసాధ్యం. అయితే, ఈ సాంకేతిక ప్రక్షాళన వేగంలో ఏ ఒక్క నిజమైన పౌరుడి ప్రాథమిక ఓటు హక్కు కూడా హరించుకుపోకూడదనే రాజ్యాంగ స్ఫూర్తిని మరువరాదు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఐదేళ్లకు ఒకసారి వేసే ముద్ర కాదు; అది పౌరుడి ఆత్మగౌరవానికి, దేశ సార్వభౌమాధికారంలో భాగస్వామ్యానికి ప్రతీక. అందువల్ల ఈ సవరణ ప్రక్రియలో అత్యంత అప్రమత్తత, మానవీయ కోణం అవసరం. చివరగా, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పవిత్ర సంస్కరణగా నిలుస్తుందా, లేక కేవలం రాజకీయ వివాదాల కేంద్రబిందువుగానే మిగిలి పోతుందా అనేది అది క్షేత్రస్థాయిలో అమలయ్యే తీరుపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే, ఎన్నికల సంఘం కేవలం పరిపాలనాపరమైన మొండితనంతో కాకుండా, సంపూర్ణ పారదర్శకతతో వ్యవహరించాలి. జాబితా నుండి ఏ ఒక్క పేరును తొలగించినా, అందుకు గల నిర్దిష్ట కారణాలను, ఆధారాలను బహిరంగపరచాలి.




రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# గురు అర్జన్ దేవ్ సాహిబ్ మహోన్నత బలిదానం



సిక్కు సమాజం కోసం తన ప్రాణాలను సహితం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తిగా గురు అర్జన్ దేవ్ చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచి పోయారు. ప్రతి ఏట 16 జూన్ రోజున గురు అర్జన్ దేవ్ సాహిబ్ బలిదాన దినాన్ని భక్తి పూర్వకంగా నిర్వహించుకోవడం, ఆయన్ని స్మరించుకోవడం అనాదిగా ఆచారంగా మారింది. ఈ రోజున సిక్కుల తమ మత గ్రంథాన్ని తొలి పేజీ నుంచి తుది పేజీ వరకు పూర్తిగా చదవడం, తీపి పదార్థాలను పంచడం, ఊరేగింపులు నిర్వహించడం జరుగుతుంది. ఈ రోజును కేవలం విచారకర పశ్చాత్తాప దినంగానే కాకుండా అతను చూపిన బాటలో నేటి తరం నడవాలనే సందేశం కూడా దాగి ఉందని గమనించాలి.

గురు అర్జన్ దేవ్ సాహిబ్ బలిదాన చరిత్ర: మాత భాని గర్భాన 15 ఏప్రిల్ 1563న జన్మించిన గురు అర్జన్ దేవ్ సిక్కుల మతానికి మార్గదర్శకత్వం వహించిన 10 మంది సిక్కు గురువుల్లో ఒకడిగా, తన 18వ ఏటనే ఐదవ సిక్కు గురువుగా గుర్తింపు పొందారు. స్వర్ణ దేవాలయానికి పునాది వేసి, నిర్మాణం చేపట్టిన గురు అర్జన్ దేవ్ తర్వాత హర్మిందర్ సాహిబ్‌లో ప్రతిష్ఠించిన "ఆది గ్రంథం"లో ఆధ్యాత్మిక కవిత్వం, సంగీత రాగాలను సంకలనం చేశారు. తమ ఆదాయంలో 10 శాతం దానం చేయాలంటూ హితబోధ చేశారు. 1605లో నాటి మొగుల్ చక్రవర్తి జహంగీర్ ఈ దేశాన్ని ఇస్లామిక్ సామ్రాజ్యంగా మార్చాలని చేసిన ప్రయత్నాలను వ్యతిరేకించి మత మార్పిడికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. ప్రజలో పలుకుబడి, నమ్మకం కలిగిన గురు అర్జన్ దేవ్ చర్యలను అడ్డుకోవడానికి జహంగీర్ 1606లో గురు అర్జన్ దేవ్‌ను బంధించి లాహోర్ జైలులో వేశారు. గురు అర్జన్ దేవ్ పైన జరిగిన హింస ఊహకందనిది. మండుతున్న వేడి ప్లేట్లపై కూర్చోబెట్టడం, శరీరంపై కాలుతున్న ఇసుక పోయడం లాంటి భయానక చర్యలను ఐదు రోజుల పాటు కొనసాగించారు. గురు అర్జన్ దేవ్‌ను రావి నది వద్దకు తీసుకువెళ్లిన తర్వాత తిరిగి ఆయన వెనక్కి రాలేదు, ఎవరికీ కన్పించలేదు. 16 జూన్ 1606న గురు అర్జన్ దేవ్ "రావి నది" సమీపాన చిత్ర హింసలకు గురై అమరత్వం పొందాడని, ఆ రోజున సిక్కుల గుమిగూడి ఊరేగింపులు, ఆరాధన వేడుకలు, శాంతియుత సమావేశాలు నిర్వహిస్తూ ఆయన చూపిన మార్గంలో నడవడం, ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకోవడం తరతరాలుగా కొనసాగుతూ వస్తున్నది. మతం పట్ల గురు అర్జన్ దేవ్ సాహిబ్ చూపిన విశ్వాసం, మతం కోసం ప్రాణ త్యాగానికి కూడా వెనకాడకపోవడం, చిత్రహింసలు పెట్టినా మతం మారడానికి అంగీకరించక పోవడం లాంటి లక్షణాలు నేటి సిక్కు మత పౌర సమాజానికి దారి దీపాలుగా మారాలి, ఆయన త్యాగాల పునాదులపై శాంతియుత సమాజ నిర్మాణం జరగాలని ఆశిద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# మానసిక వికలాంగులను పట్టించుకోరా..?

వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్న తల్లిదండ్రులు, అలసిపోయిన సంరక్షకుల కోసం ప్రత్యేక నివాస గృహాలు, కమ్యూనిటీ ఆధారిత సంరక్షణ కేంద్రాలు లేకపోవడం ఒక తీవ్రమైన సామాజిక సంక్షేమ సమస్యగా మారింది. ప్రభుత్వాలు వికలాంగుల పింఛన్లు, కొన్ని సంక్షేమ పథకాలు అందిస్తు న్నప్పటికీ, తీవ్రమైన మానసిక మేధో వికలాంగుల జీవితాంత సంరక్షణ అవసరాలను తీర్చడానికి అవి సరిపోవడం లేదని కుటుంబాలు వాపో తున్నాయి. ఇప్పుడు మేధో వికలాంగుల సంరక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్న వేలాది కుటుంబాలు ప్రతిరోజూ ఒక బాధాకరమైన ప్రశ్నతో జీవిస్తున్నాయి

"మా తర్వాత మా పిల్లలను ఎవరు చూసుకుంటారు?" ఏపీలోని చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని కర్లగట్ట గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (చిన్నకుట్టి) పరిస్థితి వేలాది కుటుంబాల వేదనకు ప్రతిబింబంగా నిలుస్తోంది. చిన్నప్పటి నుంచి మానసిక వికలాంగుడు విజయ్ కుమార్ తల్లిదండ్రుల సహాయం లేక ప్రభుత్వ పింఛన్‌పైనే జీవనం సాగిస్తున్నాడు. అతని అన్న వెంకటేశు తన జీవితాన్నే తమ్ముడి సంరక్షణకు అంకితమయ్యారు. ప్రతిరోజూ ఎక్కడో తిరుగుతున్న తమ్ముడిని వెతికి పట్టు కుని స్నానం చేయించడం, భోజనం పెట్టడం, రాత్రికి సురక్షితంగా ఇంటికి తీసుకురావడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నాడు. అతని భద్రత కోసం సమీప గ్రామాల్లో తాత్కాలిక ఆశ్రయాలను కూడా ఏర్పాటు చేశారు. వెంకటేష్ సేవాభావం ప్రశంసనీయం అయినప్పటికీ, కుటుం బాలు తగిన సంస్థా గత మద్దతు లేకుండా ఎంతటి భారాన్ని మోస్తున్నాయో ఈ ఉదాహరణ స్పష్టంగా తెలియజేస్తోంది. అనంత పురం జిల్లా కుందుర్పి ప్రాంతంలో మాన సిక వికలాంగత కలిగిన ఒక బాలిక వీధుల్లో అసురక్షిత పరిస్థితుల్లో తిరు గుతూ వేధింపులు, లైంగిక దాడులకు దోపిడీకి గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటువంటి సంఘటనలు మానసిక వికలాంగుల కోసం సురక్షిత నివాస కేంద్రాలు బలమైన సామాజిక రక్షణ వ్యవస్థల అత్యవసర అవసరాన్ని చాటుతున్నాయి. వికలాంగుల హక్కుల కోసం పనిచేస్తున్న సంస్థల ప్రకారం, ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ, మేధో వికలాంగతలు మరియు తీవ్రమైన మానసిక సమ స్యలతో కోట్లాది భారతీయులు జీవిస్తున్నారు. ప్రతి వికలాంగుడి వెనుక భావోద్వేగ, శారీరక, ఆర్థిక భారాలతో పోరాడుతున్న ఒక కుటుంబం ఉంది. సంరక్షకులు రోజంతా పర్యవేక్షణ, వైద్య సేవల సమన్వయం, భద్రత, ప్రవర్తనా సమస్యల నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తిస్తూ తీవ్ర ఒత్తిడి, సామాజిక ఒంటరితనం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలోకి వెళ్లే కొద్దీ ఈ సమస్య మరింత తీవ్రమ వుతోంది. అరవై, డెబ్బై ఏళ్ల వయస్సులో ఉన్న అనేక మంది సంరక్షకులు తమ తర్వాత తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని నిరంతరం ఆందో ళన చెందుతున్నారు. వారి దృష్టిలో ఇది కేవలం సంక్షేమ సమస్య కాదు, వారి గౌరవం, భద్రత, భవిష్యత్తుకు సంబంధించిన అంశం. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో విజయవంతమైన నమూనాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. కేరళలో ఏర్పాటు చేసిన "రెస్పైట్ హోమ్స్" వికలాంగులను తాత్కాలికంగా ఆశ్రయించి, సంరక్షకులకు అత్యవసర పరిస్థితుల్లో లేదా విశ్రాంతి కోసం కొంత సమయం కల్పిస్తు న్నాయి. పూణేలోని నవక్షితిజ్, మహారాష్ట్రలోని ఆధార్ స్పెషల్ హోమ్ వంటి సంస్థలు మేధో వికలాంగులకు దీర్ఘకాలిక నివాస సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి, సమాజంలో భాగస్వామ్య జీవన అవకాశాలను కల్పిస్తున్నాయి. హైదరా బాద్‌లో కూడా ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల కోసం సమూహ నివాస కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. జాతీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఘరౌండా" పథకం మేధో అభివృద్ధి వికలాంగులకు జీవితాంత ఆశ్రయం, సంరక్షణ అందించడానికి ఉద్దేశించబడింది. అయితే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఇలాంటి సదుపాయాలు చాలా తక్కువగా ఉన్నాయని కార్యకర్తలు పేర్కొంటున్నారు. అందువల్ల తల్లిదండ్రులు, సంరక్షకులు, వికలాంగుల హక్కుల సంఘాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలను ప్రతి జిల్లాలో ప్రత్యేక నివాస గృహాలు, థెరప్యూటిక్ గ్రామాలు, రెస్పైట్ కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి. ఈ కేంద్రాల్లో సురక్షిత నివాసం, వైద్య సేవలు, కౌన్సెలింగ్, పునరావాసం, వృత్తి శిక్షణ, వినోద కార్యక్రమాలతో పాటు నిపుణుల పర్యవేక్షణ అందించాల్సిన అవసరం ఉంది.




**చిన్నప్పటి నుంచి మానసిక వికలాంగుడు విజయ్ కుమార్ తల్లిదండ్రుల సహాయం లేక ప్రభుత్వ పింఛన్‌పైనే జీవనం సాగిస్తున్నాడు. అతని అన్న వెంకటేశు తన జీవితాన్నే తమ్ముడి సంరక్షణకు అంకితమయ్యారు.**
**ప్రతిరోజూ ఎక్కడో తిరుగుతున్న తమ్ముడిని వెతికి పట్టు కుని స్నానం చేయించడం, భోజనం పెట్టడం, రాత్రికి సురక్షితంగా ఇంటికి తీసుకురావడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నాడు. అతని భద్రత కోసం సమీప గ్రామాల్లో తాత్కాలిక ఆశ్రయాలను కూడా ఏర్పాటు చేశారు. వెంకటేష్ సేవాభావం ప్రశం సనీయం అయినప్పటికీ, కుటుం బాలు తగిన సంస్థా గత మద్దతు లేకుండా ఎంతటి భారాన్ని మోస్తున్నాయో ఈ ఉదాహరణ స్పష్టంగా తెలియజేస్తోంది.**
**అనంత పురం జిల్లా కుందుర్పి ప్రాంతంలో మాన సిక వికలాంగత కలిగిన ఒక బాలిక వీధుల్లో అసురక్షిత పరిస్థితుల్లో తిరు గుతూ వేధింపులు, లైంగిక దాడులకు దోపిడీకి గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటువంటి సంఘటనలు మానసిక వికలాంగుల కోసం సురక్షిత నివాస కేంద్రాలు బలమైన సామాజిక రక్షణ వ్యవస్థల అత్యవసర అవసరాన్ని చాటుతున్నాయి. వికలాంగుల హక్కుల కోసం పనిచేస్తున్న సంస్థల ప్రకారం, ఆటిజం, సెరెబ్రల్ పాల్సీ, మేధో వికలాంగతలు మరియు తీవ్రమైన మానసిక సమ స్యలతో కోట్లాది భారతీయులు జీవిస్తున్నారు. ప్రతి వికలాంగుడి వెనుక భావోద్వేగ, శారీరక, ఆర్థిక భారాలతో పోరాడుతున్న ఒక కుటుంబం ఉంది. సంరక్షకులు రోజంతా పర్యవేక్షణ, వైద్య సేవల సమన్వయం, భద్రత, ప్రవర్తనా సమస్యల నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తిస్తూ తీవ్ర ఒత్తిడి, సామాజిక ఒంటరితనం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలోకి వెళ్లేకొద్దీ ఈ సమస్య మరింత తీవ్రమ వుతోంది. అరవై, డెబ్బై ఏళ్ల వయస్సులో ఉన్న అనేక మంది సంరక్షకులు తమ తర్వాత తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని నిరంతరం ఆందో ళన చెందుతున్నారు.**



# విహార దినోత్సవం ప్రకృతితో ప్రయాణం

ప్రతి సంవత్సరం జూన్ 18న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ విహార దినోత్సవం ఒక చిరస్మరణీయమైన సందర్భం. ఇది కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులతో కలిసి ప్రకృతి మధ్య సుఖంగా గడిపే అవకాశాన్ని కల్పించే పర్వ దినం. ప్రకృతిలో మనుషుల అనుబంధాన్ని, విశ్రాంతిని, ఉల్లాసాన్ని ప్రతిబింబించే ఈ దినోత్సవం, వాస్తవానికి మన ఆరోగ్యానికి, భావోద్వేగాలకు, సమాజానికి విశేషంగా ఉపయోగపడే ఒక ప్రకృతి పండుగ లాంటిది. ఈ దినోత్సవం వెనక ఉన్న చరిత్ర స్పష్టంగా లిఖితంగా లేనప్పటికీ, 19వ శతాబ్దం నుంచే పాశ్చాత్య దేశాల్లో వేసవి కాలంలో కుటుంబాలు, స్నేహితులతో కలిసి పచ్చిక బయళ్లలో భోజనం చేస్తూ సమయం గడిపే సంప్రదాయం ప్రారంభమైంది. అప్పటి నుంచే ఇది ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ప్రజల జీవనశైలిలో భాగమైపోయింది. విహార దినోత్సవానికి అనేక ప్రకృతి నిర్మిత ప్రయోజనాలున్నాయి. ఆధునిక జీవితపు యాంత్రికత మధ్య ఒత్తిడిని తగ్గించేందుకు, ప్రకృతిలో ఒక రోజు గడిపితే మనసుకు ప్రశాంతత కలుగుతుంది. తాజా గాలిని పీల్చడం, పచ్చదనాన్ని వీక్షించడం, పక్షుల కిలకిల ధ్వనులను వినడం— విహారాలు మన ఆరోగ్యాన్ని మెరుగు పరచడమే కాక, కుటుంబ బంధాలను బలపరిచే, మానవ సంబంధాలకు ఉత్సాహాన్ని అందించే వినూత్న మార్గంగా నిలుస్తాయి. ఈ రోజును సార్థకంగా చేసుకోవాలంటే, పార్కులు, సరస్సుల తీరాలు, జలపాతాలు, పర్వత ప్రాంతాలు వంటి పచ్చని ప్రదేశాలను ఎంచుకోవాలి. ఇంట్లోనే తయారు చేసిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకెళ్లి ప్రకృతి సన్నిధిలో భోజనం చేయడం ఒక విశిష్ట అనుభవం. ఆటలు ఆడటం, పుస్తకాలు చదవటం, గానం చేయడం, పిల్లలతో సమయాన్ని గడపటం— అంతేకాదు, ఈ సందర్భాన్ని పర్యావరణ జాగ్రత్తల కోసం ఉపయోగించుకోవాలి. ప్లాస్టిక్ వాడకం నివారించాలి, శుభ్రత పాటించాలి, చెట్లను నాటి ప్రకృతికి కృతజ్ఞత తెలియ జేయాలి. విహారం అనేది చిన్న విరామం, నిత్య జీవిత ఆందోళనల నుంచి విముక్తి పొందే మార్గం. ఇది పర్యటన కన్నా మరింత సహజమైన, స్వేచ్ఛానుభూతిని కలిగించే అనుభవం. సాంకేతికత మధ్య చిక్కుకు పోయిన ఆధునిక మానవుడు సహజత్వాన్ని తిరిగి గుర్తుచేసుకునే అద్భుతమైన అవకాశం ఇది. ఈ దినోత్సవం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రకృతితో మమేకమై, జీవితాన్ని హర్ష భరితంగా ఆవిష్కరించు కోవచ్చు. ఈ రోజును కుటుంబ సమేతంగా, ప్రకృతి మధ్యలో గడిపితే, కేవలం మధుర జ్ఞాపకాలు మాత్రమే కాదు, జీవన శైలిలో ఒక మేలైన మార్పు కూడా ఏర్పడుతుంది. మనిషి మానవత్వాన్ని, ప్రకృతి ప్రేమను, మరియు అనుబంధాలను తిరిగి గుర్తు చేసే ఈ దినోత్సవాన్ని, ప్రతి ఒక్కరిమీ సమయాన్ని, సహృదయతను, పరిసరాలను పంచుకునే రోజుగా మార్చుకుందాం.



# జాతీయం-అంతర్జాతీయం



## తాత్కాలిక బ్యాన్ పై
# హైకోర్టుకు టెలిగ్రామ్

- నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో కేంద్రం నిర్ణయంపై విస్మయం
- అత్యవసర విచారణకు న్యాయస్థానం ఓకే

**న్యూఢిల్లీ, జూన్ 17,(ఎ.ఎం.ఎస్):**
నీట్ 2026 పేపర్ లీక్ ఘటన దేశాన్ని ఎలా కుదిపేసిందో అందరికీ తెలిసిందే. ఎంతో మంది విద్యార్థులను కలవరపెట్టిన పేపర్ లీక్ వ్యవహారం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో రీ ఎగ్జామ్‌కు కేంద్రం సిద్ధమవగా, అదే సమయంలో పేపర్ లీక్ కాకుండా టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా బ్యాన్ చేసింది. ఎగ్జామ్ పూర్తయ్యే వరకు టెలిగ్రామ్ యాప్‌పై ఆంక్షలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్ హైకోర్టును ఆశ్రయించింది. నీట్ యూజీ 2026 రీ టెస్టుకు ముందు టెలిగ్రామ్ సేవలపై కేంద్రం ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. పరీక్ష పూర్తయ్యే వరకు మాత్రమే ఈ తాత్కాలిక ఆంక్షలు కొనసాగుతాయని కేంద్రం చెప్పింది. అయితే ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు కూడా కోర్టు అంగీకరించింది.

జూన్ 21న నీట్ రీ టెస్టుకు ముందు ప్రశ్నాపత్రాల లీకేజీ, తప్పుడు సమాచార వ్యాప్తిని అరికట్టేందుకు టెలిగ్రామ్‌పై 24 గంటల తాత్కాలిక నిషేధం విధించాలని కేంద్రం నిర్ణయించింది. నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. టెలిగ్రామ్‌లో ఉన్న మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను తప్పుగా ఉపయోగిస్తున్నారని ఎన్టీఏ ఆరోపించింది. పరీక్ష పూర్తయ్యాక ఆ ప్రశ్నలను ఎడిట్ చేసి, పేపర్ లీక్ జరిగినట్లు తప్పుడు ఆధారాలు సృష్టిస్తున్నారని పేర్కొంది. అందుకే ఈ ఫీచర్‌ను కూడా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. అయితే, కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ తీవ్రంగా విమర్శించారు. కొంతమంది పేపర్ లీక్ చేస్తున్నారన్న కారణంతో 150 మిలియన్లకు పైగా సాధారణ వినియోగదారులను ఇబ్బందికి గురిచేయడం సరైంది కాదన్నారు. తాత్కాలిక నిషేధంతో సమస్య పరిష్కారం కాదని, మరో యాప్ ద్వారా లీక్ చేస్తే ఏం చేస్తారంటూ ఘాటుగానే స్పందించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గూగుల్, యాపిల్ తమ యాప్ స్టోర్ల నుంచి టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా తొలగించినట్లు సమాచారం. అయితే, భారత్‌లో ఎక్కువశాతం ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లనే ఉపయోగిస్తున్నారు. నీట్ రీ ఎగ్జామ్ వేళ టెలిగ్రామ్ తాత్కాలిక బ్యాన్‌ను విద్యార్థులతో పాటు, చాలా మంది స్వాగతిస్తున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రకారం టెలిగ్రామ్‌లోని కొన్ని గ్రూపులు ముందుగానే ప్రశ్నాపత్రాలను విక్రయిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నట్లు గుర్తించాయి. ఆ కారణంతోనే టెలిగ్రామ్‌పై తాత్కాలిక బ్యాన్ విధించారు. వీపీఎన్‌ల ద్వారా కూడా పేపర్ లీక్‌లకు పాల్పడుతున్నట్లు గుర్తించడంతోనే ప్రస్తుతానికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.




## రక్షణ రంగ ఎగుమతుల్లో
# భారత్ రికార్డు



- రూ.1.78 లక్షల కోట్లతో గరిష్టానికి చేరువ
- ఇది దేశ పారిశ్రామిక సత్తాకు నిదర్శనమంటూ ప్రశంసలు

**న్యూఢిల్లీ, జూన్ 17,(ఎ.ఎం.ఎస్)**
రక్షణ రంగంలో విదేశీ దిగుమతులపై ఆధారపడే స్థాయి నుంచి ప్రపంచ దేశాలకు ఆయుధాలను ఎగుమతి చేసే స్థాయికి భారత్ శరవేగంగా దూసుకెళ్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆత్మనిర్భర భారత్' సత్ఫలితాలను ఇస్తూ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో దేశీయ రక్షణ ఉత్పాదకత రూ. 1.78 లక్షల కోట్ల ఆల్‌టైమ్ హై రికార్డును తాకింది. ఐదేళ్లలోనే ఈ రక్షణ తయారీ సామర్థ్యం రెండింతలు కావడం గమనార్హం. ఒకవైపు లక్షల కోట్ల విలువైన మెగా డిఫెన్స్ ప్రాజెక్టులు పట్టాలెక్కుతుండగా.. మరోవైపు రికార్డు స్థాయిలో రూ. 38,424 కోట్ల రక్షణ ఎగుమతులు జరగడం దేశ సైనిక పారిశ్రామిక సత్తాకు అద్దం పడుతోంది. దేశీయ రక్షణ రంగంలో భారతదేశం చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆత్మనిర్భర భారత్ నినాదం సత్ఫలితాలను ఇస్తూ దేశ రక్షణ ఉత్పాదకతను మునుపెన్నడూ లేని స్థాయికి చేర్చింది. ఆర్థిక సంవత్సరం 2025 26లో భారత రక్షణ రంగ ఉత్పత్తి ఏకంగా రూ. 1.78 లక్షల కోట్ల ఆల్‌టైమ్ హై రికార్డును తాకినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరం (రూ. 1.54 లక్షల కోట్లు)తో పోలిస్తే 15.6 శాతం వృద్ధిని నమోదు చేయడమే కాకుండా.. 202021 నాటి గణాంకాలతో (రూ. 84,643 కోట్లు) పోల్చితే ఐదేళ్ల కాలంలోనే రెండింతలు కావడం విశేషం. గడిచిన దశాబ్ద కాలంలో దేశీయ రక్షణ తయారీ ఏకంగా నాలుగు రెట్లు పెరగడం గమనార్హం. ప్రస్తుత రక్షణ ఉత్పత్తుల్లో రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, ఇతర ప్రభుత్వ విభాగాలు 76 శాతం వాటాను కలిగి ఉండగా.. ప్రైవేట్ రంగం తన భాగస్వామ్యాన్ని 24 శాతానికి పెంచుకుంది. ప్రైవేట్ రంగ రక్షణ ఉత్పత్తి రూ. 42,000 కోట్ల అత్యున్నత స్థాయికి చేరింది. ఈ భారీ దేశీయ తయారీ వల్ల భారత్ రక్షణ ఎగుమతుల్లోనూ సరికొత్త చరిత్ర సృష్టించింది. గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 38,424 కోట్ల విలువైన ఆయుధాలు, సైనిక సామగ్రిని ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, రక్షణ శాఖ తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాల వల్లే ఈ ఘనత సాధ్యమైందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. బడ్జెట్ 2026 లో రక్షణ రంగానికి కేటాయించిన రూ. 7.85 లక్షల కోట్లు (ఆధునికీకరణ కోసమే రూ. 2.19 లక్షల కోట్లు) ఈ రంగానికి మరింత ఊతాన్నిచ్చాయి. భారత సైన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రానున్న రోజుల్లో అతిపెద్ద రక్షణ కొనుగోలు ప్రాజెక్టులు పట్టాలెక్కబోతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత వైమానిక దళ చరిత్రలోనే అత్యంత భారీ ప్రాజెక్టుగా భావిస్తున్న రూ. 3.25 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 114 రాఫెల్ యుద్ధ విమానాల తయారీ ఒప్పందం పరిశీలనలో ఉంది. అలాగే రష్యాతో ఐదో తరం 'సుఖోయ్ 57'పై చర్చలు జరుపుతూనే.. స్వదేశీ 'ఎల్సీఏ తేజస్ మార్క్ 1ఏ', అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లపై భారత్ పట్టుదలగా ఉంది. అదనంగా 97 తేజస్ విమానాల ఇండక్షన్ కోసం హెచ్ఏఎల్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచింది. హిందూ మహాసముద్రంలో చైనా, పాక్ నౌకాదళాల కదలికలను అడ్డుకునేందుకు జర్మనీకి చెందిన థైసెన్‌క్రుప్, మజగాన్ డాక్ సంయుక్తంగా 8 బిలియన్ డాలర్ల వ్యయంతో 6 అత్యాధునిక సాంప్రదాయ జలాంతర్గాములను భారత్‌లోనే నిర్మించనున్నాయి.

భారత నౌకాదళంలోకి పూణేకు చెందిన సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ అభివృద్ధి చేసిన మొట్టమొదటి మానవరహిత ఫాస్ట్ ఇంటర్‌సెప్టర్ క్రాఫ్ట్‌లను చేర్చుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవే కాకుండా రూ. 3.84 లక్షల కోట్ల విలువైన క్షిపణులు, ఆర్టిలరీ, డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, 156 లైట్ కాంబాట్ హెలికాప్టర్ ప్రచండ్‌ల కొనుగోలుకు రక్షణ కొనుగోలు మండలి ఆమోదం తెలిపింది. లక్నోలో బ్రహ్మోస్ క్షిపణుల టెస్టింగ్ ఫెసిలిటీ కూడా తన విధులను ప్రారంభించింది.

# భారత్‌కు అమెరికా షాక్..

**యూఎస్ ఇండో పసిఫిక్ కమాండ్‌లోంచి ఇండో పదం తొలగింపు దేశానికి అవమానకమంటున్న మేధావులు**
**పెదవి విప్పని ట్రంప్**




**న్యూయార్క్, జూన్ 17:**
జీ7 సదస్సులో ప్రధాని మోదీ, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య కీలక భేటీ జరగనున్న వేళ అమెరికా రక్షణ శాఖ తీసుకున్న ఒక వివాదాస్పద నిర్ణయం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. తమ చారిత్రక సైనిక కమాండ్ పేరు నుంచి 'ఇండో' అనే పదాన్ని తొలగించి.. దానిని తిరిగి 'యూఎస్ పసిఫిక్ కమాండ్'గా మారుస్తున్నట్లు అగ్రరాజ్యం ప్రకటించింది. దీనికి తోడు తమ అధికారిక మ్యాప్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతాన్ని పాకిస్థాన్ భూభాగంగా చూపిస్తూ.. భారత్‌కు గట్టి షాక్ ఇచ్చింది.

చారిత్రక రక్షణ విభాగమైన 'యూఎస్ ఇండో పసిఫిక్ కమాండ్' పేరును మళ్లీ పాతపద్ధతిలోనే 'యూఎస్ పసిఫిక్ కమాండ్'గా మారుస్తున్నట్లు అమెరికా రక్షణ శాఖ అధికారికంగా ప్రకటించింది. "మా సైనిక విభాగానికి ఉన్న చారిత్రక మూలాలను గౌరవించడం, పసిఫిక్ సముద్ర తీర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే సైనికులలో సరికొత్త స్ఫూర్తిని నింపడం కోసమే ఈ పాత పేరును పునరుద్ధరించాలని నిర్ణయించాం" అని అమెరికా రక్షణ మంత్రిత్వ శాఖ తన నిర్ణయాన్ని సమర్థించుకుంది. నిజానికి 1947 జనవరి 1న నాటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ఎస్. ట్రుమ్యాన్ ఈ పసిఫిక్ కమాండ్‌ను ఏర్పాటు చేశారు. అమెరికా పశ్చిమ తీరం నుంచి భారత పశ్చిమ తీరం వరకు విస్తరించి ఉన్న ఈ దళం.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆయా ప్రాంతాల్లో శాంతి భద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా కొరియా, వియత్నాం యుద్ధాలతో పాటు ఎన్నో మానవతా దృక్పథ ఆపరేషన్లలోనూ భాగస్వామి అయింది. అయితే ట్రంప్ తన తొలి విడత అధికారంలో ఉన్నప్పుడు అంటే 2018లో హిందూ మహాసముద్రం ప్రాధాన్యతను గుర్తిస్తూ దీని పేరులో 'ఇండో' అనే పదాన్ని చేర్చారు. సరిగ్గా ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ట్రంప్ హయాంలోనే ఆ పదాన్ని తొలగించడం అంతర్జాతీయ దౌత్య వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కేవలం పేరు మార్పుతోనే ఆగకుండా.. ఈ కమాండ్ పరిధిని వివరించేందుకు అమెరికా రక్షణ శాఖ తన వెబ్‌సైట్‌లో ఉంచిన ఒక మ్యాప్ తీవ్ర వివాదాస్పదమైంది. అందులో భారత దేశానికి చెందిన 'పాక్ ఆక్రమిత కశ్మీర్' ప్రాంతాన్ని పాకిస్థాన్ భూభాగంలో కలిపి చూపించారు. భారత్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా ఉన్న ఈ చిత్రపటంపై రక్షణ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

అయితే ఇటు ప్రధాని మోదీ కాని అటు ట్రంప్ కాని దీనిపై అధికారికంగా స్పందించలేదు.



## భవానీపూర్ ఫలితంపై
# హైకోర్టుకు దీదీ

**కలకత్తా, జూన్ 17,(ఎ.ఎం.ఎస్)**
బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధినేత మమతా బెనర్జీ ఓటమి చెందిన విషయం తెలిసిందే. ఆమె పోటీ చేసిన రెండు స్థానాల నుంచి పరాజయం పొందారు. పోలింగ్ విధానంలో బీజేపీ అక్రమాలకు పాల్పడిందని పలుమార్లు ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నెలన్నర రోజుల తర్వాత తాను పోటీచేసిన భవానీపూర్ స్థానంలో ఫలితాన్ని సవాల్ చేస్తూ టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భవానీపూర్ నియోజకవర్గంలో సీఎం సువేందు అధికారి.. మమతను 15,105 ఓట్ల తేడాతో ఓడించారు.

# తృణమూల్ తరహాలోనే శివసేనలో చీలక..?

- ఉద్ధవ్ పార్టీలో కలకలం ఎంపీల ఫోన్లన్నీ స్విచ్ఛాఫ్ ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన

**ముంబయి, జూన్ 17,(ఎ.ఎం.ఎస్)**
తృణమూల్ కాంగ్రెస్‌లో చీలికల వార్త తర్వాత ఇప్పుడు మహారాష్ట్రలో కూడా అలాంటి పరిస్థితే కనిపిస్తోందని నేషనల్ మీడియా వార్తలు ప్రచురిస్తోంది. ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేనలో కలకలం మొదలైందని తెలుస్తోంది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీలు పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఉద్ధవ్ ఠాక్రేతో పాటు సీనియర్ నేతలు ఈ ఎంపీలతో మాట్లాడే ప్రయత్నం చేసినా ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడమే ఇందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి. మరోవైపు పార్టీలో చీలిక లేదని ఇంకోవర్గం ఈ వార్తలను కొట్టివేస్తోంది. మహారాష్ట్ర రాజకీయాలు ఎప్పుడూ ఎలా మారిపోతాయో ఎవ్వరికీ అంతుచిక్కవు. తాజాగా మహా రాజకీయాల్లో మరోసారి భారీ రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనలో తిరుగుబాటు చర్చలు జోరందుకుంటున్నాయి. పార్టీకి చెందిన కొందరు లోక్‌సభ సభ్యులు ఫోన్‌కు అందుబాటులో లేకపోవడం, మొబైల్స్ స్విచ్ ఆఫ్‌లో ఉండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఉద్ధవ్ ఠాక్రేతో పాటు కొందరు సీనియర్ నేతలు ఎంపీలతో నేరుగా మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికీ.. వారు ఫోన్‌కు అందుబాటులో లేరని తెలుస్తోంది. పార్టీ వరగ్గాలు వారిని సంప్రదించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఢిల్లీలో పార్లమెంటరీ కమిటీ సమావేశం నిర్వహించనుండగా, ఇప్పటికే కొందరు ఎంపీలు దేశ రాజధానికి చేరుకున్నారు. ఫోన్లకు అందుబాటులో లేని



కొంతమంది ఎంపీలు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరే అవకాశాలపై చర్చ సాగుతోంది. షిండే కుమారుడు ఎంపీ శ్రీకాంత్ షిండే ఢిల్లీ నివాసంలో కీలక సమావేశం జరగనుందని నేషనల్ మీడియా వార్తలు ప్రచురిస్తోంది. ఈ సమావేశానికి ఏక్‌నాథ్ షిండే కూడా హాజరయ్యే అవకాశం ఉంది.

ఉద్ధవ్ శివసనేకు చెందిన ఆరుగురు ఎంపీలతో షిండే వర్గం సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అందులో సంజయ్ దినా పాటిల్, సంజయ్ దేశ్‌ముఖ్, నాగేశ్ పాటిల్ అష్టికర్, ఓంరాజే నింబాల్కర్, భౌసాహెబ్ వక్చౌరే, సంజయ్ జాధవ్‌తో పాటు రాజాభావు వాజే కూడా పార్టీ మారే జాబితాలో చేరే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఉద్ధవ్ శివసేన పార్టీలో తిరుగుబాటు వార్తలను ఖండిస్తున్నారు. పార్టీలో ఎలాంటి చీలిక లేదని నేతలు చెబుతున్నారు. రాజ్యసభ సభ్యుడు రౌత్ మాత్రం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీలను కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికి రూ. 15 కోట్ల చొప్పున అడ్వాన్స్ ఇస్తున్నారని ఆయన ఆరోపించారు.

## కుప్పకూలిన విమానం
# అమెరికాలో ఘోర ప్రమాదం

**భారత్‌కు చెందిన కార్తీక్ సహా 11 మంది దుర్మరణం**
**మిస్సోరీ, జూన్ 17:**



అమెరికాలోని మిస్సోరీ స్టేట్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ముఖ్యంగా బేట్స్ కౌంటీ పరిధిలో ఉన్న బట్లర్ మెమోరియల్ విమానాశ్రయం దగ్గర్లో.. స్కైడైవర్లతో వెళ్తున్న ఒక చిన్న విమానం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కాన్సాస్ సిటీకి దక్షిణంగా 80 మైళ్ల దూరంలో జరిగిన ఈ ప్రమాదంలో పైలట్‌తో పాటు విమానంలో ఉన్న మొత్తం 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో భారత దేశానికి చెందిన 24 ఏళ్ల సాయి కార్తీక్ వర్మ అనే ఇంజినీర్ కూడా ఉండగా.. ఈ విషయాన్ని అమెరికా అధికారులు అధికారికంగా ధృవీకరించారు. భారత దేశానికి చెందిన సాయి కార్తీక్ వర్మ దట్ల ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లారు. యునైటెడ్ స్టేట్స్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీ' నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. అనంతరం కాన్సాస్ సిటీ మెట్రోపాలిటన్ ప్రాంతంలో స్థిరపడి, హెల్త్‌కేర్ టెక్నాలజీ రంగంలో తన కెరీర్‌ను నిర్మించుకుంటున్నారు. ఆయన లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం.. ప్రస్తుతం 'అడ్వెంట్ హెల్త్' సంస్థలో టెక్నాలజీ ప్రొఫెషనల్‌గా పని చేస్తున్నారు. గతంలో ప్రముఖ ఐటీ దిగ్గజం క్యాప్ జెమినిలోనూ సేవలు అందించారు. క్లౌడ్ మైగ్రేషన్, ఆటోమేషన్, సాఫ్ట్‌వేర్ డిప్లాయ్‌మెంట్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో నైపుణ్యం సంపాదించి.. ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్న తరుణంలోనే ఈ విషాదం చోటుచేసుకుంది. కాగా ఈ ప్రమాదంలో యూఎస్ పారాచూట్ అసోసియేషన్ (యూఎస్‌పీఏ) టెక్నాలజీ డైరెక్టర్ జెన్ షార్ప్ కూడా మరణించారు.

ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ నుంచి పసిఫిక్ ఏరోస్పేస్ 750ఎక్స్‌ఎల్ రకానికి చెందిన ఒంటి ఇంజిన్ విమానం రన్‌వే పైనుంచి గాల్లోకి లేచింది. అయితే టేకాఫ్ అయిన కొద్ది సేపటికే సాంకేతిక లోపం తలెత్తడంతో విమానం ఒక్కసారిగా వెనక్కి తిరిగింది. నియంత్రణ కోల్పోయిన విమానం.. భూమికి కేవలం 100 అడుగుల (30 మీటర్లు) ఎత్తులో ఉన్నప్పుడు ఒక్కసారిగా ఎడమ వైపునకు తిరుగుతూ ఎయిర్‌పోర్ట్ ఆవరణలోని ఒక ఖాళీ పొలంలో బోర్లా పడింది. అప్పుడే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో విమానంలో ఉన్న మొత్తం 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై యూఎస్ నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్టీఎస్‌బీ) వైస్ చైర్మన్ మైఖేల్ గ్రాహం స్పందిస్తూ.. విమానం కూలిపోవడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇప్పుడే చెప్పలేమని, ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను సేకరిస్తున్నామని తెలిపారు. ఈ చిన్న విమానంలో కమర్షియల్ విమానాల్లో ఉండే 'బ్లాక్ బాక్స్' లేదని, అయితే విమానంలో ఉన్న ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ఆధారంగా దర్యాప్తు జరుపుతామన్నారు. ప్రమాదానికి గురైన 2010 మోడల్ విమానం స్కైడైవింగ్ క్రీడకు ఎంతో అనుకూలమైనదని, ప్రమాదం జరగడానికి ముందు కూడా ఇది తొమ్మిది విజయవంతమైన సర్వీసులు పూర్తి చేసిందని ఫ్లైట్ ట్రాకింగ్ సంస్థ తెలిపింది.

# డ్రగ్స్ మాఫియా గుండెల్లో 'ఆపరేషన్ తూఫాన్'

- కేరళలో 15 రోజుల్లోనే 2,778 మంది అరెస్టు
- మూడు దశల్లో ఆపరేషన్ అమలు
- ప్రముఖ నటుడు మోహన్‌లాల్ సాయం

**తిరువునంతపురం జూన్ 17(ఎ.ఎం.ఎస్):**



కేరళలో మాదకద్రవ్యాల మహమ్మారిపై రాష్ట్ర ప్రభుత్వం సమర శంఖం పూరించింది. డ్రగ్స్ రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ తూఫాన్' ఉద్యమంలో మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ భాగస్వామి కానున్నారు. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు దశల్లో సాగనున్న ఈ మెగా ఆపరేషన్ ద్వారా కేవలం 15 రోజుల్లోనే రూ. 10 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుని, 2,778 మందిని అరెస్ట్ చేశారు. సినీ షూటింగ్ స్పాట్‌లు, డీజే పార్టీలపై కూడా ఆకస్మిక తనిఖీలు ఉంటాయని హోం మంత్రి రమేష్ చెన్నితల సంచలన ప్రకటన చేశారు.

ఈ భారీ ఆపరేషన్‌ను కేరళ ప్రభుత్వం మూడు ప్రత్యేక దశల్లో అమలు చేయనుంది. మొదటి దశలో భాగంగా వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు నేరుగా డ్రగ్స్ సరఫరాదారులు, అంతరాష్ట్ర ముఠాల నెట్‌వర్క్‌లను టార్గెట్ చేసి దాడులు నిర్వహిస్తాయి. రెండో దశలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించడంపై దృష్టి పెడుతుంది. ఈ దశలోనే నటుడు మోహన్‌లాల్ 'తూఫాన్ వారియర్'గా రంగంలోకి దిగి.. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇక చివరి దశలో భాగంగా డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకున్న బాధితులకు పునరావాసం, సరైన వైద్య చికిత్స అందించడంపై దృష్టి సారిస్తారు.

'ఆపరేషన్ తూఫాన్' ప్రారంభించిన మొదటి 15 రోజుల్లోనే అనూహ్యమైన ఫలితాలు వచ్చాయని హోం మంత్రి తెలిపారు.


రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 10 కోట్ల విలువైన మత్తు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవధిలోనే 2,575 కేసులు నమోదు కాగా.. 2,778 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 1.9 కేజీల నిషిద్ధ ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. కేరళకు నాలుగు అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉన్నాయని, భూ, జల మార్గాలతో పాటు విమానాశ్రయాల ద్వారా కూడా డ్రగ్స్ రాష్ట్రంలోకి రాకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశామని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో కస్టమ్స్, డీఆర్ఐ, రైల్వే పోలీస్, సీఐఎస్ఎఫ్, కోస్ట్ గార్డ్ వంటి కేంద్ర సంస్థలు కూడా రాష్ట్ర పోలీసులతో కలిసి పని చేస్తున్నాయని వివరించారు. ఎక్సైజ్ శాఖకు చెందిన 'ఆపరేషన్ థండర్'ను కూడా ఇందులో విలీనం చేశామన్నారు.

సినిమా షూటింగ్ లొకేషన్లు, క్యారవాన్లు, లేట్ నైట్ డీజే పార్టీల్లో డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టనున్నట్లు మంత్రి హెచ్చరించారు. డ్రగ్స్‌ను గుర్తించేందుకు అదనంగా ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ కుక్కలను రంగంలోకి దించుతున్నట్లు చెప్పారు. "ఆపరేషన్ తూఫాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదు. ఎక్కడైనా సరే తనిఖీలు చేయడానికి వెనకాడే ప్రసక్తే లేదు" అని ఆయన స్పష్టం చేశారు.

ఇదే సమయంలో డ్రగ్స్ కేసు నిందితుడి బంధువు ఒకరు మంత్రి పర్సనల్ స్టాఫ్‌లో ఉన్నారనే ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ ఆపరేషన్ విజయాన్ని అడ్డుకోవడానికి, ప్రభుత్వంపై బురద జల్లడానికి కొందరు చేస్తున్న కుట్ర మాత్రమేనని కొట్టిపారేశారు. కేరళ ప్రభుత్వ తాజా చర్యలతో డ్రగ్స్ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

# అలా చేస్తే ఎవరికి లాభం బాబు గారూ..?

**ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల పెంపుపై శశిథరూర్ సూటి ప్రశ్న**
**ఏపీ సీఎం చంద్రబాబుపై సెటైర్లు**
**న్యూఢిల్లీ, జూన్ 17 (ఎ.ఎం.ఎస్):**



దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పెంపునకు సంబంధించిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో పార్లమెంట్ ముందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చింది. అయితే, విపక్షాల ఐక్యతతో అవసరమైన మెజార్టీని ఈ బిల్లు సాధించలేకపోయింది. తాజాగా, ఈ అంశంపై ఏపీ ముఖ్యమంత్ర నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు. దక్షిణాదికి ఎటువంటి అన్యాయం జరగదని ఆయన చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. మీకు దక్షిణాది సీఎంల ఆందోళన కనిపించడం లేదా? అని నిలదీశారు.

దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ స్థానాలను 50 శాతం దామాషా పద్ధతిలో పెంచేలా స్పష్టమైన నిబంధనలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం త్వరలోనే ' నియోజకవర్గాల పునర్విభజన బిల్లు 'ను మళ్లీ తీసుకురానుందని, దీని వల్ల దక్షిణాదికి ఎటువంటి అన్యాయం జరగదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ కౌంటర్ ఇచ్చారు. దక్షిణాదికి జరిగే అన్యాయం మీకు కనిపించడం లేదా? అని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా చంద్రబాబుపై థరూర్ మండిపడ్డారు. ఈ సందర్భంగా మ్యాథమెటికల్ ఈక్వేషన్స్‌తో సహా ఆయన వివరించారు. ఒకవేళ 50 శాతం దామాషా పద్ధతిలో పెంచారని అనుకుంటే 20 స్థానాలున్న కేరళలో 30కి పెరుగుతాయని, అదే 80 స్థానాలున్న యూపీలో 120కి చేరుతాయని, ఇది 120 Vs 30గా మారితే ఎలా ఉంటుంది? అని అన్నారు.

“నాయుడుగారు ఓ చిన్న ఆలోచనాత్మక ప్రయోగాన్ని పరిశీలిద్దాం.. ఉదాహరణకు మీ జీతం రూ.2 లక్షలు.. మీ డ్రైవర్ జీతం రూ.20,000 అనుకుందాం.. మీరు చెప్పినట్టే ఇరువురి జీతం 50 శాతం పెంచారు.. అప్పుడు మీ జీతం రూ.3 లక్షలు అవుతుంది.. అదే డ్రైవర్‌కు రూ.30,000కు పెరుగుతుంది.. ఇక్కడ శాతం, నిష్పత్తి పెరుగుదలలో ఇద్దరికీ సమానమే. కానీ, గతంతో పోల్చితే మీ డ్రైవర్ కంటే మీరే ఎక్కువ ప్రయోజనం పొందారు కదా? మీ తోటి దక్షిణాది ముఖ్యమంత్రుల ఆందోళన కూడా దీని గురించే. ఈ రోజు ఉత్తర్ ప్రదేశ్‌కి ఉన్న 80 మంది ఎంపీలకు, కేరళకు ఉన్న 20 మంది ఎంపీలకు మధ్య వ్యత్యాసం ఏమీ లేదు అని అనుకుంటున్నారా? ఒకవేళ అది 120 వర్సెస్ 30గా మారితే ఎలా ఉంటుంది? నిష్పత్తి పరంగా తేడా అంతే ఉన్నప్పటికీ రాజకీయ ప్రాధాన్యతలో మాత్రం చాలా వ్యత్యాసం వస్తుంది.. కేరళలో కేవలం 10 సీట్లు మాత్రమే పెరిగితే, యూపీకి ఏకంగా 90 సీట్లు పెరుగుతాయి. ఈ పరిణామం మీకు ఎంతమాత్రం ఆందోళన కలిగించడం లేదా?” అని శశిథరూర్ ప్రశ్నించారు.

# ఆ వార్తలకు జేడీ వాన్స్ ఖండన

**ఇరాన్‌కు నిధుల సాయంపై స్పష్టత**
**నిబంధనలతో కూడిన పెట్టుబడులేనంటూ వెల్లడి**
**న్యూయార్క్, జూన్ 17:**



అమెరికాఇరాన్ తాత్కాలిక వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా ప్రభుత్వం ఏకంగా 300 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.25 లక్షల కోట్లు) నిధులను ఇస్తోందంటూ అంతర్జాతీయ మీడియాలో వస్తున్న వార్తలను అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ తీవ్రంగా ఖండించారు. ఈ నిధుల వ్యవహారంపై ఆయన పూర్తి స్పష్టతనిచ్చారు. అమెరికా పన్ను చెల్లింపుదారుల సొమ్ము నుంచి ఇరాన్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని, ఇది కేవలం నిబంధనలతో కూడిన విదేశీ పెట్టుబడుల ప్రక్రియ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రముఖ అంతర్జాతీయ టాక్ షో 'ది మెగిన్ కెల్లీ షో'లో ఆయన ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ గనుక శాంతి ఒప్పంద నిబంధనలకు కట్టుబడి ఉంటే.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఆ దేశంపై ఉన్న కొన్ని కఠినమైన ఆంక్షలను అమెరికా సడలిస్తుందని జేడీ వాన్స్ వివరించారు. దీనివల్ల ఇతర దేశాలు ఇరాన్‌లో పెట్టుబడులు పెట్టేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. "ఉదాహరణకు మనకు మంచి మిత్రదేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఇరాన్‌లోని ఒక అణు విద్యుత్ ప్లాంట్‌లో పెట్టుబడి పెట్టాలని అనుకుంటే.. మనం ఆంక్షలు ఎత్తివేయకుండా అది సాధ్యం కాదు. ఇరాన్ తన ప్రవర్తనను మార్చుకుంటేనే ఇతర దేశాలు అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అనుమతిస్తాం.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు



**కోదాడ జూన్ 17(వుదయం)**

కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హుజూర్‌నగర్ రోడ్డులోని శకుంతల థియేటర్ వద్ద భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, పీసీసీ డెలిగేట్ లక్ష్మీనారాయణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రావెల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్న నాయకులు ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## విధుల్లో రాణిస్తూనే పిల్లల అభ్యున్నతికై కృషి చేయాలి: పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్ క్రైం, జూన్ 17 (వుదయం ప్రతినిధి) :**

నిరంతరం విధినిర్వహణలో భాగంగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తునే తమ పిల్లల అభ్యున్నతి కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ప్రతిష్టాత్మకమై ముంబాయి ఐఐటీ కళాశాలలో అడ్మిషన్ సాధించిన ఇన్స్‌స్పెక్టర్ కుమార్తెను వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్ తనయురాలు యడ్లపల్లి సాత్విక జెఈఈ మెయిన్స్ పరీక్షలో 99.65 పర్సంటైల్ సాధించగా, ఇటీవల నిర్వహించిన జె.ఈ.ఈ అడ్వాన్స్ పరీక్షల్లో రాణించి 8808 ర్యాంక్‌తో ముంబాయి ఐఐటీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీటు సాధించడం జరిగింది. దీనితో సాత్వికను వరంగల్ పోలీస్ కమిషనర్ తన చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సిపి సాత్వికతో ముచ్చటిస్తూ రాబోవు రోజుల్లో మరింత కష్టపడాల్సి వుంటుందని దేశంలోనే అత్యున్నతమైన విద్యా సంస్థలో సీటు సాధించడం గొప్ప విషయమని, ఇదే రీతిలో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని, ముఖ్యంగా నిరంతరం విధుల్లో వుండే పోలీసుల పిల్లలు గత కొద్ది సంవత్సరాలు చదువుల్లో రాణించడం, ఉన్నత ఉద్యోగాలను సాధించడం సంతోషాన్ని కలిగిస్తోందని సిపి తెలియజేసారు.

## ఏజెన్సీలో తొలి ప్రైవేట్ ఐటీ కంపెనీ ప్రారంభం : మంత్రి సీతక్క

**గ్రామీణ యువతకు స్థానికంగానే ఐటీ ఉపాధి లభించాలి**

**అభివృద్ధి వికేంద్రీకరణతోనే మారుమూల ప్రాంతాలకు న్యాయంఐటీ**

**రంగానికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది**

**సంస్థను ప్రారంభించిన రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**ములుగు, జూన్ 17 (వుదయం ప్రతినిధి):**

ములుగు ఏజెన్సీ జిల్లాలో తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఐటీ సంస్థ ఏర్పాటు కావడం సంతోషకరమని, గ్రామీణ యువతకు స్థానికంగానే ఐటీ రంగంలో ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 'శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఐటీ రంగం కేవలం నగరాలకే పరిమితం కాకుండా ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి ఏజెన్సీ ప్రాంతాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాల వికేంద్రీకరణ ద్వారానే మారుమూల ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు."నేటి సాంకేతిక యుగంలో ఎక్కడి నుంచైనా పని చేసే (Work from anywhere) అవకాశాలు ఉన్నాయి. ములుగు జిల్లాలో మరిన్ని ఐటీ సంస్థలు స్థాపించడానికి ముందుకు రావాలి, పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకారం అందిస్తుందని మంత్రి సీతక్కఅన్నారు. గత ఏడాది కాలంగా స్థానిక యువతకు యాప్ డెవలప్‌మెంట్ వంటి ఆధునిక నైపుణ్యాలలో శిక్షణ ఇచ్చి, ప్రస్తుతం 15 మందికి ఉపాధి కల్పించిన శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్ రంగారి ముందడుగును మంత్రి అభినందించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ములుగు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## నేడే ఎస్ఐఆర్-2026పై అవగాహనకు 2కె రన్: జిల్లా కలెక్టర్



**హనుమకొండ, జూన్ 17 (వుదయం ప్రతినిధి):**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లలో అవగాహన పెంచేందుకు గురువారం ఉదయం 7:00 గంటలకు 2కె రన్ నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లలో అవగాహన కోసం చేపట్టే ఈ కార్యక్రమాన్ని హనుమకొండ అదాలత్ సర్కిల్ లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నుండి జిల్లా కలెక్టరేట్ వరకు 2కె రన్ సాగుతుందని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

## కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి

**జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 17 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ సూచించారు.బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డా. తుకారాం రాథోడ్ అధ్యక్షతన జిల్లా కుష్ఠు నిర్మూలన కార్యక్రమాలపై డిపిఎంఓలు (లెప్రసీ) మరియు హెల్త్ ఎడ్యుకేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుష్ఠు వ్యాధి అనుమానితులను త్వరితగతిన గుర్తించి పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ) చికిత్స ప్రారంభించి పూర్తిస్థాయిలో పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో యాక్టివ్ కేస్ సెర్చ్, కాంటాక్ట్ సర్వేలు, ఫాలోఅప్ పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని హెల్త్ ఎడ్యుకేటర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చికిత్స, వైకల్య నివారణ చర్యలు, స్వీయ సంరక్షణ పద్ధతులపై ప్రచారం నిర్వహించాలని తెలిపారు.పాఠశాలలు, గ్రామ సభలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య మరియు పోషణ కమిటీ సమావేశాల ద్వారా ఆరోగ్య విద్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే ఐఈసీ, బీసీసీ కార్యక్రమాలను బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో రికార్డులు, నివేదికలను సకాలంలో నవీకరిస్తూ నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో చేతబడి, బాణామతి వంటి మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని ఆరోగ్య విద్యా బోధకులకు ఆదేశించారు.ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రతాప్, ఫిజియోథెరపిస్ట్ భద్రు, మోహన్, శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్లు జయలక్ష్మి, రమాదేవి, బేబీ, వినయ్ కుమార్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ నియంత్రణకు సమష్టి కృషి అవసరం

**జ్వరాల సర్వేలు వేగవంతం చేయాలి –**

**జిల్లా మలేరియా అధికారి డా. రాందాస్**

**ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహణ తప్పనిసరి –**

**డీవై.డీఎంహెచ్‌వో డా. శ్రీధర్**



**భద్రాచలం, జూన్ 17 (వుదయం ప్రతినిధి):**

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి డా. రాందాస్ అధికారులకు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి గిరిజన ప్రాంతంలో అప్రమత్తంగా పనిచేయాలని ఆయన అన్నారు. బుధవారం భద్రాచలం మలేరియా కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి డా. రాందాస్, భద్రాచలం డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీవై.డీఎంహెచ్‌వో) డా.శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో గత నెలలో నమోదైన జ్వరాల కేసులు, మలేరియా నిర్ధారణ పరీక్షలు, డెంగ్యూ కేసుల పరిస్థితి, దోమల నియంత్రణ చర్యలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి సబ్ యూనిట్ పరిధిలో నమోదవుతున్న జ్వరాల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అనుమానిత కేసులకు వెంటనే రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.డా. రాందాస్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల పెరుగుదల అధికంగా ఉంటుందని, చిన్న నిర్లక్ష్యం కూడా వ్యాధుల వ్యాప్తికి కారణమవుతుందని అన్నారు. అందువల్ల ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మలేరియా ఫీల్డ్ సిబ్బంది సమన్వయంతో ఇంటింటి జ్వరాల సర్వే నిర్వహించాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తిని గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధి తీవ్రత పెరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతి శుక్రవారం నిర్వహించే "డ్రై డే" కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఇళ్లలో, పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, వ్యాపార సముదాయాల్లో, నిర్మాణ ప్రదేశాల్లో, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, పూల కుండీలు, నీటి ట్యాంకులు వంటి ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి వెంటనే నిర్మూలన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.డీవై.డీఎంహెచ్‌వో డా. శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని తెలిపారు. గ్రామాలు, గిరిజన తండాలు, మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. జ్వరాల లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు తెలియజేయాలని అన్నారు.మలేరియా లేదా డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే ప్రత్యేక బృందాలు పర్యటించి పరిస్థితిని అంచనా వేయాలని సమావేశంలో నిర్ణయించారు. బాధిత ప్రాంతాల్లో యాంటీ లార్వల్ చర్యలు, దోమల మందు పిచికారీ, ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టి వ్యాధి వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించారు. అవసరమైన మందులు, ర్యాపిడ్ డయాగ్నస్టిక్ కిట్లు, పరీక్షా సామగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు పేర్కొన్నారు. పాఠశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు రాజకీయ నాయకులు సహకరించాలి – జిల్లా కలెక్టర్



**సూర్యాపేట జూన్, 17 వుదయం ప్రతినిధి:**

రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. జూన్ 18న బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ ఇస్తారని వివరించారు. జూన్ 25 – జూలై 24వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని, 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 24 – 30వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారన్నారు. ఓటర్ల ముసాయిదా జులై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు. ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా, ముసాయిదా జాబితా తర్వాత నోటీసు ఇచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, మరియు డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 31 ప్రకారం, ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు.ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫామ్–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అయిన 01–10–2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు.

ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారిన వారు ఫామ్–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి డి. ప్రేమ్ రాజ్, రాజేశ్వర్ రావు, అంజాద్, ఐ ఎన్ సి, కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ బిఆర్ఎస్, బి జె పి అభిద్, గోపి సి పి ఐ (ఎం) స్టాలిన్ బి ఎస్ పి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సీఎం సహాయనిధి:

**ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**



**ఇల్లందు జూన్ 17,(వుదయం):**

పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ఒక వరమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు.ఇల్లందు మండలం, పట్టణ పరిధికి చెందిన 55 మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 56 మంది లబ్దిదారులకు రూ. 56,06,496 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, ఏఎంసి చైర్మన్ భానోత్ రాంబాబు, 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్, తహసీల్దార్ ఖాసీం,అలాగే పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగిస్తాం: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**చండూరు, జూన్ 17 (వుదయం):**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ కామ్రేడ్ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం చండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సంబంధించిన వివిధ సమస్యలు, ప్రభుత్వ విధానాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ శ్రేణులు ప్రజలమధ్య ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## నకిలీ విత్తనాల విక్రయదారులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలి: జిల్లా కలెక్టర్



**భూపాలపల్లి జూన్ 17 (వుదయం విలేకరి)**

జిల్లాలోని ఎరువులు, విత్తనాలు విక్రయించే అన్ని దుకాణాలను మ్యాపింగ్ చేయాలని నకిలీ విత్తనాల విక్రయదారులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలి అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఎరువులు, విత్తనాల విక్రయాలు, మ్యాపింగ్, రైతు రిజిస్ట్రీ తదితర అంశాలపై వ్యవసాయ, సహకార, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 38 రైతు వేదికల ద్వారా ఎరువులు, విత్తనాల విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 15 రైతు వేదికల మ్యాపింగ్ పూర్తయిందని, మిగిలిన 23 రైతు వేదికల మ్యాపింగ్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విక్రయాలు ప్రారంభించాలని ఆదేశించారు. రైతులు యూరియాను యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని పొందేలా వారికి ప్రభుత్వం సూచించిన ధాన్యం సాగు విధానాలపై రైతుల్లో అవగాహన పెంచేందుకు డిపిఆర్ఓ ద్వారా కళాజాత ప్రదర్శనలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.నకిలీ విత్తనాల విక్రయదారులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పోలీసు కేసులు నమోదు చేసి, వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించారు. విక్రయ కేంద్రాల వద్ద పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని, ప్రతి విక్రయ కేంద్రంలో మండల స్థాయి అధికారి మరియు పోలీసు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

## అర్హు లైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి... జిల్లా కలెక్టర్



**ఖమ్మం, వుదయం బ్యూరో జూన్- 17**

అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఈ నెల 25 నుండి ప్రారంభం కానుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజెంట్ ల నియామకం చేయాలని, ఇంకనూ నియామకం చేయని రాజకీయ పార్టీలు వెంటనే ప్రక్రియ పూర్తి చేసి, జాబితా సమర్పించాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులతో, బూత్ స్థాయి ఏజెంట్ లు ఇంటింటి ఎన్యుమరేషన్ లో పాల్గొనాలన్నారు. ఇంకనూ మ్యాపింగ్ కాని వారి నుండి 11 రకాల ధృవీకరణలో ఏది ఉన్న సేకరించి బూత్ స్థాయి అధికారికి అందజేయాలన్నారు. 1987 కంటే ముందు పుట్టిన వారు స్వంతంగా, 1987 నుండి 2004 మధ్యలో పుట్టిన వారు స్వంతం తో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి, 2004 తర్వాత పుట్టిన వారు స్వంతంతో పాటు తల్లిదండ్రులు, తల్లిదండ్రులు లేకపోతే తాత/నానమ్మ ల ధృవీకరణలు ఆధార్ తో పాటు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ లు జూన్ 25 నుండి ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు రెండు కాపీలు నింపి, ఒకటి ఓటరుకు, ఒకటి బూత్ స్థాయి అధికారుల వద్ద ఉంచుకోవాలన్నారు. మ్యాపింగ్ అయిన వారు ఎటువంటి డాక్యుమెంట్స్ సమర్పించాల్సిన అవసరం లేదని, మ్యాపింగ్ కానివారు 11 రకాల ధృవీకరణలలో ఏదో ఒకటి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో ప్రజలు భాగస్వామ్యం అవ్వాలని, ఇందుకై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంఏ. రాజు, డిటి అన్సారీ, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బి. శ్యామ్ సుందర్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు లింగనబోయిన సతీష్ బాబు, బి. జసవంత్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. నరేందర్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, వై. రవి కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి చెరుకుపల్లి నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, జూన్ 17 (వుదయం ప్రతినిధి) :**

ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించే కేంద్రాలుగా మారాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. బుధవారం ఆయన లింగాల ఘనపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డు రూమ్, వివిధ విభాగాలు, ఫైళ్ల నిర్వహణను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలు, సూచనలుపరిశుభ్రత – క్రమశిక్షణ కార్యాలయ ఆవరణను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, ఫైళ్లను విభాగాల వారీగా క్రమబద్ధీకరించాలని సూచించారు.భద్రతకు ప్రాధాన్యం, కార్యాలయ భద్రతను పటిష్టం చేసేందుకు వీలుగా అన్ని ముఖ్య కార్యకలాపాలు సీసీ కెమెరాల పరిధిలోనే జరగాలని ఆదేశించారు.రికార్డుల భద్రత, రికార్డు రూమ్‌లోని కీలక పత్రాలు దుమ్ము, తేమ, అగ్ని ప్రమాదాల బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యాలయానికి వచ్చే రైతులకు, ప్రజలకు తాగునీరు, కూర్చునేందుకు సిట్టింగ్ సదుపాయం, సమాచార బోర్డులు వంటి అన్ని కనీస వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన సేవలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## జ్ఞానాన్ని పెంచుకోవడానికి లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలి

**వనప్రేమి, డాక్టర్ పులుసం సాంబయ్య**

**గ్రంథాలయానికి 3000 రూపాయల పుస్తకాల వితరణ**



**కొత్తగూడ జూన్ 17(వుదయం ప్రతినిధి):**

గ్రంథాలయాలు విజ్ఞాన శాస్త్ర భాండాగారాలని, ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకొని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వనప్రేమి, ప్రముఖ ఆంగ్ల ఉపాధ్యాయులు డాక్టర్ పులుసం సాంబయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఓటాయి గ్రామంలో ధనసరి సాయికిరణ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "కొమురం భీమ్ – డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గ్రంథాలయానికి" ఓటాయి ఉన్నత పాఠశాలకు చెందిన డాక్టర్ పులుసం సాంబయ్య సుమారు 3 వేల రూపాయల విలువైన పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ పుస్తకాలలో అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్, ఇంగ్లీష్ సాహిత్యం, డిక్షనరీలు, నీట్ (నీట్ ), జేఈఈ (జెఈఈ) బుక్స్, తెలుగు సాహిత్యం, తెలంగాణ ఉద్యమ చరిత్ర మరియు ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన విలువైన గ్రంథాలు ఉన్నాయి. ఈ పుస్తకాలను ఆయన గ్రంథాలయ నిర్వాహకులు ధనసరి సాయికి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ పులుసం సాంబయ్య మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, యువతకు ఉపయోగపడేలా చక్కని లైబ్రరీని ఏర్పాటు చేసిన ధనసరి సాయిని ప్రత్యేకంగా అభినందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఈ పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఓటాయి ఉప సర్పంచ్ పెండ్యాల సారంగపాణి, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఓటాయి పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు భూక్య దశరథ్ కుమార్,కారోబార్ చిలుకమారి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రజా పాలనకు ఫలితం.. 11వ వార్డులో తాగునీరు, రోడ్ల సమస్యలకు శ్రీకారం

### ఎమ్మెల్యే ఆది ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పర్యటించిన చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ, జూన్ 17 {వుదయం}:**

వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ప్రజా పాలన–పట్టణ ప్రణాళిక వార్డు సభల్లో ప్రజలు లేవనెత్తిన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన వార్డు సభలో 11వ వార్డుకు చెందిన తాగునీటి సమస్య, అంతర్గత రహదారుల దుస్థితిని స్థానిక కౌన్సిలర్ వెంగల అనిత శ్రీకాంత్‌తో పాటు వార్డు నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆది శ్రీనివాస్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజును ఆదేశించారు.ఈ మేరకు బుధవారం 11వ వార్డులో మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించిన చైర్మన్ పుల్కం రాజు, చాలా కాలంగా నిర్వీర్యంగా మారిన మంచినీటి వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన ఈ ప్లాంట్‌ను త్వరలోనే పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్లాంట్ మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల మంజూరుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.రోడ్ల నిర్మాణానికి కొలతలుఅనంతరం వార్డులోని పలు కాలనీలు, వీధుల్లో పర్యటించిన చైర్మన్ స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గుంతలమయంగా మారిన అంతర్గత రహదారులను పరిశీలించి సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన కొలతలు తీసుకునే ప్రక్రియను ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులు సమకూర్చి త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.ప్రజల్లో హర్షం...వార్డు సభల్లో వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ చూపడం, వెంటనే మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పర్యటించి స్పందించడం పట్ల స్థానిక ప్రజలు, మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పాలకులు చొరవ చూపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పీర్ మొహమ్మద్, మున్సిపల్ ఏఈ అనన్య, వార్డు నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలం.. జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జూన్-17 (వుదయం ప్రతినిధి)**

ప్రస్తుత వానాకాలం–2026 సీజన్‌కు సంబంధించి పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.నేటికి జిల్లాలో 18,750 మెట్రిక్ టన్నుల యూరియా, i.e 4,12,511 యూరియా బస్తాలు నిల్వలో ఉండి, యూరియా బుకింగ్ యాప్ ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి వారం రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)తో పాటు ఇతర కంపెనీల నుంచి యూరియా నిల్వలు జిల్లాకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరాపై వ్యవసాయ శాఖ పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల పంటల విత్తనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం యూరియా బుకింగ్ యాప్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని, మరో రెండు లేదా మూడు రోజుల్లో యాప్‌ను తిరిగి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.కావున పెద్దపల్లి జిల్లా రైతులు అందరూ యూరియా బస్తాల లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు...

### ఎరువుల గోదాంలు విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ: జిల్లా కలెక్టర్



**జగిత్యాల జూన్ 17 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తెలిపారు బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి అకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా యూరియా అప్ ద్వారా విక్రయాలను పరిశీలించారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులకు కావలిసిన యూరియా నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు అప్ ద్వారా యూరియా బుక్ చేసుకుని కొనుగోలు చేయాలని సూచించారు సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన గోదాముల నిర్మాణానికి సంబంధించి పనులు తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ ను ఆదేశించారు జగిత్యాల రూరల్ మండలం జాబితాపూరు గ్రామంలో గోదాముల నిర్మాణానికి సంబంధించి ప్రదిపాదిత స్థలాన్ని పరిశీలించారు జిల్లాలో పెరుగుతున్న పంటల దిగుబడికి అనుగుణంగా గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు నాబార్డ్ సహకారంతో సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత గోదాముల నిర్మాణంతో జాబితాపూరు ప్రాంతం జిల్లాలో ధాన్యం నిల్వ కేంద్రంగా మారుతుందన్నారు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాముల నిర్మాణాన్ని పరిశీలించారు అదేవిధంగా అంతర్గాం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు ఈ పరిశీలనలో జిల్లా సహకార అధికారి చెరుకు మనోజ్ కుమార్ జిల్లా వ్యవసాయ అధికారి వి భాస్కర్ ఏడిఏ నాయక్ రూరల్ తాశీల్దార్ హకీం తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై పాశవికానికి కోర్టు కొరడా20 ఏళ్ల జైలు.. జీవిత ఖైదుతో కఠిన తీర్పు

### పోలీసు–ప్రాసిక్యూషన్ సమన్వయంతో న్యాయం.. అధికారులను అభినందించిన ఎస్పీ



**రాజన్న సిరిసిల్ల, జూన్ 17 {వుదయం}:**

మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడి, అనంతరం హత్య చేసిన కేసులో నిందితుడికి పోక్సో కేసులో 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు హత్య కేసులో జీవిత ఖైదు విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ బుధవారం ఈ మేరకు తీర్పు ప్రకటించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. కోడిమ్యాల్ మండలం శ్రీరాములపల్లికి చెందిన బండపల్లి నవీన్ అనే వ్యక్తి చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను లైంగికంగా వేధించిన ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది.అప్పటి వేములవాడ డీఎస్పీ వెంకట రమణ దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.అదే బాలిక హత్యకు గురైన ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. అప్పటి ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ విచారణ చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ సమర్పించారు.15 మంది సాక్షులతో నేరం రుజువుకోర్టు విచారణ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు 15 మంది సాక్షులను కోర్టు ఎదుట హాజరు పరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు నిందితుడి నేరం రుజువైందని నిర్ధారించింది.దీంతో బండపల్లి నవీన్‌కు పోక్సో కేసులో 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా, హత్య కేసులో జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.నేరస్తులు తప్పించుకోలేరు.. ఎస్పీ మైనర్లపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, సమాజంలో నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే కఠిన శిక్షలు అవసరమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు.ఈ కేసుల్లో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి డీఎస్పీ వెంకటరమణ, ప్రస్తుత డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐ రమేష్, ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు సిబ్బంది మహేందర్, లతీఫ్, నవీన్, వెన్నెలలను ఎస్పీ అభినందించారు.

## మోదీ 12 ఏళ్ల సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్తాం

### కోరుట్లలో మేధావుల సదస్సు

### 22న జగిత్యాలలో యువ సమ్మేళనం

### బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్



**ధర్మపురి జూన్ 17(వుదయం ప్రతినిధి):**

భారత ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా,దేశవ్యా ప్తంగా చేపట్టిన విస్తృత ప్రచార కార్యక్రమాల్లో భాగంగా స్థానిక వాసవి ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గడిచిన 12 ఏళ్లలో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించారని,కేంద్ర ప్రభుత్వం అమలు చేసి న చారిత్రాత్మక నిర్ణయాలు, అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దేశంలోని ప్రతి పౌరుడికీ వివరిం చడమే లక్ష్యంగా ఈ ప్రచార కార్య క్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గురువారం కోరుట్లలోని సంగయ్య ఫంక్షన్ హాల్‌లో మేధావుల సదస్సు, ఈ నెల 22వ తేదీన జగిత్యాల జిల్లా కేంద్రంలోని వికేఆర్ ఫంక్షన్ హాల్‌లో భారీ ఎత్తు న యువ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, కార్యదర్శి బెజ్జారపు లవన్ కుమార్, బీజేవైఎం కార్యక్రమ కో–కన్వీనర్ పూదరి పవన్, సీనియర్ నాయకులు పల్లెర్ల సురేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు తిరుమం దాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, పట్టణ ఉపాధ్యక్షులు సుంకు మధుసూ దన్, బీజేవైఎం నాయకులు మండలోజి సూరజ్, ఆనందాసు నవీన్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కాసెట్టి హరీష్ తదిత రులు పాల్గొన్నారు.

## సోలార్ ప్లాంట్ పెట్టండి... లాభాలు ఆర్జించండి

### నాబార్డు ద్వారా రుణం పొందండి

### సహకార సంఘాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు



**కరీంనగర్ జూన్17 (వుదయం ప్రతినిధి):**

హకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించే అవకాశం ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 1 మెగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఒక్కో సోలార్ ప్లాంట్ ద్వారా ఏటా రూ.50 లక్షల ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నాబార్డు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సక్రమంగా ఈఎంఐ చెల్లించే సహకార సంఘాలకు 1 శాతం వడ్డీకే రుణాలు లభిస్తాయన్నారు. ఈరోజు చొప్పదండి పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత జన ఔషధి కేంద్రాన్ని సందర్శించారు. జన ఔషధి కేంద్రానికి వస్తున్న ఆదరణపై ఆరా తీశారు. అతి తక్కువ ఖర్చుతో జన ఔషధిలో మందులు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకార సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన వ్యయంలో 80 శాతానికిపైగా నాబార్డు రుణ సౌకర్యం కల్పిస్తోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలిసారి చొప్పదండిలోనే సోలార్ ప్లాంట్ ఏర్పాటు కావడం అభినందనీయం. ఈ ప్లాంట్ ధ్వారా 1 మెగావాట్ కరెంట్ ను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో యూనిట్ ను 3 రూపాయల చొప్పున విద్యుత్ డిస్కంలు కొనుగోలు చేస్తాయి.వాస్తవానికి 1 మెగావాట్ ఉత్పత్తి కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు 3 కోట్ల 80 లక్షల రూపాయలు. సహకార సంఘం 40 లక్షలు వెచ్చించాలి. మిగిలిన 3 కోట్ల 40 లక్షల రూపాయలను నాబార్డ్ సంస్థ రుణం రూపంలో ఇస్తోంది. వడ్డీ 4 శాతం. ఒకవేళ సక్రమంగా ఈఎంఐ చెల్లిస్తే 3 శాతం వడ్డీని తిరిగి చెల్లిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నిజం చేస్తున్నాం

### నాడు కరీంనగర్ లో ... నేడు మండలాల్లోనే చెక్కుల పంపిణీ

### బాధితులకు గౌడన్నలకు అండగా ఉంటాం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మపురి జూన్ 17(వుదయం ప్రతినిధి):**

ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో పూర్తయిన 9 ఇందిరమ్మ ఇళ్లకు ఆయన గృహప్రవేశాలు చేయించారు.వెల్గటూర్ మండల కేంద్రం లో రూ.31.03 లక్షల విలువైన 91 సీఎంఆర్ఎఫ్ చెక్కులు,నలుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షే మాన్ని పూర్తిగా విస్మరించిందని, ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదని విమర్శిం చారు.నాడు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల కోసం లబ్ధిదారులు కరీంనగర్ చుట్టూ తిరగాల్సి వచ్చేదని,నేడు ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజ కవర్గంలోని మండల కేంద్రాల్లోనే స్థానికంగా చెక్కులు అందజే స్తున్నామని తెలిపారు. ఇందిరమ్మఇళ్ల లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా డబ్బులు జమ చేస్తున్నామని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల అగ్నిప్రమాదంలో దెబ్బతిన్న వెల్గ టూర్ మండలం జగదేవ్‌పేట ఈతవనాన్ని మంత్రి పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వ పరంగా తగిన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.గ్రామస్తుల కోరిక మేరకు జగదేవ్‌పేట బైపాస్ రోడ్డు, పెద్దమ్మ ఆలయంలో బోరుబావి, ఎస్సీ కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

### పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వ బడులలో చేర్పించాలి

### ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు



**నిజామాబాద్, జూన్ 17 :**

భావి తరాలకు బంగారు భవిష్యత్తు అందించాలనే సమున్నత ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సర్కారు బడులలో నాణ్యమైన విద్యా బోధనను అందించడంతో పాటు మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపర్చేందుకు చిత్తశుద్ధితో కృషి కొనసాగుతోందని తెలిపారు. మోపాల్ మండలం బోర్గాం(పి) జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం సందర్శించారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతుండడాన్ని గమనించిన కలెక్టర్ వారితో భేటీ అయ్యారు. తమ పిల్లలను ప్రైవేటు బడుల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపడంతో కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల భారం ఎక్కువగా ఉండడమే కాకుండా, ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తుండడంతో సర్కారు బడిలో తమ పిల్లలను చేర్పిస్తున్నామని తల్లిదండ్రులు పేర్కొనగా, ఈ విషయాలను వివరిస్తూ మిగితా వారిని కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, పదవ తరగతిలో 87 శాతం సగటు ఉత్తీర్ణత సాధించిన బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని చక్కటి భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. నాణ్యమైన విద్యా బోధనతో పాటు, అన్ని మౌలిక సదుపాయాలు కలిగిన ప్రభుత్వ బడులలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపుతున్నారని అన్నారు. ఇది వరకు పేద కుటుంబాల పిల్లలు ప్రభుత్వ బడులలో చదువుకుంటారనే భావన ఉండేదని, ప్రస్తుతం ఆర్థిక స్థోమత కలిగిన వారు కూడా నాణ్యమైన విద్య కోసం వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తుండడం శుభ పరిణామమని అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోటీ తత్వాన్ని పెంపొందించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులలో విద్యా ప్రమాణాలు, బోధనను మెరుగుపరుస్తోందని, ఉపాధ్యాయులకు బోధనా సామర్ధ్యాలను పెంపొందేలా శిక్షణ తరగతులను నిర్వహిస్తోందని గుర్తు చేశారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు,, నోట్ బుక్స్, ఏకరూప దుస్తులతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తోందని అన్నారు. కాగా, బోర్గాం(పి) పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో, బడికి ఆనుకుని ఉన్న స్థలాన్ని సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయా తరగతులను సందర్శించి విద్యార్థిని, విద్యార్థుల బోధనా సామర్థ్యాన్ని పరిశీలించి, బహుమతులు అందజేశారు. బాలబాలికలకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, మోపాల్ తహసిల్దార్ రేఖ, ఎం.ఈ.ఓ సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు.

## విద్యా కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష-

### ఆరోగ్య పాఠశాల కార్యక్రమ అమలుకు దిశానిర్దేశం



**ఆదిలాబాద్ :**

జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం 2026–27 విద్యా సంవత్సర కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న ‘ఆరోగ్య పాఠశాల’ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులతో సవివరంగా చర్చించి అవసరమైన సూచనలు, దిశానిర్దేశం చేశారు.విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులకు సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా అన్ని కార్యక్రమాలను సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని మెరుగుపరచేందుకు రిసోర్స్ పర్సన్ ఆర్.పి. సంతోష్ కుమార్ రూపొందించిన ‘టీచర్స్ డైరీ’ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ డైరీ ఉపాధ్యాయులకు బోధనలో మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, సంక్షేమ అధికారి మిల్కా, ఏఎంఓలు, రిసోర్స్ పర్సన్లు, అకడమిక్ కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం

### "రాజీయే రాజమార్గం" – మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

### జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి )**

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఈ నెల 20వ తేదీ శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ కోరారు. రాజీ పడదగిన వివిధ రకాల కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ మరియు వైవాహిక జీవితానికి సంబంధించిన సమస్యలు, బ్యాంకు రికవరీకేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాల్లో ఇరువర్గాలు పరస్పర రాజీ ద్వారా తమ వివాదాలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.చిన్న చిన్న వివాదాలను పెద్ద కక్షలుగా మార్చుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. "రాజీయే రాజమార్గం" అనే భావనతో న్యాయశాఖ కల్పిం చిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రూ వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు. జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు విధు లు నిర్వహించే పోలీసు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత ఇరువర్గాల వారితో కౌన్సిలింగ్ నిర్వహించి అవగాహన కల్పిస్తారని తెలిపా రు. తమ కేసుల్లో రాజీ ద్వారా పరిష్కారం కోరుకునే వారు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్నేహపూర్వక వాతావరణంలో వివాదాలను ముగించుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## మద్యం మత్తులో స్టీరింగ్ పడితే జైలుకే..!

### జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



**కామారెడ్డి, జూన్ 17 (వుదయం ప్రతినిధి):**

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా, ప్రజల ప్రాణాల రక్షణే పరమావధిగా కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ డ్రంక్ అండ్ డ్రైవ్ ఉల్లంఘనులపై ఉక్కుపాదం మోపుతోంది. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 434 మంది నిందితులను జిల్లాలోని వివిధ కోర్టుల ముందు హాజరుపరచగా, న్యాయస్థానాలు వారికి భారీ జరిమానాతో పాటు జైలు శిక్షలు ఖరారు చేస్తూ సంచలన తీర్పునిచ్చాయి.కోర్టుల ద్వారా నిందితులకు మొత్తం ₹4,94,300 జరిమానా విధించబడింది. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిలో 46 మందికి జైలు శిక్షలు ఖరారయ్యాయి. ఇందులో 29 మందికి ఒక రోజు, 16 మందికి రెండు రోజులు, ఒక వ్యక్తికి ఐదు రోజుల పాటు జైలు శిక్ష విధించారు.ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, మద్యం మత్తులో వాహనం నడపడం అనేది కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదని, అది సాటి మనుషుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని తీవ్రంగా హెచ్చరించారు. "మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డుపై వెళ్లే అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడటమే కాకుండా, ప్రమాదానికి గురైన వారి కుటుంబాలు కోలుకోలేని విషాదంలో మునిగిపోతున్నాయి. క్షణకాలం మత్తు కోసం మీ ప్రాణాలను బలిపెట్టకండి.

## ప్రభుత్వ బడుల్లోనే మంచి విద్య అందుతుంది: జిల్లా కలెక్టర్



**నిర్మల్ జిల్లా 17 జూన్ 2026 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. బుధవారం కుంటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు.విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బడికి హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తూ, అపరిశుభ్రతపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పదోతరగతి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్,చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కూడా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు లెక్కలు చేయించి, పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు.

# ఇది ఇల్లు కాదు.. మీ కలకు మేమిచ్చిన చిరునామా



**- ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**

**తెల్కపల్లి, జూన్ 16 (వుదయం ప్రతినిధి):**

తెల్కపల్లి మండలం ఆలేరు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరయ్యారు. తరతరాలుగా రేకుల నీడలో వానకు తడుస్తూ, ఎండకు మాడుతూ బతికిన పేద కుటుంబాలు పక్కా ఇంట్లోకి అడుగుపెట్టడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడారు: "అమ్మా, అయ్యా.. ఇన్నాళ్లూ మీరు గిన్నెలు పట్టుకుని వానకు నిలబడ్డారు. ఆ బాధ ఇవాల్టితో తీరిపోయింది. ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేస్తుంది. ఇది నేను మీకు వేసే భిక్ష కాదు, మీ హక్కు. ఇది నాలుగు గోడల ఇల్లు కాదు, మీ పిల్లల భవిష్యత్తుకు మేము వేసిన పునాది. మాట ఇచ్చాం, నెరవేర్చాం. ఇక మీ బిడ్డల కలలు తడవవు, ఎండవు." అనంతరం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన ఆయన అన్నారు: "పిల్లలూ.. ఇది మొక్క కాదు, మీ ఊపిరి. ప్రకృతిని కాపాడే బాధ్యతను చిన్ననాటి నుంచే అలవర్చుకోండి." తదుపరి గ్రామ సబ్ సెంటర్‌ను సందర్శించి, ఐదేళ్ల బాలుడికి డీపీటీ టీకా వేస్తుండగా పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడారు: "ఈ బిడ్డ చిరునవ్వే మనకు రిపోర్ట్ కార్డు. గ్రామంలో ఒక్క చిన్నారికీ టీకా మిస్ కావొద్దు. 100 శాతం టీకాలు అందాలి." గ్రామంలో జరిగిన బీరప్ప పండుగ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడారు: "ఉదయం మీ కన్నీళ్లు తుడిచేందుకు ఇందిరమ్మ ఇంటి గడప తొక్కా, ఇప్పుడు మీ సంబురంలో పాలుపంచుకునేందుకు బీరప్ప సన్నిధికి వచ్చా. మీ కష్టంలో నేనున్నా, మీ సంతోషంలోనూ నేనుంటా. మన పండగలు, మన ఆచారాలు.. ఇవే మన ఊరి పట్టుగొమ్మలు." ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, తెల్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండ పర్వతాలు, మాజీ సర్పంచ్ రమణ గౌడ్, మాజీ ఎంపీటీసీ జింకల ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు బాల గౌడ్, మాజీ డిప్యూటీ సర్పంచ్ బాలయ్య, యువజన నాయకులు ఆంజనేయులు, మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బడుల విలీనం కాదు... విద్యా వినాశనం! గట్టు మండలం నుంచి సర్కారుకు అల్టిమేటం.



**గద్వాల జూన్ 17 (వుదయం బ్యూరో)**

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంతల్లుల సంఘం ఆవేదన తెలంగాణ విద్యా వ్యవస్థ నేడు ఒక చారిత్రక సంక్షోభ సంధియుగంలో నిలిచింది. రాష్ట్ర భవిష్యత్తును, సామాజిక న్యాయాన్ని నిర్మించాల్సిన ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, ఏకంగా పాఠశాలల సంఖ్యను భారీగా తగ్గించే ఆలోచనలు రావడం తీవ్ర ఆందోళనకరం. సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను కేవలం 4 వేలకే పరిమితం చేయాలనే ప్రతిపాదనలు నిజమైతే, అది అణగారిన వర్గాల అక్షరాస్యతపై గొడ్డలిపెట్టే అవుతుంది.ప్రజాకాంక్షకు భిన్నంగా ప్రభుత్వ అడుగులుగత కొన్నేళ్లుగా తల్లుల సంఘాలు, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీలు క్షేత్రస్థాయిలో విశేష కృషి చేసి, ఇంటింటికీ తిరిగి 'బడిబాట' ద్వారా విద్యార్థుల నమోదును పెంచాయి. సమాజం మొత్తం ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని పునరుద్ధరిస్తున్న తరుణంలో, పాఠశాలల విలీనం లేదా మూసివేత ప్రతిపాదనలు ప్రజా ఆకాంక్షలను కాలరాయడమే.విద్య అనేది కేవలం ఒక సేవ కాదు, అది భారత రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కు. మౌలిక వసతుల లేమి, ఉపాధ్యాయ ఖాళీలు, నిధుల కొరత లాంటి సమస్యలకు పాఠశాలల మూసివేత ఎంతమాత్రం పరిష్కారం కాదు. బడులు దూరమైతే పేద, దళిత, గిరిజన, మైనారిటీ విద్యార్థులతో పాటు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ఆడపిల్లల డ్రాప్‌అవుట్ శాతం విపరీతంగా పెరుగుతుంది. మరోవైపు, పట్టణాల్లో ప్రభుత్వ ప్రత్యామ్నాయం లేక ప్రైవేట్ ఫీజుల దోపిడీకి మధ్యతరగతి కుటుంబాలు బలైపోతున్నాయి.ప్రభుత్వం ముందున్న నిఖార్సైన డిమాండ్లు: నిర్ణయ ఉపసంహరణ: ప్రభుత్వ పాఠశాలల మూసివేత, విలీన ఆలోచనలను తక్షణమే విరమించుకోవాలి. మౌలిక వసతులు & నియామకాలు: ప్రతి బడిలో తరగతి గదులు, మరుగుదొడ్లు, డిజిటల్ వనరులు కల్పిస్తూ.. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.కొత్త బడుల ప్రారంభం: జనాభా పెరుగుదలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్త విద్యాసంస్థలను ప్రారంభించాలి.ఫీజుల నియంత్రణ చట్టం: ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు కఠినమైన ప్రత్యేక చట్టాన్ని తేవాలి. బడ్జెట్ కేటాయింపులు: విద్యా కమిషన్ సిఫారసులపై అసెంబ్లీలో చర్చించి, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి.ముగింపు పలుకు: ప్రభుత్వ పాఠశాలలు కేవలం భౌతిక భవనాలు కావు; అవి సామాజిక సమానత్వానికి, ప్రజాస్వామ్య విలువలకు సజీవ పునాదులు. విద్యలో పెట్టుబడి పెట్టని ఏ రాజ్యమూ ప్రగతి సాధించలేదు. "ఉన్న బడులను బాగు చేయండి - కొత్త బడులను తెరవండి" అనే మాతృమూర్తుల ఆక్రందనను ప్రభుత్వం గౌరవించి తీరాలి.

# ఇందిరమ్మ ఇల్లు సూర్యమోహన్ రెడ్డి ప్రారంభోత్సవం



**మరికల్ జూన్ 17 (వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్ర పరిధిలోని పల్లె గడ్డ గ్రామంలో బుధవారం నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్యం పర్ణిక రెడ్డి మరియు మాజీ డిసిసి జిల్లా అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి శ్రీమతి కోడి గంటి కిష్టమ్మ శ్రీరాములు గారు ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించారు ఆయన ఈ సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని ఆయన అన్నారు ప్రతి పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు ఈ క్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సైలజ గ్రామ సర్పంచ్ మాల లక్ష్మి రాయుడు ఉప సర్పంచ్ గుంట కొమ్ము రామకృష్ణ మరికల్ మండల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి మండల యూత్ అధ్యక్షుడు తాటికొండ ఆంజనేయులు మార్కెట్ డైరెక్టర్ రాజారెడ్డి మాజీ మండల అధ్యక్షు వీరన్న పెంట మేని రఘు పోలేమోని రాములు రామకృష్ణ గోవర్ధన్ పోలేముని అశోక్ బొంత రామ కృష్ణ కడప రాయుడు చిన్న రాయుడు వెంకట రాములు పాండు కురుమూర్తి తో పాటు వాడి మెంబర్లు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# రైతు రక్తం తాగుతున్న 'ఎరువుల' రాబందులు!

**- నిబంధనలు బేఖాతరు..**
**జోగులాంబ గద్వాల జిల్లాలో - -- -**
**- మాఫియాలా మారిన డీలర్లు**
**యూరియా కావాలంటే - - - - - - - -**
**- కండిషన్లు.. రసీదు అడిగితే 'స్టాక్ లేదు పొమ్మంటూ' గెంతువేత**
**- కంటికి కనపడని వ్యవసాయ శాఖ నిఘా.. 'ఏసీ' రూములకే పరిమితమైన అధికారులు**

**గద్వాల జూన్ 17 (వుదయం బ్యూరో)**



వానాకాలం సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో జోగులాంబ గద్వాల జిల్లాలోని అన్నదాతలపై ఎరువుల ధరల భారం గుదిబండలా మారింది. అంతర్జాతీయ మార్కెట్ సాకుతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడాన్ని కొందరు ప్రైవేట్ డీలర్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించి, రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలు కాగితాలకే పరిమితం కాగా, క్షేత్రస్థాయిలో ప్రైవేట్ వ్యాపారుల 'నల్ల'దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.ఎంఆర్‌పీ మాయం.. అదనపు వసూళ్లే ధ్యేయం!ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర ఎంఆర్‌పీకు, క్షేత్రస్థాయిలో అమ్మకపు ధరలకు ఎక్కడా పొంతన లేకుండా పోయింది. కాంప్లెక్స్ ఎరువుల ప్రతి బస్తాపై రూ. 150 నుండి రూ. 300 వరకు అదనంగా వసూలు చేస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారు. గత యాసంగి సీజన్ ముగిసే సమయానికి సింగిల్ విండో (పిఎసి ఎస్)గోదాములు, ప్రైవేట్ దుకాణాల్లో నిల్వ ఉన్న పాత నిల్వలపై పాత ధరలే ముద్రించి ఉన్నప్పటికీ, వాటిని కూడా పెరిగిన కొత్త ధరలకే విక్రయిస్తూ అక్రమ లాభాలు గడిస్తున్నారు. ఎరువుల విక్రయాల్లో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన పిఓఎస్ మిషన్లు ఇక్కడ అలంకారప్రాయంగా మారాయి. అదనపు ధరలు వసూలు చేస్తున్నందున మెజారిటీ దుకాణదారులు రైతులకు ఎలాంటి రసీదులు (బిల్లులు) ఇవ్వడం లేదు. 'కండిషన్' పెడితేనే యూరియా! ప్రభుత్వం యూరియా బస్తా ధరను రూ. 266.50 గా నిర్ణయించింది. అయితే, ప్రస్తుతం డిమాండ్ ఉండటాన్ని ఆసరాగా చేసుకుని డీలర్లు సరికొత్త లింకు దందాను తెరపైకి తెచ్చారు. యూరియా బస్తా కావాలంటే, దానితో పాటు ఖచ్చితంగా అవసరం లేని ఏదో ఒక లిక్విడ్ లేదా కాంప్లెక్స్ ఎరువుల బస్తాను కొనాలంటూ రైతులపై బలవంతపు కండిషన్లు విధిస్తున్నారు.
కార్యాలయాలకే పరిమితమైన నిఘా! జిల్లా, మండల వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఆ నిఘా ఎక్కడా కంటికి కనిపించడం లేదు. టాస్క్ ఫోర్స్ తనిఖీలు కేవలం జిల్లా, మండల కేంద్రాలకే పరిమితమయ్యాయి తప్ప, గ్రామీణ ప్రాంతాల్లోని సబ్ డీలర్ల ఇష్టారాజ్య వ్యవహారాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారిక నిర్లక్ష్యం: పాత స్టాక్‌ను ఇప్పుడున్న రేట్లకు అమ్ముతున్నారనే విషయం ఇప్పటివరకు నా దృష్టికి రాలేదని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొనడం అధికారుల పర్యవేక్షణా లోపానికి అద్దం పడుతోంది. లైసెన్సులు రద్దు చేయాల్సిందే!నిబంధనలను బేఖాతరు చేస్తూ, అదనపు ధరలకు ఎరువులు విక్రయిస్తూ రసీదులు ఇవ్వని బ్లాక్ మార్కెట్ డీలర్ల లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని జిల్లాలోని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి, క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి తమను ఆదుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా రైతాంగం ముక్తకంఠంతో కోరుతోంది.

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

**- నేడునాగర్ కర్నూల్ లో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం**
**- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి**

**నాగర్‌కర్నూల్, జూన్ 17 (వుదయం బ్యూరో)**



పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 18న గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్ హాల్‌లో నాగర్‌కర్నూల్ నియోజకవర్గ బిఆర్ఎస్పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియ, BRS పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించి, దిశానిర్దేశం చేస్తామని వెల్లడించారు.నియోజకవర్గ పరిధిలోని నాగర్‌కర్నూల్ టౌన్, అన్ని వార్డులు, మండలాలు, గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు సైనికుల్లా క్రమశిక్షణతో తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని మర్రి జనార్దన్ రెడ్డి కోరారు. గడపగడపకూ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలంతా ఉదయం 10 గంటలలోపు సమావేశ ప్రాంగణానికి చేరుకోవాలని ఆయన కోరారు

# రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు...



**తాండూర్ వుదయం జూన్ 17-**

**- మండలంలోని కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని గురు వారం లెక్కించారు. - - - -**
**- ఆలయకమిటీ చైర్మన్ పట్లోళ్ల పటేల్ ప్రవీణ్ రెడ్డి , ఈవో - - - - - -**
**- శేఖర్‌గౌడ్, సభ్యుల ఆధ్వర్యంలో ఈ హుండీని లెక్కించారు.**

మండలంలోని కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని గురువారం లెక్కించారు. ఆలయకమిటీ చైర్మన్ పట్లోళ్ల పటేల్ ప్రవీణ్ రెడ్డి , ఈవో శేఖర్‌గౌడ్, సభ్యుల ఆధ్వర్యంలో ఈ హుండీని లెక్కించారు. హుండీలో భక్తులు వేసిన నగదు కానుకలు లెక్కించగా రూ.6లక్షల 92వేల 47 రూపాయల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ పటేల్ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమం లో గ్రామ ఉపసర్పంచ్ బైండ్ల రాజు,ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నవీన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలు, అర్చకులు శ్రీనివాస్ పంతులు,ఆలయ కమిటీ సభ్యులు కాపు సుజాత, చెవిటి నరసింహులు, చాకలి రాజు, ఈడికి రాజు, పుట్టిన నాయక్, రాయిపల్లి లక్ష్మి, శంషుద్దీన్, కే.వెంకటరెడ్డి, శాంతప్ప, శ్రీశైలం, రేణుక సీపీఎం, జి బాల నర్సయ్య దేవదయ శాఖ అధికారి, రమేష్, రవి,

# రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ..



**- రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక**
**- వ్యవసాయ విధానాలను అలవర్చుకోవాలి.**
**- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి**
**- శాసనసభ్యులు ఎమ్మెల్యే బి. మనోహర్ రెడ్డి**

**తాండూర్ వుదయం ప్రతినిధి**

జూన్17 తాండూరు మండల రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం తాండూర్ మండల వ్యవసాయ అధికారులు కె అరుణ కుమరయ్య ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూరు ఎమ్మెల్యే బియాని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు గురువారం తాండూరు పట్టణంలోని డిసిసిబి గోదాంలో తాండూరు మండల రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు ముందుగా రైతుల నా ఉద్దేశించి మాట్లాడుతు న్న తాండూరు ఎమ్మెల్యే బియ్యాన్ని మనోహర్ రెడ్డి రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక వ్యవసాయ విధానాలను అలవర్చుకోవాలని, అప్పుడే ఆశించిన స్థాయిలో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.అధికారుల సూచనలు తప్పనిసరి పాటించాలని విత్తనాలు నాటే సమయం నుండి పంట చేతికి వచ్చే వరకు రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను ఖచ్చితంగా పాటించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా సరైన మోతాదులో ఎరువులు, పురుగుల మందులు వాడుతూ, భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు పండించడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని రైతులను ఉద్దేశించి అన్నారు ఈ కార్యక్రమంలో తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్రెడ్డి ఆత్మ అధ్యక్షులు శంకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాండూరు మండల రైతులు , తాండూరు మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు, డీసీఎం అధికారి సలీం పాల్గొన్నారురైతులకు అధికారులు ల సూచన...రైతులకు ప్రభుత్వం తాండూరు కంది 59 రకమును, పెసర ఎంజి 385 రకం, మినుము వి బి ఎన్ రకము ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు రైతులు ప్రభుత్వం నుండి వచ్చే సబ్సిడీని ప్రభుత్వం నుండి వచ్చే వివిధ రకాల సదుపాయాలను రైతులు వినియోగించుకోవాలని అన్నారు

# పెద్దగళ్ళ రాజీవ్ కుమార్‌కు ఓయూ డాక్టరేట్ అవినీతి వ్యతిరేక సాహిత్యంపై పరిశోధనకు ప్రశంసలు



**నాగర్ కర్నూల్, జూన్ 17 (వుదయం బ్యూరో)**

జిల్లా లోని తెల్కపల్లి మండలం ఆలేరు గ్రామానికి చెందిన పెద్దగళ్ళ రాజీవ్ కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా పొందారు.ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం పర్యవేక్షణలో "అవినీతి వ్యతిరేక సాహిత్యం: ప్రత్యేక అధ్యయనం" అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తి చేశారు. సమాజంలో వేళ్లూనుకున్న అవినీతిని విభిన్న సాహిత్య, కళా ప్రక్రియలు ఏ విధంగా ప్రతిఘటించాయో ప్రామాణికంగా విశ్లేషించిన ఈ పరిశోధనకు విశేష ప్రశంసలు లభించాయి. రాజీవ్ కుమార్ ఇప్పటికే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (HCU) నుండి ఎంఏ, ఎంఫిల్ పూర్తి చేసి, UGC అందించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ ద్వారా ఈ పరిశోధన పూర్తి చేశారు.ఈ సందర్భంగా కవి, రచయిత, పరిశోధకులు పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక కన్వీనర్ గుడిపల్లి నిరంజన్, ప్రముఖ కవి అరుణ్ కుమార్, కథా రచయిత వహీద్ ఖాన్, కవులు ఎదిరేపల్లి కాశన్న, వలిగి తిరుపతయ్య, కొంగరి జానయ్య, కూరాకుల ఆంజనేయులు, లక్ష్మణ్ నాయక్, పలువురు పరిశోధకులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు రాజీవ్ కుమార్ ను అభినందించారు.

# మాతా శిశు ఆరోగ్య సేవ కేంద్రం పరిశీలన




**మహబూబ్ నగర్ జూన్17 (వుదయం ప్రతినిధి)**

బండ్లగేరి సమీపములో గల మాతా శిశు ఆరోగ్య సేవా కేంద్రంను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఏ.శ్రీనివాసులుసందర్శించి ఆరోగ్య సిబ్బందితో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. బుధవారం నుండి ప్రారంభిచిన స్టాప్ డయేరియా కార్యక్రమమును సమర్థ వంతముగా అమలు జరిపి 5సం. ల లోపు పిల్లలు డయేరియా గురికాకుండా ఆరోగ్యకరమైన ఆహారము, సురక్షిత త్రాగు నీరు, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలలో రక్తహీనతను నివారించుటకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని, టిటి ఇంజక్షన్లు సమయనుకూలంగా ఇవ్వాలని అన్నారు. చిన్న పిల్లలకు 100 శాతం అన్ని టీకాలు సమయానసారంగా ఇవ్వాలని ఆదేశించారు.

# ఈనెల 19న పిఐబి వార్త లాప్ మీడియా వర్క్ షాప్

**మహబూబ్ నగర్ జూన్17 (వుదయం ప్రతినిధి)**

కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల పాలనా కాలంలో అమలు చేసిన ముఖ్యమైన పథకాల గురించీ,పాత్రికేయ వృత్తిలో కృత్రిమ మేధ వినియోగం వంటి అంశాలపై నిపుణుల ఆధ్వర్యంలో పాత్రికేయులకు అవగాహన కల్పించాలన్న ముఖ్యోద్దేశంతో భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన పత్రికా సమాచార కేంద్రం (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో వార్తాలాప్ మీడియా వర్క్‌షాప్ కార్యక్రమాన్నీ, కృత్రిమ మేథపై ఒక ప్రత్యేక సదస్సునీ నిర్వహిస్తున్నట్లు మీడియా కమ్యూనికేషన్ అధికారి గాయత్రి తెలిపారు.వార్తాలాప్ మీడియా వర్క్‌షాప్ జూన్ 19, 2026 శుక్రవారం ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్‌లోని హిమాలయ బ్యాంక్వెట్ హాల్‌లో నిర్వహించినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.మహబూబ్‌నగర్ జిల్లాకి చెందిన పాత్రికేయులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పీఐబీహైదరాబాద్ ఏడీజీ శృతీ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం



**- నూతన డిసిసి కమిటీని ప్రకటించిన డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి**

**నారాయణపేట జూన్17 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీని ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మంత్రి వాకిటి.శ్రీహరి,ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం. పర్ణిక రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిలు ఎ. తిరుపతి రెడ్డి,కుంభం. శివకుమార్ రెడ్డి ల సూచనల మేరకు జిల్లాలో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళలు,బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ కమిటీని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు.
ఆరుగురు జిల్లా ఉపాధ్యక్షులు,పన్నెండు మంది ప్రధాన కార్యదర్శులు,ఇరువై మంది కార్యదర్శులు,ఓ కోశాధికారి,ముగ్గురు అధికార ప్రతినిధులు,ఏడుగురు జిల్లా కార్యవర్గ సభ్యులుగా మొత్తం నలభై తొమ్మిది మంది సభ్యులతో కూడిన జిల్లా కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇందులో ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు,అధికార ప్రతినిధులు,వివిధ విభాగాల బాధ్యులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే కమిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు.రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి పిలుపునిచ్చారు.అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశంపై స్పందించిన ఆయన ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితో బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష స్వరాలను అణిచివేసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈనెల 24వ తేదీనుండి జరిగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఓటరు జాబితాల్లో ప్రతి అర్హుడి పేరు నమోదు కావాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సలీం, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు కృష్ణయ్య, నారాయణపేట మండల అధ్యక్షులు కోట్ల. రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కె. శంకర్, పల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్నెస్ లేక రోడ్డెక్కిన బస్సులు.. సీజ్ చేసిన అధికారులు




**అయిజ, జూన్ 17 (వుదయం కరస్పాండెంట్)**

విద్యార్థుల భద్రతను గాలికొదిలి ఫిట్నెస్ సర్టిఫికెట్లు లేకుండానే స్కూల్ బస్సులను నడుపుతున్న పాఠశాలలపై రవాణాశాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. అయిజ పట్టణంలో బుధవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెండు స్కూల్ బస్సులను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాకతీయ, వైష్ణవి పాఠశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేసిన అధికారులు, వాటికి చెల్లుబాటు అయ్యే ఫిట్నెస్ సర్టిఫికెట్లు లేవని గుర్తించారు. విద్యార్థులను తరలించే వాహనాల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి అయినప్పటికీ, యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి రాధిక ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో గద్వాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామ్‌చరణ్ పాల్గొన్నారు. ఫిట్నెస్, బీమా, అనుమతి పత్రాలు లేకుండా విద్యార్థుల రవాణా చేపట్టడం తీవ్ర ఉల్లంఘనగా పరిగణిస్తామని, ఇలాంటి వాహనాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో రవాణాశాఖ సిబ్బంది గోవర్ధన్, రిషి, గోవిందు పాల్గొన్నారు. విద్యార్థుల భద్రతకు విఘాతం కలిగించే వాహనాలపై జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

# రోడ్డు భద్రతకు ప్రాధాన్యత

**- ట్రాఫిక్ సమస్యల నివారణకు సమన్వయ చర్యలు**

**నారాయణపేట టౌన్ జూన్17 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిశీలించిన ఆర్టీఏ, మున్సిపల్, ట్రాఫిక్ అధికారులునారాయణపేట జిల్లా కేంద్రంలోని పట్టణ ప్రాంతంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య సంయుక్తంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, పాత బస్టాండ్ ప్రాంతం, అధిక ట్రాఫిక్ రద్దీ ఉన్న కూడళ్లు, ప్రధాన రహదారులను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి ట్రాఫిక్‌కు ఆటంకంగా మారుతున్న సమస్యలను గుర్తించారు. రహదారులపైకి తమ వ్యాపారాలను విస్తరించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న చిన్న వ్యాపారులు, దుకాణదారులను అధికారులు హెచ్చరించి, రహదారులపై ఆక్రమణలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రజల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలమని తెలిపారు.పాత బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం, రోడ్డు భద్రతకు సంబంధించిన సూచిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్స్, రోడ్ మార్కింగ్‌లు (స్ట్రీక్ లైన్లు) ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. మున్సిపల్ శాఖ ఆర్ , బి శాఖల సమన్వయంతో అవసరమైన చోట రోడ్డు భద్రతా గుర్తులు, మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.అలాగే పట్టణంలో వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించి పార్కింగ్ స్థలాల ఏర్పాటుపై కూడా అధికారులు చర్చించారు. అక్రమ పార్కింగ్ కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.నారాయణపేట పట్టణాన్ని మరింత సురక్షితంగా, ట్రాఫిక్ రద్దీ లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## చర్మం ముడతలు పడకుండా..!



వయసు పైబడుతోందని చెప్పడానికి కనిపించే లక్షణాల్లో అన్నిటికంటే ముఖ్యమైంది – చర్మం ముడతలు పడటం. అందులోనూ ముఖం మీది చర్మం బాగా సున్నితంగా ఉంటుంది కాబట్టి ముడతల ప్రభావం ఎక్కువగా ముఖం మీదే కనిపిస్తుంది. అయితే చర్మంపై ముడతలు రావడానికి వయసు పెరగడం ఒక్కటే కారణం కాదు.. సౌందర్య సంరక్షణలోను, మన జీవన విధానంలోనూ చేసే కొన్ని పొరపాట్లు కూడా అందుకు కారణమవుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో అవేంటో తెలుసుకుందాం రండి... బయట ఎండలో తిరిగేటప్పుడు చర్మం సూర్యరశ్మి వల్ల ఎక్కువగా ప్రభావితం అవుతుంది. చిన్న వయసులోనే వార్ధక్యపు ఛాయలు ఎక్కువగా కనిపించడానికి కూడా ఇది కారణమవుతుందంటున్నారు నిపుణులు. అందుకే ఎండలోకి వెళ్లేటప్పుడు సన్ స్క్రీన్ లోషన్లు రాసుకోవడం వంటి రక్షణ చర్యలు తప్పకుండా పాటించాలని చెబుతున్నారు.

మేకప్ వేసుకున్నప్పుడు ఇంటికి తిరిగి వచ్చాక దానిని తొలగించుకుని ముఖాన్ని తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలి. లేదంటే మేకప్ ఉత్పత్తుల్లో ఉండే ఫ్రీ రాడికల్స్, కాలుష్య కారకాలు.. ఇవన్నీ చర్మం మీద ప్రభావం చూపించి ముడతలు పడేలా చేస్తాయంటున్నారు. కాబట్టి మేకప్‌తో నిద్రకు ఉపక్రమించడం అనేది మంచి పద్ధతి కాదని చెబుతున్నారు. చర్మంపై ముడతలు రావడానికి మన శరీర బరువులో వచ్చే మార్పులు కూడా కారణం కావచ్చు. ఒకేసారి బరువు తగ్గడం లేదా పెరగడం వంటివి జరిగితే స్ట్రెచ్‌మార్క్స్ రావడంతో పాటు చర్మం సాగినట్లుగా.. ముడతల్లా కనిపించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. చర్మం ఆరోగ్యవంతంగా ఉండాలంటే యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే పళ్లు, కూరలు మన ఆహారంలో భాగం కావాలి. ఎందుకంటే అవి చర్మంపై బాగా ప్రభావం చూపిస్తాయి. వార్ధక్యపు ఛాయలు కనిపించకుండా చేయడంలో సహకరిస్తాయి. ఎప్పుడైతే చర్మ సంరక్షణకు అవసరమయ్యే పోషకాలు అందవో.. అప్పుడు ఆ ప్రభావం తప్పకుండా చర్మం మీద కనిపిస్తుందంటున్నారు నిపుణులు.

ఎక్కువగా కూర్చోవడం.. ఉన్నచోటే అదే పనిగా కూర్చుని ఉంటే శరీరానికి వ్యాయామం అందక ఆ ప్రభావం చర్మంపై కూడా కనిపించే అవకాశం ఉంది. అందుకే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల చర్మం యవ్వనంగా కనిపిస్తుందని చెబుతున్నారు నిపుణులు.

## డయాబెటిస్ వచ్చే ముందు చాలా మందిలో కనిపించే లక్షణాలు ఇవే..!



భారత్‌లో మధుమేహ బాధితుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఈ వ్యాధి కారణంగా కీళ్లు, కండరాలు, నరాలపై ప్రభావం చూపే సమస్యలు కూడా ఎక్కువవుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా భుజం బిగుసుకుపోవడం (ఫ్రోజెన్ షోల్డర్), వేళ్లు లాక్ కావడం (ట్రిగ్గర్ ఫింగర్), కీళ్ల నొప్పులు, నరాల ఒత్తిడి వంటి సమస్యలు మధుమేహంతో సంబంధం కలిగి ఉంటాయని వారు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువ కాలం నియంత్రణలో లేకపోతే శరీరంలోని కొల్లాజెన్, టెండన్లు, లిగమెంట్లు, నరాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీంతో నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బందులు వంటి సమస్యలు తలెత్తి జీవన నాణ్యతపై ప్రభావం చూపిస్తాయి. గతంలో వృద్ధుల్లో ఎక్కువగా కనిపించే ఫ్రోజెన్ షోల్డర్, టెండన్ సమస్యలు ఇప్పుడు 40 ఏళ్ల వయసు వారిలో కూడా కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణంగా తక్కువ వయసులోనే మధుమేహం, ప్రీ–డయాబెటిస్ కేసులు పెరగడాన్ని పేర్కొంటున్నారు. కొంతమంది రోగుల్లో కీళ్ల నొప్పులు, భుజం బిగుసుకుపోవడం లేదా వేళ్ల కదలికల్లో ఇబ్బందులు మొదట కనిపించి, తరువాత పరీక్షల్లో మధుమేహం ఉన్నట్లు గుర్తిస్తున్నట్లు నిపుణులు వెల్లడిస్తున్నారు. అంటే కొన్ని సందర్భాల్లో ఆర్థోపెడిక్ సమస్యలే మధుమేహానికి తొలి హెచ్చరిక సంకేతాలుగా ఉంటున్నాయి. అధిక రక్త చక్కెర స్థాయిలు శరీరంలోని కణజాలాలను వేగంగా వృద్ధాప్యానికి గురిచేస్తాయి. దీనివల్ల కొల్లాజెన్ ఫైబర్లు మందంగా, గట్టిగా మారి టెండన్లు, లిగమెంట్ల వశ్యత తగ్గుతుంది. అలాగే రక్త ప్రసరణ తగ్గడం, స్వల్ప స్థాయి వాపు కొనసాగడం వల్ల ఫ్రోజెన్ షోల్డర్, ట్రిగ్గర్ ఫింగర్, టెండన్ సమస్యల ప్రమాదం పెరుగుతుంది. మధుమేహం నియంత్రణలో లేకపోతే కీళ్ల సమస్యల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఎముకలు విరిగినప్పుడు మానడానికి ఎక్కువ సమయం పట్టడం, శస్త్రచికిత్సల తర్వాత ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం, కోలుకోవడంలో ఆలస్యం వంటి సమస్యలు కూడా అధికంగా కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం ఉన్నవారిలో ఫ్రోజెన్ షోల్డర్ సమస్య సాధారణ జనాభాతో పోలిస్తే చాలా ఎక్కువగా కనిపిస్తుంది. అదే విధంగా ట్రిగ్గర్ ఫింగర్ కూడా మధుమేహ బాధితుల్లో అధికంగా నమోదవుతోంది. అంతేకాకుండా డయాబెటిక్ హ్యాండ్ సిండ్రోమ్, డుప్యూట్రెన్ కాంట్రాక్చర్ వంటి చేతి సమస్యలు, పాదాలు, మడమల కీళ్లను దెబ్బతీసే చార్కోట్ ఆర్థోపతి వంటి తీవ్రమైన సమస్యలు కూడా మధుమేహంతో సంబంధం కలిగి ఉంటున్నాయి. టైప్–1 మధుమేహం ఉన్నవారిలో ఎముకల సాంద్రత తగ్గడం, టైప్–2 మధుమేహం ఉన్నవారిలో ఆస్టియోఆర్థ్రైటిస్ వేగంగా అభివృద్ధి చెందే ప్రమాదం కూడా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. భుజం నొప్పి, బిగుతు లేదా బలహీనత ఆరు వారాలకుపైగా కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

## పురుషుల కన్నా మహిళలకు నిద్ర కాస్త ఎక్కువ అవసరం.. ఎందుకంటే..?

నేటి వేగవంతమైన జీవనశైలిలో మహిళలు ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ సంరక్షణ, గృహ నిర్వహణ వంటి అనేక పనులను ఒకేసారి నిర్వహిస్తుంటారు. ఈ నిరంతర మానసిక ఒత్తిడి, బాధ్యతల కారణంగా మహిళల శరీరం, ముఖ్యంగా మెదడు, పురుషులతో పోలిస్తే ఎక్కువ విశ్రాంతిని కోరుకుంటుందని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే మహిళలకు సాధారణంగా పురుషుల కంటే కొంత ఎక్కువ నిద్ర అవసరమవుతుందని నిపుణులు చెబుతున్నారు. నిపుణుల ప్రకారం పెద్దలకు రోజుకు సగటున 7 నుంచి 9 గంటల నిద్ర అవసరం. అయితే మహిళలు రోజంతా అనేక బాధ్యతలను సమన్వయం చేయాల్సి రావడంతో వారి మెదడు ఎక్కువగా పనిచేస్తుంది. ఈ కారణంగా మెదడు పూర్తిగా కోలుకోవడానికి అదనంగా 20 నుంచి 60 నిమిషాల నిద్ర అవసరమయ్యే అవకాశం ఉందని అధ్యయనాలు వెల్లడించాయి. పరిశోధనల ప్రకారం రోజంతా ఎక్కువ మానసిక శ్రమ చేసినప్పుడు మెదడుకు రాత్రి సమయంలో మరింత విశ్రాంతి అవసరం అవుతుంది. మహిళలు సాధారణంగా ఒకేసారి అనేక పనులను నిర్వహించడం వల్ల మెదడులోని వివిధ భాగాలు ఎక్కువగా చురుకుగా పనిచేస్తాయి. గాఢ నిద్ర సమయంలో ఈ భాగాలు మరమ్మత్తులు చేసుకుని తదుపరి రోజుకు సిద్ధమవుతాయి. నిద్ర సమయం తగ్గితే ఈ ప్రక్రియకు అంతరాయం కలుగుతుంది. మహిళల నిద్రపై హార్మోన్ల ప్రభావం కూడా గణనీయంగా ఉంటుంది. రుతుచక్ర సమయంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ స్థాయిల్లో మార్పులు రావడం వల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. గర్భధారణ సమయంలో శారీరక అసౌకర్యం, గుండె స్పందన పెరగడం, శిశువు కదలికలు వంటి కారణాలతో నిద్ర మధ్యలో పలుమార్లు మెళకువ వస్తుంది. అలాగే మెనోపాజ్ దశలో హార్మోన్ల తగ్గుదల వల్ల రాత్రిపూట చెమటలు, నిద్రలేమి వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. సరిపడా నిద్ర పొందినప్పుడు మహిళల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. భావోద్వేగ నియంత్రణ సులభమవుతుంది. అలాగే ఆకలి, తృప్తిని నియంత్రించే హార్మోన్లు సమతుల్యంగా పనిచేయడంతో బరువు నియంత్రణకు కూడా సహాయపడుతుంది. శరీరం శక్తిని సమర్థవంతంగా వినియోగించుకునే సామర్థ్యం పెరుగుతుంది. అవసరమైన నిద్రను తరచూ తగ్గించుకోవడం వల్ల మొదట అలసట, చిరాకు, ఏకాగ్రత లోపం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు కనిపిస్తాయి. దీర్ఘకాలంలో ఆందోళన, డిప్రెషన్, బరువు పెరగడం, ఇన్సులిన్ నిరోధకత, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. తీవ్రమైన నిద్రలేమికి కొన్ని హెచ్చరిక సంకేతాలు కూడా ఉంటాయి. మధ్యాహ్నం సమయంలో అధిక అలసట, తీపి లేదా అధిక కేలరీల ఆహారాలపై తీవ్రమైన కోరిక, చిన్న విషయాలకే చిరాకు, మంచంపై చాలాసేపు గడిపినా ఉదయం తాజాగా అనిపించకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని నిపుణులు సూచిస్తున్నారు.

సాధారణంగా పెద్దలకు 7 నుంచి 9 గంటల నిద్ర అవసరమైనప్పటికీ, చాలా మంది మహిళలకు 8 నుంచి 8.5 గంటల నాణ్యమైన నిద్ర లభిస్తే శరీరం, మెదడు పూర్తిగా పునరుద్ధరించుకునే అవకాశం ఉంటుంది. అందుకే నిద్రను విలాసంగా కాకుండా ఆరోగ్యానికి అత్యవసరమైన అవసరంగా భావించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిద్ర నాణ్యతను మెరుగుపరచాలంటే ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవడం, ఒకే సమయంలో లేవడం అలవాటు చేసుకోవాలి. నిద్రకు గంట ముందు మొబైల్, టాబ్లెట్ వంటి పరికరాల వినియోగాన్ని తగ్గించాలి. సాయంత్రం తర్వాత కెఫీన్, మద్యం, భారమైన ఆహారాన్ని పరిమితం చేయడం మంచిది. అలాగే పడకగది ఉష్ణోగ్రతను చల్లగా ఉంచడం ద్వారా గాఢ నిద్రకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.



## భారీగా పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు..
## బీమా తప్పనిసరి అంటున్న నిపుణులు..

దేశంలో జీవనశైలి సంబంధిత వ్యాధులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయని తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్–6) వెల్లడించింది. ముఖ్యంగా పెద్దల్లో ఊబకాయం, అధిక రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతున్నట్లు సర్వే గుర్తించింది. ఈ పరిస్థితి భవిష్యత్తులో మధుమేహం, గుండెజబ్బులు, పక్షవాతం, మూత్రపిండాల వ్యాధుల వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచే అవకాశముందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సర్వే ప్రకారం 15 సంవత్సరాలు పైబడిన మహిళల్లో 17.8 శాతం మందికి, పురుషుల్లో 20.9 శాతం మందికి అధిక రక్తంలో చక్కెర స్థాయిలు నమోదయ్యాయి. అదే సమయంలో అనేక రాష్ట్రాల్లో అధిక బరువు, ఊబకాయం సమస్యలు కూడా పెరుగుతున్నట్లు గుర్తించారు. జీవనశైలి వ్యాధులు ఇక వృద్ధులకు మాత్రమే పరిమితం కాకుండా యువతలోనూ వేగంగా పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. శారీరక శ్రమ తగ్గడం, ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, సరిపడా నిద్ర లేకపోవడం వంటి కారణాలు ఈ సమస్యలకు ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. ఫలితంగా చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతోందని వారు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల పెరుగుదలతోపాటు వాటి చికిత్స ఖర్చులు కూడా కుటుంబాలపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. సాధారణ వ్యాధులతో పోలిస్తే మధుమేహం, గుండెజబ్బులు, మూత్రపిండాల సమస్యలు వంటి వ్యాధులకు జీవితాంతం వైద్య పర్యవేక్షణ, పరీక్షలు, మందులు అవసరం అవుతాయి. కొన్ని సందర్భాల్లో ఆసుపత్రి చికిత్స కూడా అవసరమవుతుంది. దీంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా ప్రాధాన్యం మరింత పెరిగిందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్య బీమా కేవలం ఆసుపత్రి ఖర్చులకు మాత్రమే పరిమితం కాకుండా, నివారణ ఆరోగ్య పరీక్షలు, వెల్‌నెస్ కార్యక్రమాలు, టెలీ కన్సల్టేషన్లు, వ్యాధి నిర్వహణ సేవలు వంటి అనేక సదుపాయాలను కూడా అందిస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా అనేక వ్యాధులను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో తగిన ఆరోగ్య బీమా ఉంటే చికిత్స ఖర్చుల భారాన్ని తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.



ఊబకాయం, మధుమేహం, రక్తపోటు లేదా కుటుంబంలో దీర్ఘకాలిక వ్యాధుల చరిత్ర ఉన్నవారు తమ ఆరోగ్య బీమా పాలసీలను తరచూ సమీక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బీమా మొత్తం, ముందుగా ఉన్న వ్యాధుల కవరేజీ, వెయిటింగ్ పీరియడ్, నగదు రహిత చికిత్స సదుపాయాలు, నివారణ ఆరోగ్య ప్రయోజనాలు వంటి అంశాలను పరిశీలించి సరైన పాలసీని ఎంపిక చేసుకోవడం అవసరమని చెబుతున్నారు. దేశంలో జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆరోగ్యకరమైన అలవాట్లు ఎంత ముఖ్యమో, ఆర్థిక రక్షణ కోసం ఆరోగ్య బీమా కూడా అంతే అవసరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నివారణ చర్యలు మొదటి రక్షణ కవచం అయితే, ఆరోగ్య బీమా రెండో రక్షణ కవచంగా మారుతోందని వారు అభిప్రాయపడుతున్నారు.

## లవంగాల నీళ్లను తాగితే ప్రయోజనాలు కలుగుతాయి..

ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో లవంగాల నీరు (క్లోవ్ వాటర్) ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ముఖ్యంగా జీర్ణవ్యవస్థ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుందని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కడుపు ఉబ్బరం, అజీర్ణం, కడుపులో మంట, గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్య సమస్యలకు ఇది సహజ పరిష్కారమని పలువురు చెబుతున్నారు. అయితే ఈ వాదనలకు శాస్త్రీయ ఆధారాలు ఎంతవరకు ఉన్నాయనే విషయంపై నిపుణులు వివరణ ఇస్తున్నారు. లవంగాల్లో శరీరానికి ఉపయోగపడే అనేక జీవసంబంధ క్రియాశీల పదార్థాలు ఉంటాయి. ముఖ్యంగా యూజెనాల్ అనే సమ్మేళనం లవంగాల్లో ప్రధానంగా ఉంటుంది. ఈ పదార్థానికి యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో, కడుపులో ఏర్పడే అసౌకర్యాన్ని తగ్గించడంలో కొంతవరకు సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. కొన్ని అధ్యయనాల ప్రకారం యూజెనాల్ జీర్ణనాళంలోని మృదుకండరాలను సడలించడంలో సహాయపడుతుంది. దీంతో ఆహారం జీర్ణక్రియ సజావుగా జరిగి, కడుపు ఉబ్బరం లేదా గ్యాస్ వల్ల కలిగే అసౌకర్యం కొంత తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే కొందరు లవంగాల నీరు తాగిన తర్వాత కడుపు తేలికగా ఉన్నట్లు అనుభూతి చెందుతారని నిపుణులు వివరిస్తున్నారు. అయితే లవంగాల నీటి గురించి ప్రచారంలో ఉన్న అన్ని ఆరోగ్య వాదనలు శాస్త్రీయంగా నిరూపితమైనవి కావని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఒక రాత్రిలోనే కాలేయాన్ని శుభ్రపరుస్తుంది, శరీరంలోని వాపులను పూర్తిగా తగ్గిస్తుంది లేదా రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతుంది వంటి వాదనలకు బలమైన ఆధారాలు లేవని వారు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ లవంగాలను పూర్తిగా విస్మరించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా లవంగాలను చేర్చుకోవడం వల్ల కొన్ని ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గోరువెచ్చని లవంగాల నీరు తాగడం కొంతమందికి ప్రశాంతతను, సౌకర్యాన్ని కలిగిస్తుంది. అయితే ఏ ఒక్క సహజ పానీయాన్ని అద్భుత ఔషధంగా భావించడం సరైంది కాదని నిపుణులు సూచిస్తున్నారు. మంచి నిద్ర, సమతుల్య ఆహారం, ఒత్తిడి నియంత్రణ, క్రమం తప్పని వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లతో పాటు లవంగాల నీరు తీసుకుంటేనే మెరుగైన ఫలితాలు కనిపించే అవకాశం ఉంటుంది. సహజ చిట్కాలు స్వల్ప అసౌకర్యాలను తగ్గించడంలో కొంతమేరకు ఉపయోగపడతాయని, కానీ అవి సమగ్ర ఆరోగ్య సంరక్షణకు ప్రత్యామ్నాయం కావని నిపుణులు గుర్తుచేస్తున్నారు.



## కలిపి తింటేనే మేలు!



విటమిన్లు, మినరల్స్ అందాలంటూ కాయగూరలు, నట్స్ ఇలా ఎన్నో ఆహారంలో చేర్చుకుంటూ ఉంటాం కదా! కానీ అవి సరిగానే అందుతున్నాయా? ఎందుకంటే కొన్నింటిని కలిపి తీసుకోవాలి మరి. అప్పుడే పోషకాలూ సరిగా అందుతాయి అంటున్నారు పోషకాహార నిపుణులు. ఇంతకీ అవేంటంటే...

గుమ్మడి, క్యారెట్‌లలో బీటా కెరోటిన్ ఉంటుందని తెలిసిందేగా! కంటి ఆరోగ్యానికే కాదు... రోగనిరోధకతకీ, చర్మ సంరక్షణకీ ఇది తప్పనిసరి. కానీ ఈ యాంటీ ఆక్సిడెంట్ కొవ్వుల్లోనే కరుగుతుంది. అందుకే అది మన శరీరానికి అందాలంటే ఆలివ్ నూనెకి జత చేయాల్సిందే.

ఆరోగ్యకరమని రకరకాల కాయగూరలు, ఆకుకూరలు తింటుంటాం. వాటి నుంచి ఎ, ఇ, కె విటమిన్లు మెరుగ్గా అందాలంటే నట్స్, గింజలను జోడించాల్సిందే. అప్పుడే శరీరం ఆ విటమిన్లను మెరుగ్గా శోషించుకోగలదట.

అవకాడో... మంచి కొవ్వుల సమాహారం. కానీ అచ్చంగా దాన్ని తినడమే కష్టం. కాబట్టే, సలాడ్స్‌లో భాగంగా చేసుకుని తింటుంటాం. వాటిలో టొమాటోనీ తప్పక చేర్చుకోండి. ఇందులో లైకోపీన్ అనే పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తరిమికొట్టడమే కాదు, గుండె ఆరోగ్యాన్నీ సంరక్షిస్తుంది. ఆరోగ్యానికి చేసే మేలూ చాలానే. కానీ అది కొవ్వుల్లోనే కరుగుతుంది. అందుకే ఈ రెండూ కలిపి తీసుకోవడం మంచిది.

పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి రోగనిరోధకతకు మంచివని తీసుకుంటూ ఉంటాం. కానీ పసుపులోని కర్‌క్యుమిన్‌ని శరీరం త్వరగా గ్రహించలేదు. అందుకే దాంతోపాటు మిరియాలపొడినీ చేర్చుకోవాలి. జీర్ణశక్తికీ, ఎముకల ఆరోగ్యానికీ మంచిదని చాలామంది యోగర్ట్‌ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. దాంతోపాటు కొన్ని పండ్ల ముక్కలనీ చేర్చుకోండి. యోగర్ట్ మంచి బ్యాక్టీరియాని అందిస్తే పండ్లు ప్రీబయాటిక్ ఫైబర్‌ని ఇస్తాయి. ఇవి ఆ సూక్ష్మజీవులకు తద్వారా మనకూ మేలు చేస్తాయి.


## గుజరాత్‌లోనే ఎంబ్రాయర్ విమానాల తయారీ



విమానాల అసెంబ్లింగ్ కోసం గుజరాత్‌లోని ధోలెరాలో ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) ఏర్పాటు చేయాలని అదానీ గ్రూప్, బ్రెజిల్ విమాన దిగ్గజం ఎంబ్రాయర్ నిర్ణయించాయని తెలుస్తోంది. గతేడాది అక్టోబరులో దిల్లీలో తమ కార్యాలయాన్ని తెరచిన ఎంబ్రాయర్, భారత విపణిపై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. పౌర, రక్షణ విమాన విభాగాల్లో అవకాశాల కోసం ఈ సంస్థ ఎదురుచూస్తోంది.

# బిజినెస్

# నాలుగో రోజూ రాణించిన సూచీలు..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ రాణించాయి. మెటల్, పీఎస్‌యూ, కన్జ్యూమర్ ద్యూరబుల్స్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. వడ్డీ రేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈ రాత్రికి నిర్ణం ప్రకటించనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 347.14 పాయింట్ల లాభంతో 77,155.62 వద్ద ముగిసింది. నిఫ్టీ 96.55 పాయింట్ల లాభపడి 24,085.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, బీఈఎల్, ఎటర్నల్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు నష్టాలు చవి చూశాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 94.52గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4329 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. టాటా మోటార్స్ పాసింజర్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఓ దశలో 10 శాతం మేర క్షీణించాయి. చివరికి 8.10 నష్టంతో రూ.361.70 వద్ద ముగిశాయి. టాటా గ్రూపునకు చెందిన లగ్జరీ కార్ల బ్రాండ్ అయిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ భవిష్యత్ వృద్ధి అంచనాలు, మేనేజ్‌మెంట్ కామెంటరీ టాటా మోటార్స్ షేర్లపై ప్రభావం చూపాయి. ఐడీబీఐ బ్యాంక్ షేర్లు నేడు దూసుకెళ్లాయి. ఓ దశలో 18శాతం వరకు లాభపడ్డాయి. వ్యూహాత్మక వాటాల విక్రయానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని, వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందన్న వార్తల నేపథ్యంలో షేర్లు రాణించాయి. చివరికి 16 శాతం లాభంతో రూ.89.60 వద్ద ముగిసింది.

# దేశీయ మార్కెట్ కు 23 ఐపీఓలు..




2026లో ఇప్పటి వరకు ప్రాథమిక మార్కెట్‌లో 23 సంస్థలు ఐపీఓలకు వచ్చాయి. ఇవన్నీ కలిపి రూ.27,000 కోట్లు సమీకరించాయి. స్థూల అనిశ్చితులతో ఒడుదొడుకులు పెరగడం వల్ల, ఈ ఏడాది ఇప్పటివరకు ఐపీఓలు తక్కువగా నమోదయ్యాయని ఈక్విరస్ క్యాపిటల్ వెల్లడించింది. 2025లో 103 ఐపీఓల ద్వారా కంపెనీలు రూ.1.76 లక్షల కోట్ల నిధులను సమీకరించిన సంగతి విదితమే. 2024లో 90 కంపెనీలు రూ.1.6 లక్షల కోట్లు, 2023లో 57 కంపెనీలు రూ.49,436 కోట్ల నిధులను పబ్లిక్ ఇష్యూల్లో సమీకరించాయి. ఇన్సూర్‌టెక్ సంస్థ టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ రూ.883 కోట్ల ఐపీఓ ఈ నెల 19న మొదలై 23న ముగియనుంది. ఈ ఇష్యూకు ధరల శ్రేణి రూ.144-152. తాజా షేర్ల జారీ ద్వారా రూ.660.72 కోట్లు సమీకరించనుండగా, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో రూ.221.95 కోట్ల విలువైన 1.46 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.
లియోటెక్ ఇండస్ట్రీస్ రూ.36 కోట్ల ఎస్ఎంఈ ఐపీఓ ఈనెల 17-19 తేదీల్లో ఉండనుంది. ఇష్యూ ధర రూ.321. లాట్ పరిమాణం 400 షేర్లు. ఈ ఇష్యూలో 9 లక్షల ఈక్విటీ షేర్ల వరకు తాజాగా జారీ చేయనున్నారు. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో 2.22 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఈ నెల 24న బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై షేర్లు నమోదు కానున్నాయి. భద్రత, నదుపాయాల నిర్వహణ సేవల సంస్థ ఎస్ఐఎస్, తన నగదు రవాణా (క్యాష్ లాజిస్టిక్స్) వ్యాపారానికి సంబంధించిన ఐపీఓ ప్రణాళికను వాయిదా వేసింది. పరిస్థితులు అనుకూలంగా మారిన తర్వాత ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని సంస్థ స్పష్టం చేసింది.

# టీసీఎస్‌పై రూ.2,100 కోట్ల భారం




టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)పై సుమారు రూ.2,100 కోట్ల ఆర్థిక భారం పడుతోంది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే బహుళజాతి ఐటీ సేవల సంస్థ డీఎక్స్‌సీ టెక్నాలజీలో భాగంగా ఉన్న కంప్యూటర్ సైన్సెస్ కార్పొరేషన్ (సీఎస్‌సీ)తో టీసీఎస్‌కు ఏళ్లతరబడి కొనసాగుతున్న న్యాయ వివాదం విషయంలో.. కింది కోర్టు ఆదేశాలను సమీక్షించడానికి అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించడం ఇందుకు నేపథ్యం. సంబంధిత అకౌంటింగ్ ప్రమాణాల కింద తన ఖాతా పుస్తకాల్లో ఇప్పటికే టీసీఎస్ 150 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1,425 కోట్లు) కేటాయించింది. 2026-27 తొలి త్రైమాసికంలో అదనంగా 70 మిలియన్ డాలర్లు (సుమారు రూ.665 కోట్లు) పక్కన పెట్టనున్నట్లు టీసీఎస్ మంగళవారం తెలిపింది. నష్టపరిహారం, వడ్డీ, న్యాయ వ్యయాల కింద ఈ నిధులను చేర్చనున్నట్లు టీసీఎస్ వివరించింది. ఈ న్యాయ వివాద అంశాలన్నింటినీ 2024 జూన్, 2025 నవంబరులో స్టాక్‌ఎక్స్ఛేంజీలకు సంస్థ వెల్లడించింది కూడా. వాణిజ్య రహస్యాల కేసులో సీఎస్‌సీకి 194.2 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1,850 కోట్ల) నష్టపరిహారాన్ని కట్టాలంటూ యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ గతంలో ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

## అమెజాన్‌ను దాటేసిన స్పేస్‌ఎక్స్




ప్రపంచ ట్రిలియనీర్ ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్ ఎక్స్, మార్కెట్ విలువ పరంగా ప్రపంచంలోనే అయిదో స్థానానికి చేరింది. సంస్థ షేరు విలువ మరో 12% పైగా పెరిగి 222 డాలర్లకు చేరడంతో, సంస్థ మార్కెట్ విలువ 2.90 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.276 లక్షల కోట్లు )గా నమోదవ్వడం ఇందుకు నేపథ్యం. అమెజాన్ మార్కెట్ విలువ 2.80 లక్షల కోట్ల డాలర్లే కావడంతో, ఇప్పుడు స్పేస్ ఎక్స్ దానిని అధిగమించింది. 3.10 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువ కలిగిన మైక్రోసాఫ్ట్‌ను స్పేస్ ఎక్స్ సమీపించడం గమనార్హం. స్పేస్ ఎక్స్ పబ్లిక్ ఇష్యూలో షేరు ధర 135 డాలర్లు కాగా, ఇప్పటికే ఈ షేరు విలువ 60% పెరిగింది. మదుపర్లు అమితంగా ఆసక్తి చూపడమే ఇందుకు కారణం.

# ఒక్క రోజులో మస్క్ షేర్ల లాభం..

## అంబానీ మొత్తం సంపదకు రెట్టింపు..!



ప్రపంచ ట్రిలియనీర్ ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్ ఎక్స్ (SpaceX) షేర్ల ధరలు రాకెట్‌లా దూసుకెళ్తున్నాయి. పబ్లిక్ ఇష్యూలో షేరు ధర 135 డాలర్లు కాగా.. ఇప్పటికే అది 200 డాలర్లు దాటేసింది. దీంతో ఆయన సంపదను ఇతర కుబేరుల సంపదతో పోలిక తెస్తూ నెటిజన్లు లెక్కలేస్తున్నారు. ఆ గణాంకాలు షాక్‌కు గురిచేస్తున్నాయి. పబ్లిక్ ఇష్యూ అనంతరం భారీగా పెరుగుతోన్న మస్క్ కంపెనీ షేర్లు.. ఒక ట్రేడింగ్ రోజులో 14.71 శాతం ర్యాలీ అయ్యాయి. దాంతో ఆయన సంపద ఏకంగా 164.8 బిలియన్ డాలర్లు పెరిగింది. ఆ ఒక్కరోజు పెరుగుదలే భారతదేశ కుబేరుడు ముకేశ్ అంబానీ సంపద ($89.7 billion) కంటే రెట్టింపు కావడం గమనార్హం. ప్రస్తుతం మస్క్ నికర సంపద 1.3 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. టెస్లా, స్పేస్‌ఎక్స్‌లో ఆయనకున్న వాటాలే ప్రధాన ఆదాయవనరుగా ఉన్నాయి. మరోవైపు.. మస్క్ షేర్లు పెరిగిన రోజే అంబానీకున్న స్టాక్స్ ధరలు పెరిగాయి. దాంతో ఆయన నికర ఆస్తుల విలువ 965 మిలియన్ డాలర్లు (1.09 శాతం) ఎగబాకింది. మామూలుగా అయితే ఈ లెక్కలు అద్భుతమే. కానీ మస్క్ (Elon Musk) ఒక్క రోజులో పొందిన దాంతో పోల్చుకుంటే మాత్రం పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువ కావడం గమనార్హం. కొందరు నెటిజన్లు మరో పోలిక కూడా తెచ్చారు. అదేంటంటే.. భారతదేశ జీడీపీ విలువ 4.15 ట్రిలియన్ డాలర్లు. ఆయన వ్యక్తిగత సంపద భారత్ జీడీపీలో నాలుగో వంతుకు సమానం కావడం గమనార్హం. శుక్రవారం నాస్‌డాక్‌లో స్పేస్‌ఎక్స్ షేరు 150 డాలర్ల వద్ద లిస్ట్ అయింది. పబ్లిక్ ఇష్యూ ధర(135 డాలర్లు)తో పోలిస్తే ఇది 11% అధికం. ఈ కంపెనీలో మస్క్‌కు 480 కోట్ల షేర్లు ఉన్నాయి. దాంతో మస్క్ వ్యక్తిగత సంపద ఒక ట్రిలియన్ డాలర్లు దాటేసింది. ఇప్పుడు మస్క్ సంపద (Musk Net-worth)లో పెరుగుదల టాక్ ఆఫ్ ది వరల్డ్‌గా ఉంది. ఆయనకున్న ఒక ట్రిలియన్ డాలర్లను ఒక మిలియన్ మిలియన్ డాలర్లుగా చూడొచ్చు. ప్రతి గంటకు ఒక మిలియన్ డాలర్లు ఖర్చు పెట్టినా.. 2140 సంవత్సరం వరకు ఆ సంపద తరగదట.

# క్రీడలు

## అఫ్గాన్ Aతో మ్యాచ్.. భారత్ ఫస్ట్ బ్యాటింగ్



శ్రీలంక వేదికగా ముక్కోణపు సిరీస్ జరుగుతోంది. ఫైనల్‌కు చేరుకోవాలంటే భారత్ A జట్టుకు అఫ్గానిస్థాన్ Aపై విజయం సాధించడం అత్యంత కీలకం. ఈ క్రమంలో టాస్ నెగ్గిన అఫ్గాన్ బౌలింగ్ ఎంచుకుని టీమ్‌ఇండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. భారత్ మూడు మ్యాచుల్లో ఒక విజయం, రెండు ఓటములతో రెండో స్థానంలో ఉంది. మరోవైపు అఫ్గాన్ రెండు మ్యాచుల్లో ఒక విజయం.. ఒక ఓటమితో మూడో స్థానంలో నిలిచింది. భారత్ A: ప్రియాంశ్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ (కెప్టెన్), కుమార్ కుషాంగ్రా (వికెట్ కీపర్), నిషాంత్ సింధు, సూర్యాంశ్ షెడ్గే, విప్రాజ్ నిగమ్, అనుకుల్ రాయ్, అన్షుల్ కాంబోజ్, యశ్ ఠాకూర్ , అఫ్గానిస్థాన్ A: ఇమ్రాన్ మిర్ (కెప్టెన్), హస్సన్ ఇసాఖిల్, ఖలిద్ తనివాల్, బహిర్ షా, ఫర్మానుల్లా సాఫి, షామ్స్ ఉర్ రహ్మాన్, మహ్మద్ ఇషాక్ (వికెట్ కీపర్), జహిర్ ఖాన్, అబ్దుల్లా అహ్మద్జాయ్, ఫైసల్ ఖాన్, ఫరీదూన్ దావూద్‌జాయ్.

# అర్జెంటీనా సూపర్ విక్టరీ

ఫిఫా ప్రపంచ కప్‌ను స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సి ఘనంగా ఆరంభించాడు. తమ తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్‌తో మెరిశాడు. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన అర్జెంటీనా 3-0 తేడాతో అల్జీరియాను మట్టికరిపించింది. ఆట ప్రారంభమైన 17వ నిమిషంలోనే మెస్సి మాయ మొదలైంది. తొలి గోల్ కొట్టి అర్జెంటీనాకు ఆధిక్యం అందించాడు. తొలి అర్ధభాగంలో 1-0 ఆధిక్యం సాధించింది. ఇక సెకండాఫ్‌లో మెస్సి మరింత చెలరేగిపోయాడు. 60వ నిమిషంలో, 76వ నిమిషంలో గోల్స్ కొట్టాడు. ప్రపంచ కప్‌లో మెస్సి తొలిసారి హ్యాట్రిక్ నమోదు చేశాడు. దీంతో స్టేడియంలోని ప్రేక్షకులు నిల్చొని చప్పట్లతో అభినందించారు.
మ్యాచ్ విజయం అనంతరం లియోనెల్ మెస్సి భావోద్వేగానికి గురయ్యాడు. అయితే, తాను కన్నీళ్లు పెట్టుకోవడానికి కారణం ఫుట్ బాల్‌కు సంబంధించి కాదని.. వ్యక్తిగతంగా కొన్ని రోజులు ఇబ్బంది పడినట్లు గుర్తు చేసుకున్నాడు. అందుకే, తాను అలా వ్యవహరించినట్లు మ్యాచ్ పోస్ట్ ప్రెజెంటేషన్‌లో వెల్లడించాడు. అయితే, అదేంటని మాత్రం మెస్సి చెప్పలేదు. అర్జెంటీనా స్టార్ మెస్సి ప్రపంచకప్‌లో పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.




ఐదు ప్రపంచ కప్‌ల్లో గోల్స్ చేసిన రెండో ఆటగాడిగా మెస్సి ఘనత సాధించాడు.
క్రిస్టియానో రొనాల్డో కూడా ఐదు ప్రపంచ కప్‌ల్లో గోల్స్ కొట్టాడు. ఇప్పుడు మెస్సి అతడి సరసన చేరాడు.
ప్రపంచ కప్‌ల్లో మెస్సి 16 గోల్స్ చేశాడు. దీంతో జర్మనీకి చెందిన మిరాస్లోవ్ క్లోస్ రికార్డును సమం చేశాడు.

# సెనెగల్‌పై ఫ్రాన్స్ విజయం



టైటిల్ ఫేవరేట్‌లలో ఒకటైన ఫ్రాన్స్ ఫిఫా ప్రపంచకప్‌ను ఘనంగా ఆరంభించింది. గ్రూప్-ఐలో భాగంగా సెనెగల్‌పై 3-1 తేడాతో నెగ్గింది. తనపై ఉన్న భారీ అంచనాలను నిజం చేస్తూ ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబాపె రెండు గోల్స్ కొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాకుండ ఫ్రాన్స్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. తొలి అర్ధభాగంలో గోల్ కోసం రెండు జట్లు నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. ఫ్రాన్స్ ఆటగాళ్లు గోల్ కొట్టకుండా సెనెగల్ టీమ్ అడ్డుకుంది. ఫ్రాన్స్ గోల్‌పోస్ట్ లక్ష్యంగా ఆ దేశ ఆటగాళ్లు దూసుకొచ్చారు. ఇక ఎంబాపెను అడ్డుకోవడానికి సెనెగల్ ఆటగాళ్లు శతవిధాలా ప్రయత్నించారు. దీంతో ఎలాంటి గోల్ లేకుండానే తొలి అర్ధభాగం ముగిసింది. అయితే రెండో అర్ధభాగంలో ఎంబాపె తన మ్యాజిక్‌ను ప్రదర్శించాడు. 66వ నిమిషంలో గోల్ కొట్టి తన దేశాన్ని ఒక్కసారిగా ఆనందంలో ముంచెత్తాడు. 82 నిమిషాల వద్ద బ్రాడ్లీ బార్కోలా మరో గోల్ కొట్టడంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కి పెరిగింది. అదనపు సమయంలో సెనెగల్ ఆటగాడు ఇబ్రహీం ఎంబాయె గోల్ కొట్టడంతో ఆధిక్యం 2-1కి తగ్గింది. అయితే ఆ ఆనందం సెనెగల్‌కు ఎంతో సేపు నిలవలేదు. నిమిషం వ్యవధిలోనే ఎంబాపె దాదాపు 30 మీటర్ల దూరం నుంచి అద్భుతమైన గోల్ కొట్టి సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాడు. ఈ మ్యాచ్‌లో ఫ్రాన్స్ ఆటగాళ్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్ లక్ష్యంగా 8 షాట్స్ కొట్టగా, సెనెగల్ ఆటగాళ్లు 2 సార్లు కొట్టారు.

# జర్మనీ ఫుట్‌బాల్ జట్టు క్యాంప్‌లోకి విషసర్పం



ఫిఫా ప్రపంచ కప్‌లో జర్మనీని ప్రత్యర్థులుకాకుండా ఓ పాము హడలెత్తించింది. తాము ఉంటున్న శిబిరంలోకి ఎంట్రీ ఇచ్చింది. ఫిఫా వరల్డ్ కప్ కోసం జర్మనీ నార్త్ కరోలినాలోని విన్‌స్టన్-సేలంలో తమ క్యాంప్‌ను ఏర్పాటు చేసుకుం ది. అయితే, అక్కడ గడ్డి కింద ఓ విషపూరిత పాము ఉన్నట్లు సిబ్బంది గుర్తించారు. జర్మనీ వాళ్లకు మాత్రమే కాకుండా.. స్విట్జర్లాండ్, నార్వే ప్లేయర్లకూ పాములు కనిపించాయని, వారిని ఆందోళనకు గురి చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటనపై జర్మనీ కెప్టెన్ జాషువా కిమ్మిచ్ స్పందించాడు. జర్మనీలో అయితే మీరు వ్యూహాలు, గాయాలు, తదుపరి ప్రత్యర్థి గురించి మాత్రమే ఆందోళన చెందుతారు. కానీ ఇక్కడ, గడ్డిలో ఏముందో అని కూడా ఆలోచించాల్సి ఉంటుంది" అని కిమ్మిచ్ వ్యాఖ్యానించాడు. కిమ్మిచ్, అతడి సహచరులు కాపర్‌హెడ్ (copper-head) పామును చూశారని కూడా ఓ వెబ్‌సైట్ పేర్కొంది. ఇది నార్త్ కరోలినాలో సాధారణంగా కనిపించే ఒక విషపూరితమైన సర్పంగా తెలుస్తోంది. అయితే, ఎవరికీ ఏమీ హాని జరగలేదని ఫిఫా వర్గాలు పేర్కొన్నాయి.

# అఫ్గాన్ A ఏడు వికెట్లు.. పట్టుబిగిస్తున్న ఇండియా ఎ

ముక్కోణపు సిరీస్‌లో భాగంగా అఫ్గాన్ ఎతో జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా ఎ పట్టుబిగిస్తోంది. యశ్ ఠాకూర్ బౌలింగ్‌లో మహమ్మద్ ఇషాక్ (16) ఆరో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. ఫర్మానుల్లా సఫీ (17)ని సుర్యాంశ్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. 33 ఓవర్లకు అఫ్గాన్ A స్కోరు 204/7. ఆ జట్టు లక్ష్యం 320. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఇండియా ఎతో జరుగుతున్న మ్యాచ్‌లో అఫ్గాన్ ఎ ఐదు వికెట్లు కోల్పయింది. ఫైసల్ షినోజాదా (46; 56 బంతుల్లో)ని అనుకుల్ రాయ్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. బహిర్ షా (57; 52 బంతుల్లో) విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌లో సుర్యాంశ్‌కు క్యాచ్ ఇచ్చి ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు. 27.1 ఓవర్లకు అఫ్గాన్ A స్కోరు 173/5. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఇండియా ఎతో జరుగుతున్న మ్యాచ్‌లో అఫ్గాన్ ఎ బ్యాటర్లు పోరాడుతున్నారు. 320 పరుగుల లక్ష్యఛేదనలో అఫ్గాన్ 23 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసింది. బహిర్ షా (44), ఫైసల్ షినోజాదా (41) అర్ధ శతకాలకు చేరువయ్యారు. 320 పరుగుల లక్ష్యఛేదనలో అఫ్గాన్ బ్యాటర్లు నిలకడగా ఆడుతున్నారు. 18 ఓవర్లకు స్కోరు 124/3. బాహిర్ షా (28), ఫైసల్ షినోజాదా (34) నాలుగో వికెట్‌కు ఇప్పటివరకు 54 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ముక్కోణపు సిరీస్‌లో భాగంగా జరుగుతున్న కీలకమైన మ్యాచ్‌లో భారత్ A బౌలర్లు పట్టుబిగిస్తున్నారు. క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ అఫ్గానిస్థాన్ Aను కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ జట్టు 11 ఓవర్లకు మూడు వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది.



# వుదయం సినిమా

MOVIE TIME!

## కీర్తి సురేశ్ 'సావిత్రి'

**వుదయం సినిమా** ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి'. ఈ సినిమా విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. "న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది.



## ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబో మూవీ సంక్రాంతి రిలీజ్ కి సన్నాహాలు

**వుదయం:** చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ శ్రీనువైట్ల, స్టార్ ప్రొడ్యూసర్ అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబో మూవీ సంక్రాంతి రిలీజ్ కి సన్నాహాలు చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ శ్రీనువైట్ల, అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్ లో కార్యక్రమం నేడు జూబ్లీ హిల్స్‌లో ఘనంగా జరిగింది. ఆనందం, వెంకీ, ఢీ, రెడీ, కింగ్, దూకుడు, బాద్‌షా వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన శ్రీనువైట్ల, ఈసారి శర్వానంద్‌తో కలిసి మరో వినోదాత్మక చిత్రాన్ని అందించేందుకు సిద్ధమవుతున్నారు.ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని వచ్చే సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. నారీనారీ నడుమ మురారీ, బైకర్ వంటి వరుస బ్లాక్ బస్టర్ విజయాలతో దూసుకెలుతున్న శర్వా, ఇప్పుడు శ్రీనువైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ కలిసివస్తుండటంతో ఈ ప్రాజెక్ట్ పై ఇప్పటికే మంచి అంచనాలు నెల కొన్నాయి. ఈ చిత్రానికి సంబధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలోనే తెలియజేయనున్నారు.



తెరకెక్కనున్న నూతన చిత్రానికి సంబంధించిన ఆఫీస్ ప్రారంభోత్సవ పూజా

## 'పెద్ది'.. ప్రపంచవ్యాప్తంగా 400 కోట్లకు పైగా వసూళ్లు

**వుదయం:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద మరో భారీ మైలురాయిని అందుకుంది. 400 కోట్ల గ్రాస్ మార్క్‌ను అధిగమించి సరికొత్త రికార్డ్ సృష్టించింది. దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన ఈ రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా వీకెండ్ మాత్రమే కాకుండా, వర్కింగ్ డేస్‌లో సైతం బలమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది.రామ్ చరణ్ కెరీర్‌లో సోలో హీరోగా 400 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి చిత్రం 'పెద్ది' కావడం. రెండో వారంలోనూ సినిమా అద్భుతమైన రన్ తో రామ్ చరణ్ బాక్సాఫీస్ స్టామినా ఎంత బలంగా ఉందో మరోసారి నిరూపించింది. అలాగే ప్రేక్షకులు 'పెద్ది' పాత్రతో ఎంత ఎమోషనల్ గా కనెక్ట్ అయ్యారో ఈ విజయం రుజువు చేసింది.వెంకట సతీష్ కిలారు భారీ నిర్మాణ విలువలతో నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే 2026లో అత్యధిక వసూళ్లు సాధించిన దక్షిణ భారత చిత్రంగా నిలిచింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఈ సినిమా అద్భుతంగా రన్ అవుతూ ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను రాబడుతోంది.ఎమోషన్స్, యాక్షన్, స్పోర్ట్స్ డ్రామా, పల్లెటూరి నేపథ్య కథనం వంటి అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన 'పెద్ది' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. రామ్ చరణ్ పవర్‌ఫుల్ నటనకు తోడు బుచ్చిబాబు సానా అందించిన ఎమోషనల్ కథనం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలను అందుకుంటోంది.ట్రేడ్ వర్గాల అంచనా ప్రకారం 'పెద్ది' విజయయాత్ర ఇంకా కొనసాగుతూ రానున్న రోజుల్లో మరిన్ని భారీ వసూళ్లతో కొత్త రికార్డులు సృష్టించనుంది.




## 'కామ్రేడ్ కళ్యాణ్' ఫస్ట్ సింగిల్



**వుదయం:** కింగ్ ఆఫ్ ఎంటర్టైన్‌మెంట్ శ్రీ విష్ణు తన వెర్సటైల్ పెర్ఫార్మెన్స్, యూనిక్ కథలతో అలరిస్తున్నారు. ప్రతి సినిమాలోనూ హ్యూమర్ వుండేలా చూసుకునే శ్రీవిష్ణు తన లేటెస్ట్ ఫన్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'కామ్రేడ్ కల్యాణ్'తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ ప్రెజెంట్ చేస్తుండగా, జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం హిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ ఒరియా పిల్లా జూన్ 20న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ లో శ్రీవిష్ణు, మహిమా మధ్య కనిపించిన అందమైన కెమిస్ట్రీ, లవ్ వైబ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ, విజయ్ బుల్గానిన్ మ్యూజిక్, చోటా కె ప్రసాద్ ఎడిటర్ గా పని చేస్తున్నారు.తారాగణం: శ్రీ విష్ణు, మహిమా నంబియార్, రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే.

## ప్రేమ, గౌరవం, సమానత్వం కోసం ఒక న్యాయ పోరాటం– పి. సునీల్ కుమార్ రెడ్డి

**వుదయం:** సినిమా నాకు కేవలం వినోద మాధ్యమం కాదు. సమాజంలో ఎక్కువగా వినిపించని గొంతులను వినిపించే వేదిక. అందుకే నా సినీ ప్రయాణంలో సొంత ఊరు, గంగపుత్రులు, ఎ రొమాంటిక్ క్రైమ్ కథ, గల్ఫ్ వంటి చిత్రాల ద్వారా ప్రధాన స్రవంతి ఎక్కువగా పట్టించుకోని జీవితాలను, సమస్యలను తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నించాను.ఇప్పుడు నేను రూపొందించిన "LGBT: A Legal Battle" కూడా అలాంటి ప్రయత్నమే.ఎల్‌జీబీటీ సమాజం గురించి మనలో చాలా మందికి కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. కానీ ఆ అభిప్రాయాల వెనుక ఉన్న మనుషుల జీవితాలను, వారి బాధలను, వారి ఆశలను, వారి ప్రేమను అర్థం చేసుకోవడానికి మనం చాలా అరుదుగానే ప్రయత్నిస్తాం. ఈ సినిమా ఆ ప్రయత్నం.ఈ కథను చెప్పడానికి నేను కోర్ట్‌రూమ్ డ్రామా రూపాన్ని ఎంచుకున్నాను. ఎందుకంటే ఇది కేవలం ఒక సామాజిక అంశం మాత్రమే కాదు. ఇది గౌరవం, సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులకు సంబంధించిన అంశం. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పిస్తుంది. కానీ ఆ హక్కులు సమాజంలో ఎంతవరకు ఆచరణలో ఉన్నాయి అనే ప్రశ్న ఈ చిత్రానికి కేంద్ర బిందువు. ఈ సినిమా ఏ ఒక్క వ్యక్తి జీవిత కథ కాదు. అనేక మంది ఎల్‌జీబీటీ వ్యక్తులతో జరిగిన సంభాషణలు, వారి అనుభవాలు, వారి కుటుంబాల్లో ఎదుర్కొన్న సంఘర్షణలు, సమాజంలో ఎదురైన వివక్షలు, అలాగే భారతదేశంలో జరిగిన న్యాయపరమైన పరిణామాలు ఈ కథకు ప్రేరణగా నిలిచాయి.ఈ చిత్రం కోసం పరిశోధనలో భాగంగా మేము ఎల్‌జీబీటీ సమాజ సభ్యులు, కార్యకర్తలు, న్యాయవాదులు, విద్యావేత్తలు, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులతో మాట్లాడాము. వారి అనుభవాలు ఈ కథను మరింత నిజాయితీగా చెప్పడానికి సహాయపడ్డాయి.తెలుగు సినిమాల్లో చాలా కాలం పాటు క్వీర్ పాత్రలు హాస్యానికి లేదా వ్యంగ్యానికి పరిమితమయ్యాయి. కానీ వారు కూడా మనలాగే కలలు కనే మనుషులే. వారికి కూడా కుటుంబం, ప్రేమ, ఉద్యోగం, గౌరవం, భద్రత కావాలి.



## 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది - హీరో, నిర్మాత వడ్డే నవీన్



**వుదయం:** హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు వడ్డే నవీన్ మీడియాతో ముచ్చటించారు. ఈ చిత్రం గురించి ఆయన చెప్పిన సంగతులివే..

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' కథను ఎంచుకోవడానికి గల కారణాలు ఏంటి?**

'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' సినిమాలోని పాయింట్, కథ చాలా డిఫరెంట్‌గా, కొత్తగా ఉంటుంది. ఈ కథ నాకు చాలా నచ్చింది.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' మీ కంఫర్ట్ జోన్‌కి దూరంగా ఉంది కదా?**

ప్రస్తుతం ప్రేక్షకులు సినిమాల్ని చూసే తీరు మారింది. కేవలం కుటుంబ కథా చిత్రాలు, ప్రేమ కథా చిత్రాల్ని ఇస్తే సరిపోవడం లేదు.

**రీ ఎంట్రీలో మీరే నిర్మాతగా ఎందుకు మారాల్సి వచ్చింది?**

నాకు ఈ కథ మీదున్న నమ్మకం వేరే నిర్మాతలకు ఉండాలని లేదు. వేరే నిర్మాత అయితే కథ మారుస్తారని కాదు.. ఈ కథని నేను నమ్మాను. నిర్మించేందుకు కూడా ముందుకు వచ్చాను.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో ఎంటర్టైన్మెంట్ ఉంటుందా?**

త్రిమూర్తులు పాత్రలోనే వెంతో ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. కానిస్టేబుల్ పాత్రకి తగ్గట్టుగానే ఇందులో కనిపిస్తాను. ఈ సినిమా అయితే ప్రేక్షకులు ఊహించినట్టుగా రెగ్యులర్‌గా ఉండదు. సిస్టంలో ఉంటూనే పోరాడే కానిస్టేబుల్ పాత్రలో నేను కనిపిస్తాను.

## 'నాగబంధం' విజువల్ గా మెస్మరైజ్ చేస్తుంది.



డీవోపీ ఎస్. సౌందరరాజన్

**వుదయం:** విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా డీవోపీ ఎస్. సౌందరరాజన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.నాగబంధం ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?–నేను ఇంతకుముందు అభిషేక్ గారితో డెవిల్ సినిమా చేశాను. అప్పటి నుంచి ఆయనతో చాలా మంచి అనుబంధం ఉంది. అభిషేక్ చాలా పెద్ద విజన్‌తో ఈ కథను మొదలుపెట్టారు. నేను స్క్రిప్ట్ స్టేజ్ నుంచే ఈ ప్రాజెక్టులో ఇన్‌వాల్వ్ అయ్యాను.

## 'ఆల్ఫా' ట్రైలర్ విడుదల

**వుదయం:** ఆలియా భట్ ప్రధాన పాత్రధారిగా.. శర్వారి కీలక పాత్రలో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తోన్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. జూలై 3న సినిమా రిలీజ్ కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో బుధవారం మేకర్స్ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇద్దరు అందమైన హీరోయిన్స్ డెడ్లీ రోల్స్‌లో కనిపించనున్నారు. సరదాగా, థ్రిల్లింగ్‌గా రూపొందిన ఈ భారీ పాప్ కార్న్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ట్రైలర్ ఆకట్టుకుంటోంది.ట్రైలర్‌ను గమనిస్తే.. ఆలియా భట్‌ను శక్తివంతురాలిగా తయారు చేసే మెంటర్‌గా బాబీ డియోల్ క్రూరమైన పాత్రలో కనిపించారు. హంతకురాలి పాత్రలో ఆలియా భట్ నటించింది.



## జూన్ 27న మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోన్న విష్ణు మంచు 'కన్నప్ప'



**వుదయం:** డైనమిక్ హీరో విష్ణు మంచు గత ఏడాది 'కన్నప్ప' అంటూ ఆడియెన్స్‌ను ఎంతగానో ఆకట్టుకున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద 'కన్నప్ప' మూవీని డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన సంగతి తెలిసిందే. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం ఇలా ఎంతో మంది గొప్ప నటీనటులు కీలక పాత్రలను పోషించడంతో ప్యాన్ ఇండియా వైడ్‌గా క్రేజ్‌ను దక్కించుకుంది.'కన్నప్ప' సినిమాకి తెలుగులో వచ్చిన ఆదరణ, క్లైమాక్స్‌లో విష్ణు నటనకు వచ్చిన ప్రశంసల గురించి అందరికీ తెలిసిందే. మరోసారి ఈ విజువల్ వండర్‌ను ఆడియెన్స్‌కి అందించేందుకు విష్ణు మంచు రెడీ అయ్యారు. సినిమా రిలీజ్ అయి ఏడాది అవుతున్న సందర్భంగా మళ్లీ జూన్ 27న 'కన్నప్ప'ని లిమిటెడ్ స్క్రీన్‌లలో రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు విడుదల చేసిన రీ రిలీజ్ డేట్ పోస్టర్ వైరల్ అవుతోంది.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.